ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 09.07.2026 | సంపుటి : 12 సంచిక : 350 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




# కాల్పుల విరమణ కథ కంచికి

## భీకరదాడులు చేస్తాం • ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటాం: అమెరికా

"ఇరాన్ విద్యుత్ ప్లాంట్లను నాశనం చేయడం నాకు ఇష్టం లేదు. కానీ తప్పనిసరి పరిస్థితులు వస్తే వాటిని కచ్చితంగా నాశనం చేస్తాం. అలాగే ఇరాన్ ప్రజల దాహం తీర్చే డీశాలినేషన్ ప్లాంట్లపై కూడా దాడి చేయడం నాకు ఏమాత్రం ఇష్టం లేదు. కానీ అత్యవసరమైతే వాటిపైనా ఎటాక్ చేస్తాం. నిన్న రాత్రి మేము ఖర్గ్ ద్వీపంపై దాడి చేసి, ఒక భాగాన్ని ధ్వంసం చేశాం. అయితే నేను చమురును ముట్టుకోవద్దని మా సైన్యానికి చెప్పాను. ఎందుకంటే బహుశా మేము ఆ ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది. అందుకే నేను చమురు పైపులను ధ్వంసం చేయవద్దు, మిగతా వాటిని కొట్టండి అని చెప్పాను. మా సైన్యం అలానే చేసింది. ఈ రాత్రి కూడా మేము మళ్లీ దాడులు చేస్తాం. మేము ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటాం. దీనిపై వారు చేయగలిగింది ఏమీ లేదు." - డొనాల్డ్ ట్రంప్, అమెరికా అధ్యక్షుడు



- విద్యుత్ గ్రిడ్, నీటి సదుపాయాలనూ లక్ష్యంగా చేసుకుంటాం
- ఇరాన్ చాలా దారుణంగా ప్రవర్తిస్తోంది : ట్రంప్
- అంతకు ముందు ఇరాన్‌తో సీజ్‌ఫైర్ ముగిసిందని వెల్లడి
- ట్రంప్ ప్రకటనతో కుప్పకూలిన స్టాక్‌మార్కెట్
- పశ్చిమాసియాలో మళ్లీ నిప్పుల వాన..
- హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై టెహ్రాన్ దాడులు
- దీంతో ఆగ్రహించి ఇరాన్‌పై ప్రతిదాడులు చేసిన యూఎస్
- ప్రతిగా బహ్రెయిన్, కువైట్‌లోని 85 అమెరికా బేస్‌లపై
- ఐఆర్‌జీసీ క్షిపణుల వర్షం.. వేధింపుల శకం ముగిసిందని వెల్లడి


బహ్రెయిన్,కువైట్‌లలోని అమెరికా ఏయిర్‌బేస్‌లపై ఇరాన్ దాడులు

**వాషింగ్టన్,టెహ్రాన్(జనంసాక్షి):** ఇరాన్‌తో ఇటీవల చేసుకున్న కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిందని ప్రకటించిన కొన్ని గంటల్లోనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ రోజు రాత్రి ఇరాన్‌పై మరింత తీవ్రం గా దాడులు చేస్తామని హెచ్చరించారు. తుర్కియేలో జరుగుతున్న నాటో సదస్సులో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇరాన్ తీరు బాగాలేదన్నారు. నేడు మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడే అవకాశం ఉందని చెప్పారు.గత రాత్రి అమెరికా దళాలు జరిపిన దాడుల్లో 28 ఇరాన్ నౌకలను ధ్వంసం చేశామని ట్రంప్ పేర్కొన్నారు. మరిన్ని నౌకలను నాశనం చేస్తామని.. అవసరమైతే విద్యుత్ గ్రిడ్, నీటి సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటామన్నారు. అయితే, అటువంటి చర్యలు అవసరం అవుతాయని తాను భావించడం లేదన్నారు. అంతేకాదు.. ఇరాన్ చమురు ఎగుమతులకు జీవనాడిగా ఉన్న ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునే అవకాశం

మిగతా 2లో..

# కెనడా అభివృద్ధికి తెలంగాణ భాగస్వామ్యం కావాలి

## ఆ దేశ హైకమిషనర్ క్రిస్ కూటర్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

- తమ దేశ పర్యటనకు సీఎం నేతృత్వంలోని బృందానికి ఆహ్వానం
- కెనడా కంపెనీలు, పెట్టుబడిదారులను తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు ఆహ్వానించిన సీఎం
- రాష్ట్ర ప్రగతి దిశ, ఉద్యోగ కల్పనపై ప్రశంసలు కురిపించిన కెనడా హైకమిషనర్



**హైదరాబాద్(జనంసాక్షి):** కెనడా హైకమిషనర్ టు ఇండియా క్రిస్ కూటర్ బుధవారం ముఖ్యమంత్రి ఎ. రేవం త్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కెనడా–తెలంగాణ మధ్య వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులు, ఆవిష్కరణల రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై ఇరువురు విస్తృతంగా చర్చించారు. అదే సమయంలో ముఖ్యమంత్రి నేతృత్వంలోని తెలంగాణ ప్రతినిధి బృందాన్ని కెనడా పర్యటనకు రావాలని హైకమిషనర్ క్రిస్ కూటర్ ఆహ్వానించారు. ఈ సమావేశంలో తెలంగాణలో చేపడుతున్న భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులు, పట్టణాభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేకంగా చర్చ జరిగింది. ముఖ్యంగా మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు, హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ, ప్రతిష్ఠాత్మకంగా ప్రతిపాదించిన ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టుల్లో కెనడా భాగస్వామ్యానికి ఉన్న అవకాశాలను ఇరువురు చర్చలు జరిపారు. తెలంగాణ–కెనడా మధ్య పెరుగుతున్న పారిశ్రామిక, ఆర్థిక సంబంధాలను ప్రస్తావించిన క్రిస్ కూటర్, ఇటీవల కెనడాకు చెందిన ప్రముఖ సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం సంతోషకరమని పేర్కొన్నారు. ఫిరాన్ టెక్నాలజీ గ్రూప్, హైదరాబాద్‌లో తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించడం, సీఐబీసీ (సీఐబీసీ) హైదరాబాద్‌లో తన గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (జీసీసీ)ను ప్రారంభించడం వంటి పరిణామాలు తెలంగాణపై కెనడా కంపెనీల నమ్మకం, విశ్వాసానికి నిలువెత్తు నిదర్శనమని అన్నారు. దాంతోపాటు, ప్రపంచ

మిగతా 2లో..

# 'మీసేవ'లో యూరియా బుకింగ్




తెలంగాణ ప్రభుత్వం వినూత్న నిర్ణయం
యాప్‌లో బుకింగ్ చేసుకోలేనివారికి మార్గం సులువు

**హైదరాబాద్,జూలై8(జనంసాక్షి):** రాష్ట్రంలోని రైతులకు సబ్సిడీ యూరియా అందుబాటును మరింత సులభతరం చేయటం కోసం ప్రభుత్వం వినూత్న నిర్ణయం తీసుకుంది. పారదర్శకతను పెంపొందిస్తూ, సకాలంలో యూరియా పంపిణీ చేయటం కోసం రాష్ట్ర వ్యవసాయశాఖ యూరియా బుకింగ్ సేవను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మీ సేవ కేంద్రాల ద్వారా అందుబాటులోకి

మిగతా 2లో..

# తాడిచెర్ల-2 కేటాయింపులపై తప్పుడు ప్రకటన

- కిషన్ రెడ్డి తప్పుదోవ పట్టించే యత్నం
- 2013 లోనే సింగరేణికి అధికారికంగా కేటాయింపు
- మీడియా సమావేశంలో మండిపడ్డ డిప్యూటీ సిఎం భట్టి



**హైదరాబాద్,జూలై8(జనంసాక్షి):** సింగరేణి బొగ్గు గనుల కేటాయింపులపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రకట నలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. సింగరేణి కాలరీస్‌కు తాడిచెర్ల–2 బొగ్గు బ్లాక్‌ను తామే కొత్తగా కేటాయించామని, దానికి సంబంధించిన కొన్ని క్లియరెన్సులు ఇచ్చామని కేంద్ర పెద్దలు ప్రచారం చేసుకోవడంపై మండిపడ్డారు. వాస్తవాలను పూర్తిగా పక్కన పెట్టి, ప్రజలను తప్పుదోవ పట్టించేలా వేరేలా చిత్రీకరించడం ఎంతమాత్రం కరెక్ట్ కాదని స్పష్టం చేశారు. తాడిచెర్ల–2 బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం ఎప్పుడో 2013 లోనే సింగరేణి కాలరీస్‌కు అధికారికంగా కేటాయించిందని గుర్తుచేశారు. పైగా, గిరిజన ప్రాంతాలలో ఉండే బొగ్గు గనులను నిబంధనల ప్రకారం కేవలం ప్రభుత్వ కంపెనీలకు మాత్రమే ఇవ్వాల్సి ఉంటుందని, అలాంటప్పుడు ఇప్పుడు కొత్తగా మీరేదో అలాట్ చేసినట్లు చెప్పుకోవడం ఏంటని ప్రశ్నించారు. సింగరేణికి తాడిచర్ల కోల్

మిగతా 2లో..

# ఎన్నికలు ఎప్పుడొచ్చినా వార్ వన్‌సైడే

- ఇప్పటికే బిఆర్‌ఎస్‌కు ప్రజలు బుద్ది చెప్పారు
- పేదల సొంతింటి కలను ప్రభుత్వం సాకారం చేస్తోంది
- జూరాల, నెట్టంపాడు ముంపు భూనిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్లు: మంత్రి పొంగులేటి

**జోగులాంబ గద్వాల,జూలై8(జనంసాక్షి):** ఎప్పుడు ఎన్నికల వచ్చినా వార్ వన్ సైడేనని మళ్ళీ అధికారంలోకి వచ్చేది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వమేనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో జరిగిన అన్నిఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పడంతో పాటు, ప్రజా ప్రభుత్వానికి ప్రజల దీవెనలు అందించారన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం ర్యాలంపాడు గ్రామంలో జరిగిన

మిగతా 2లో..



# సత్తా చాటుతున్న విద్యా రంగం



- పీజీఐ ర్యాంకింగ్‌లో దూసుకొచ్చిన తెలంగాణ రాష్ట్రం
- ఉపాధ్యాయుల నియామకం, శిక్షణ, ప్రత్యేక శ్రద్ధ ప్రభావం
- ఫలితాలనిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్

**బడ్జెట్ కేటాయింపుల పెంపు.. ఉపాధ్యాయులు నియామకం.. పదోన్నతులు... అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా కల్పిస్తున్న మౌలిక వసతులు.. అన్నింటికి మించి విద్యా రంగంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూపుతున్న ప్రత్యేక శ్రద్ధతో రాష్ట్ర విద్యారంగం జాతీయ స్థాయిలో సత్తా చాటుతోంది. తాజాగా కేంద్రం విడుదల చేసిన ఫర్మార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ 2.0(పీజీఐ 2.0)లో తెలంగాణ ముందుకు దూసుకు వచ్చింది. పీజీఐలో 1000 స్కోరుకు గానూ తెలంగాణ స్కోరు 2024-25లో 552.5గా ఉండగా 2025-26లో అది 599.7కి చేరుకుంది. ఫలితంగా గతంలో 31 స్థానంలో నిలిచిన రాష్ట్రం ఇప్పుడు 5 స్థానాలు అధిగమించి 26వ స్థానానికి చేరుకుంది. గతంలో ఆకాంక్షి-1 విభాగంలో ఉన్న రాష్ట్రం ప్రస్తుతం ప్రచేష్ట-3 లోకి చేరుకుంది. విద్యా ప్రమాణాలు పెరగడంతో గతంలో ఉన్న స్థానం కంటే కనీసం ఒ క్కో స్థానాన్ని జిల్లాలు మెరుగుపర్చుకున్నాయి. ఈ గ్రేడింగ్‌లో ఏ జిల్లా కూడా గతం కంటే తక్కువ స్థానానికి పడిపోలేదు. ప్రతి పాఠశాలలో నాణ్యమైన విద్యా బోధన జరగడమే ప్రస్తుత ర్యాంకింగ్ పెరగడానికి కారణమైంది. 33 జిల్లాల్లో జనగాం, మంచిర్యాల వరుసగా 383, 360 స్కోరుతో ఉత్తమ్-3 విభాగంలో నిలిచాయి.**



**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్రంలో విద్యా ప్రమాణాల మెరుగే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం 10,006 ఉపాధ్యాయ నియామకాలు చేపట్టింది. డీఎస్సీ–2008కి చెందిన 1,382 మందిని కాంట్రాక్టు ఉపాధ్యాయు లుగా నియమించింది. పదేళ్ల పాటు విస్మ రించిన ఉపాధ్యాయ శిక్షణను పునఃప్రారం భించింది. 1,12,882 మంది ఉపాధ్యా యులు, 1,16,084 మంది ప్రధానోపాధ్యా యులకు వేసవిలో అయిదు రోజుల చొప్పు న శిక్షణ ఇచ్చారు. 2018 తర్వాత 2024, జూన్‌లో 34,706 మంది ఉపాధ్యాయులకు బదిలీలను చేపట్టింది. వివిధ కేడర్లలోని 25, 950 మంది ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది.ప్రభు త్వ పాఠశాలల్లోని మూడో తరగతి విద్యా ర్థులు ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల కంటే మెరుగైన ప్రతిభ కనపర్చారు. మూడో తరగ తి విభాగంలో తెలంగాణ ర్యాంకు 36 నుం చి 26కు, ఎనిమిది, తొమ్మిదో తరగతుల విభాగంలో 26 నుంచి 17కు ఎగబాకింది. రాష్ట్రంలోని 495 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో 283 విద్యాలయాలు ఇప్పటికే ఇంటర్మీడియట్

మిగతా 2లో..

# 3 నెలలు అవకాశమివ్వండి

## కాళేశ్వరం నీరు పారిస్తా

- చంద్రబాబు కోసమే గోదావరి నీళ్లు వదిలేస్తున్నారు
- చెరువులు ఎండిపోతున్నా నీళ్లు ఎత్తి పోయడం లేదు
- దేవాదుల ప్రాజెక్టు నుంచి కూడా నీళ్లు ఎత్తి పోయరా
- తుమ్మడిహట్టి వద్ద అనుమతులు ఉంటే మరి ఆనాడే ఎందుకు కట్టలేదు ?:హరీశ్ రావు



**హైదరాబాద్,జూలై8(జనంసాక్షి):** మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. మూడు నెలలు తనకు నీటి పారుదల శాఖ మంత్రిగా అవకాశం ఇస్తే ఎల్లంపల్లికి నీళ్లు తెచ్చి చూపిస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ భవన్‌లో ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. "మూడు నెలలు మంత్రిగా అవకాశం ఇవ్వండి. కన్నేపల్లి మోటార్లు ఆన్ చేస్తాం. ఎల్లంపల్లికి నీళ్లు తెస్తాం. ఒకవేళ తేలేకపోతే శాశ్వతంగా రాజకీయాల నుంచి వైదొలుగుతా. నాకు పదవులు కొత్త కాదు. 13 ఏళ్లు మంత్రిగా చేశా" అని హరీశ్‌రావు అన్నారు. గోదావరిలో నీళ్లు ఉన్నా ఎత్తిపోయకపోవడం క్రిమినల్ నెగ్లిజెన్స్ కిందకి వస్తుందని.. మిమ్మల్ని ఉరి తీసినా తప్పు లేదని సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఫైర్ అయ్యారు. గురువు చంద్రబాబుకు దక్షిణ చెల్లించడానికే గోదావరి నీళ్లను వదిలేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించేందుకే సీఎం రేవంత్ రెడ్డి నీటిని కిందకి వదులుతున్నాడన్నారు. ధర్మసాగర్, రామప్ప చెరువులు ఖాళీగా ఉంటే ఎందుకు నింపడం లేదన్నారు. కాళేశ్వరం కింద ప్రాజెక్టుల్లో నీళ్లు నింపి రైతులకు ఇవ్వాలని ఎందుకు అనుకోవడం లేదన్నారు. ఈ రోజు కూడా సమ్మక్క సాగర్ బ్యారేజీలో 1,08,000 క్యూసెక్కుల వరద ప్రవాహం ఉంది. దేవాదుల ప్రాజెక్టు అన్ని ఫేజులు కలిపి ఒక్కరోజులో 2,542 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయవచ్చన్నారు. సాధారణంగా

మిగతా 2లో..

# దేశవ్యాప్తంగా ఎన్ఐఏ సోదాలు

**న్యూఢిల్లీ,జూలై8(జనంసాక్షి):** దేశవ్యాప్తంగా ఎన్ఐఏ అధికారులు బుధవారం భారీగా సోదాలు చేపట్టారు. ఐసీస్ , ఏక్యూఐఎస్ ఉగ్రవాద కార్యకలాపాల ప్రచారంపై సోదాలు చేశారు. భారత్‌లో హింసాత్మక జిహాద్ ద్వారా ఇస్లామిక్ స్టేట్ ఏర్పాటు కుట్రపై దర్యాప్తు ముమ్మరం చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు 10

మిగతా 2లో..




# వదలని లీకుల బెడద

## నీట్-యూజిసి సోషియాలజీ ప్రశ్నాపత్రం లీకైంది .. ఎక్స్ వేదికగా రాహుల్ ఆరోపణలు



**న్యూఢిల్లీ,జూలై8(జనంసాక్షి):** నీట్–యూజీ పరీక్ష వివాదంపై ఇంకా కొనసాగుతుండగానే యూజీసీ–నెట్ సోషియాలజీ ప్రశ్నపత్రంపై మరోసారి లీక్ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా చేసిన ఆరోపణలు వీటికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. యూజీసీ–నెట్ పరీక్షకు ముందు 100 పేజీల పీడీఎఫ్ ఒకటి బయటకు వచ్చిందని రాహుల్ గాంధీ తన ఎక్స్ పోస్టులో రాసుకొచ్చారు. అందులో సుమారు 90 ప్రశ్నల వరకు ఒరిజినల్ సోషియాలజీ క్వశ్చన్ పేపర్‌లోని ప్రశ్నలతో సరిపోలాయన్నారు. ఈ ప్రశ్నపత్రం బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా, ఢిల్లీ, రాజస్థాన్‌లో సుమారు రూ. 2.25 లక్షలకు అమ్ముడుపోయిందని ఆయన ఆరోపించారు. ఇదే నెట్‌వర్క్ సీఎస్ఐఆర్–నెట్, హెచ్‌టీఈటీ, ఏడీప వంటి పరీక్షల ప్రశ్నపత్రాలను కూడా సరఫరా చేస్తోందనీ రాహుల్ పేర్కొన్నారు. గత జూన్ 30న జరిగిన ఈ ప్రశ్నపత్రం

మిగతా 2లో..

# అమెరికా వీసాలకు కొత్త రూల్స్..!

## హెచ్-1బీ వర్కర్లు, విద్యార్థులకు మరో కష్టం..

**వాషింగ్టన్(జనంసాక్షి):** అగ్రరాజ్యానికి వలసదారుల రాకపై ఇప్పటికే అనేక ఆంక్షలు విధించిన ట్రంప్ సర్కారు.. ఇప్పుడు ఇమిగ్రేషన్ విధానంలో మరిన్ని కొత్త రూల్స్ తీసుకొచ్చేందుకు సిద్ధమైంది. దీంతో హెచ్–1బీ వీసా ప్రోగ్రామ్ మరింత కఠినతరం కానుంది. విదేశీ ఉద్యోగులను నియమించుకునే సంస్థలపై అదనపు భారం పడే అవకాశం ఉంది. ఇక, అంతర్జాతీయ విద్యార్థులకు వీసాల జారీలో మార్పులు, పని అనుమతుల పొడిగింపును నిలిపివేయడం వంటి నిబంధనలు తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు

మిగతా 2లో..

# దేవాదాయ శాఖపై నేనెందుకు సమీక్షిస్తా?

- నా అధికారాలేంటో నాకు తెలియదా
- కొండా సురేఖ వ్యవహారంపై కడియం

**జనగామ,జూలై8(జనంసాక్షి):** తాను ఎక్కడా దేవాదాయ శాఖ అధికారులతో సమీక్షలు చేయడం కానీ, మంత్రి కొండా సురేఖ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం కానీ చేయలేదని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. జిల్లా వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారంటూ స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై ఏఐసీసీకి మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు

మిగతా 2లో..

## ‘మీసేవ’తో యూరియా బుకింగ్

తీసుకువచ్చింది. ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోలేని రైతులు తమ సమీపంలోని మీ సేవ కేంద్రాన్ని సందర్శించి, ఆపరేటర్ సహాయంతో యూరియా బుకింగ్ చేసుకోవచ్చు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల. శ్రీధర్ బాబు నేతృత్వంలో పనిచేస్తున్న మీసేవ, వ్యవసాయశాఖతో కలిసి ఈ కొత్త చొరవను ప్రారంభిస్తుంది.రైతు తన పట్టాదారు పాస్‌బుక్ నంబర్‌తో సమీపంలోని మీ సేవ కేంద్రాన్ని సందర్శించాలి. మీ సేవ ఆపరేటర్ రైతు వివరాలను సేకరించి, సాగు విస్తీర్ణం మరియు పంట వివరాలను నమోదు చేస్తారు. రైతు ఎంపిక చేసిన ఎరువుల డీలర్ వద్ద అవసరమైన యూరియా పరిమాణాన్ని బుక్ చేస్తారు. రైతు నమోదిత మొబైల్ నంబర్‌కు పంపిన ఓటిపిని ధృవీకరించిన తర్వాత వెంటనే బుకింగ్ ఐడి జారీ చేయబడుతుంది. మీ సేవ ద్వారా పొందిన బుకింగ్ ఐడి బుకింగ్ చేసిన తేదీని మినహాయించి 48 గంటలపాటు మాత్రమే చెల్లుబాటు అవుతుంది. బుకింగ్ గడువు ముగిసేలోపు రైతులు ఎంపిక చేసిన ఎరువుల డీలర్‌ను సంప్రదించి యూరియాను కొనుగోలు చేయాలి. సబ్సిడీ యూరియా బుకింగ్‌ను అధికారిక ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ లేదా మీ సేవ కేంద్రాల ద్వారానే చేయాలని వ్యవసాయశాఖ సూచిస్తోంది.ఓటిపి అందుకోవడానికి రైతులు తమ పట్టాదారు పాస్ బుక్ తో అనుసంధానమైన మొబైల్ నంబర్ యాక్టివ్‌లో ఉండేలా చూసుకోవాలి. కేవలం పదిరూపాయల నామమాత్రపు సేవా రుసుముతో మీసేవ ద్వారా రైతులు అందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. ఏవైనా సందేహాలు లేదా సహాయం కోసం సమీప వ్యవసాయ విస్తరణ అధికారి, మండల వ్యవసాయ అధికారి లేదా సమీప మీసేవ కేంద్రాన్ని సంప్రదించవచ్చు. ఈ సౌకర్యాన్ని రాష్ట్రంలోని రైతులందరూ వినియోగించుకొని, సబ్సిడీ యూరియాను అధికారిక బుకింగ్ విధానం ద్వారా పొందాలని వ్యవసాయశాఖ విజ్ఞప్తి చేస్తోంది.

## ఎన్నికలు ఎప్పడొచ్చినా వార్ వన్‌సైడే

సామూహిక ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు మరియు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో సహచర మంత్రి వాకిటి శ్రీహరి , ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు చేసుకున్న లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలిపి వారికి ఆత్మీయ చిరు కానుకలను అందించడం జరిగింది. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల రెండవ విడత మంజూరు పత్రాలను లబ్దిదారులకు పంపిణీ చేయడం జరిగింది. గద్వాల జిల్లా ప్రజలు చూపించిన అభిమానం మరువలేనిదన్నారు. పేదల ఆత్మ గౌరవానికి చిహ్నం ఇందిరమ్మ ఇండ్లు. దశాబ్దాల పేదల సొంతింటి కలను ప్రజా ప్రభుత్వంలో సాకారం చేస్తోంది. కుల, మత, రాజకీయాలకతీతంగా పేదలైతే అయితే చాలు ఇందిరమ్మ ఇల్లు కట్టించాలని ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. జూరాల, నెట్టంపాడు ముంపు భూ నిర్వాసితులకు కూడ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని అన్నారు.

WANAPARTHY DISTRICT GAZETTE
EXTRAORDINARY
PUBLISHED BY AUTHORITY

Gazette No. 41/2026 DATE: 01.07.2026.
File No: G/655/2026
The Right to Fair Compensation and in Transparency in Land Acquisition, Rehabilitation and Resettlement Act, 2013
(భూసేకరణ, పునరావాస, పునరావాసం కల్పనలో పారదర్శకత మరియు సముచిత పరిహారపు హక్కు చట్టం 2013 ...) [illegible]

ఫారం - VI
ప్రాథమిక ప్రకటన

[illegible] land acquired for purpose of MGKLIS- Karne thanda lift irrigation scheme - Shapur Mamidimada canal from Km. 4.575 to Km. 4.825, situated at Parwathapur village of Ghanpur Mandal [illegible]

| క్ర.సం | సర్వే నం. | [illegible] | [illegible] | విస్తీర్ణం | పట్టాదారు/అనుభవదారు పేరు | [illegible] | [illegible] | [illegible] | [illegible] |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 186 | పెట్ట | పట్టా | 00.27 | [illegible] | 187 | 185 | 189, 184 | VB of Shapur |
| 2 | 186 | పెట్ట | పట్టా | 00.27 | [illegible] | 187 | 185 | 189, 184 | VB of Shapur |
| 3 | 186 | పెట్ట | పట్టా | 00.27 | [illegible] | 187 | 185 | 189, 184 | VB of Shapur |
| 4 | 186 | పెట్ట | పట్టా | 00.01 | [illegible] | 187 | 185 | 189, 184 | VB of Shapur |
| 5 | 186 | పెట్ట | పట్టా | 00.07 | [illegible] | 187 | 185 | 189, 184 | VB of Shapur |
| 6 | 186 | పెట్ట | పట్టా | 00.07 | [illegible] | 187 | 185 | 189, 184 | VB of Shapur |
| 7 | 187 | పెట్ట | పట్టా | 00.32 | [illegible] | 188 | 186 | 189 | VB of Shapur |
| 8 | 187 | పెట్ట | పట్టా | 00.32 | [illegible] | 188 | 186 | 189 | VB of Shapur |
| 9 | 187 | పెట్ట | పట్టా | 00.05 | [illegible] | 188 | 186 | 189 | VB of Shapur |
| 10 | 187 | పెట్ట | పట్టా | 00.05 | [illegible] | 188 | 186 | 189 | VB of Shapur |
| మొత్తం విస్తీర్ణం (ఎ-గుం.ల) | | | | 04.10 | | | | | |

[illegible]

జిల్లా కలెక్టర్, వనపర్తి
DIPR RO.NO: 419/LA/PP/Advt/Pub/2026-27

# కాల్పుల విరమణ కథ కంచికి..

ఉందని ట్రంప్ వ్యాఖ్యానించారు. హర్మూజ్ జలసంధిలో దిగ్బంధనాన్ని అమెరికా తిరిగి కొనసాగించే అవకాశమూ ఉందన్నారు. అయితే, అది ఇరాన్‌కు మాత్రమే వర్తిస్తుందన్నారు. పశ్చిమాసియాలో మళ్లీ అగ్గి రాజుకుంటోంది. పశ్చిమాసియా మరోసారి నిప్పుల కొలిమిగా మారింది. అమెరికా-ఇరాన్ పరస్పర దాడులతో గల్ఫ్ దేశాల్లో సైరన్ల మోత మోగుతోంది. అగ్రరాజ్య దాడులపై తీవ్రంగా మండిపడ్డ టెహ్రాన్.. ప్రతీకార దాడులు మొదలుపెట్టింది. బహ్రెయిన్, కువైట్‌లో అమెరికాకు చెందిన 85 సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు ప్రయోగించింది. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై దాడులకు ప్రతిస్పందనగా.. ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు, తీరప్రాంత నిఘా వ్యవస్థలపై అమెరికా వైమానిక దాడులు చేసింది. దీనిపై ఐఆర్‌జీసీ తీవ్రంగా స్పందించింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని అగ్రరాజ్యం ఉల్లంఘించిందని ఆరోపించింది. దీనికి తాము కూడా ప్రతీకారం తీర్చుకుంటామని, అందుకే ఈ తాజా ఆపరేషన్ చేపట్టినట్లు వెల్లడించింది. బహ్రెయిన్ లోని యూఎస్ ఫిఫ్త్ ఫ్లీట్, కువైట్‌లోని అలీ అల్ సలేమ్ ఎయిర్ బేస్ సహా అగ్రరాజ్యానికి చెందిన 85 కీలక మిలిటరీ స్థావరాలను టార్గెట్ చేసినట్లు పేర్కొంది. వాటిపై క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించినట్లు తెలిపింది. బుషెహర్‌లో అమెరికా అత్యాధునిక డ్రోన్ ఎంక్యూ-9ను కూల్చినట్లు ఐఆర్‌జీసీ వెల్లడించింది.ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు జరుగుతోన్న వేళ ఈ ఉద్రిక్తతలు చోటుచేసుకోవడం గమనార్హం. దీనిపై ఐఆర్‌జీసీ స్పందిస్తూ.. తమ చారిత్రక కార్యక్రమాన్ని మరుగున పడేసేందుకు వాషింగ్టన్ ప్రయత్నిస్తోందని దుయ్యబట్టింది. తాజా దాడులపై ఇరాన్ స్పీకర్ ఘాలిబఫ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. వేధింపులు, బెదిరింపుల శకం ముగిసింది. ఇక మేం తలొగ్గబోం. అమెరికా తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడుతోంది. ఆ దేశం ఎంత ఒత్తిడి చేసినా.. టెహ్రాన్ లొంగిపోదని రాసుకొచ్చారు.ఇరాన్‌పై ఈసారి అతిపెద్ద దాడి జరిపినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. దాదాపు 80కి పైగా లక్ష్యాలపై అత్యంత కచ్చితత్వంతో దాడులు చేసినట్లు తెలిపింది. టెహ్రాన్ కమాండ్, కంట్రోల్ నెట్‌వర్క్‌లు, కోస్టల్ రాడార్ సైట్లు, యాంటీ షిప్ మిస్సైల్ సామర్థ్యాలు, గగనతల రక్షణ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నట్లు పేర్కొంది. ఈ దాడుల్లో ఐఆర్‌జీసీకి చెందిన 60 చిన్న బోట్లు ధ్వంసమైనట్లు వెల్లడించింది. కాగా.. ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నాటో శిఖరాగ్ర సదస్సు కోసం తుర్కియేలో ఉన్నారు. అక్కడి నుంచే ఇరాన్‌పై తాజా దాడులకు ఆయన ఆదేశాలిచ్చినట్లు సమాచారం. మొత్తంగా అమెరికా,ఇరాన్ పరస్పర దాడులతో మళ్లీ ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. ఇరాన్‌పై అమెరికా మరోసారి దాడులు చేసింది. హర్మూజ్ జలసంధిలో మూడు వాణిజ్య నౌకలపై దాడులు జరిగిన గంటల వ్యవధిలోనే ఇరాన్ సైనిక స్థావరాలు, నౌకాశ్రయాల మౌలిక సదుపాయాలపై విరుచుకుపడింది. ఈమేరకు యుఎస్ సెంట్రల్ కమాండ్ ఓ ప్రకటన విడుదల చేసింది. అంతర్జాతీయ జలమార్గంలో అమాయక పౌరులు ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై దాడులకు ఇరాన్ మూల్యం చెల్లించుకునేలా.. అమెరికా దళాలు ఈ దాడులు చేపట్టాయని పేర్కొంది. ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు, తీరప్రాంత నిఘా వ్యవస్థలు, క్షిపణి నిల్వలు, డ్రోన్ల ప్రయోగ స్థావరాలను తమ సేనలు లక్ష్యంగా చేసుకున్నట్లు ఓ అమెరికా అధికారి తెలిపారు. ఇరాన్ నౌకాశ్రయాల మౌలిక సదుపాయాలపైనా దాడులు చేసినట్లు చెప్పారు. ఖేష్మ్, బందర్ అబ్బాస్‌లలో పేలుళ్ల శబ్దాలు వినిపించినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా తెలిపింది. ఈ దాడులకు ముందే చమురు విక్రయాలకు సంబంధించి ఇరాన్ లైసెన్స్‌ను అమెరికా రద్దు చేసింది. హర్మూజ్‌లో ఇరాన్ చర్యలు ఆమోదయోగ్యం కావని, అందుకే లైసెన్స్‌ను రద్దు చేసినట్లు ఓ అమెరికా అధికారి తెలిపారు. ఈ చర్యను ఇరాన్ విదేశాంగశాఖ తీవ్రంగా ఖండించింది. ఇది తాత్కాలిక ఒప్పందాన్ని ఉల్లంఘించ చడమేనని పేర్కొంది. దీని పర్యవసానాలకు అమెరికా ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పింది. ఇకపోతే బహ్రెయిన్, కువైట్‌పై బుధవారం ఇరాన్ దాడులు చేసింది. బహ్రెయిన్‌లో మిస్సైల్ అలర్ట్ సైరన్ మోగించారు. ఇరాన్‌పై మంగళవారం అమెరికా దాడులు చేసిన నేపథ్యంలో.. కౌంటర్‌గా ఇరాన్ అటాక్ చేసింది. అలర్ట్ సైరన్ మోగిన వెంటనే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని బహ్రెయిన్ ప్రకటన చేసింది. బహ్రెయిన్‌లో కానీ, కువైట్‌లో కానీ డ్యామేజ్ అయినట్లు ప్రస్తుతం ఎటువంటి సమాచారం లేదు. తాజాగా హోర్ముజ్ జలసంధిలో మూడు ఆయిల్ ట్యాంకర్లపై ఇరాన్ దాడి చేసింది. ఆ దాడులకు బదులుగా శక్తివంతమైన రీతిలో అమెరికా ప్రతిదాడి చేసింది. సుమారు 80 టార్గెట్లను ధ్వంసం చేశామని, దీంట్లో ఐఆర్జీసీకి చెందిన 60 బోట్లు ఉన్నట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ పేర్కొన్నది. ఖాసిమ్ దీవి, బందర్ అబ్బాస్, సిరిక్ ప్రాంతాలపై దాడులు జరిగినట్లు ఇరానీ మీడియా తెలిపింది. స్థానిక ప్రజలు గాయపడినట్లు తెలిసింది. అయితే హోర్ముజ్‌లో మూడు ట్యాంకర్లపై దాడికి తామే బాధ్యులమని ఇరాన్ ఇప్పటి వరకు ప్రకటించలేదు.

## అమెరికా వీసాలకు కొత్త రూల్స్..!

డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ, కార్మిక శాఖ తాజా రెగ్యులేటరీ అజెండాల్లో ఈ ప్రతిపాదిత మార్పులను పేర్కొన్నారు.వీటిల్లో కొన్నింటిని ఈ నెలలోనే అమల్లోకి తెచ్చే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇమిగ్రేషన్ విధానాల్లో కొన్ని మార్పులను తుది నిబంధనల కింద ప్రకటించనున్నారు. మిగతా వాటిని ప్రతిపాదనల కింద ప్రకటించి.. ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించనున్నట్లు తెలుస్తోంది. కొత్త మార్పులు అమల్లోకి వస్తే.. భారతీయ వృత్తి నిపుణులు, విద్యార్థులు, హెచ్-4 వీసాదారులపై ఎక్కువగా ప్రభావం పడనుంది. అయితే, ఈ ప్రతిపాదిత విధానాలపై అమెరికా సర్కారు నుంచి అధికారిక ప్రకటన రాలేదు. ప్రస్తుతం అమెరికాలో 50 మందికి పైగా ఉద్యోగులున్న కంపెనీలు.. అర్హత కలిగిన హెచ్-1బీ పిటిషన్లకు అదనంగా 4000 డాలర్లు, ఎల్-1 పిటిషన్లకు 4500 డాలర్ల చొప్పున ఫీజును చెల్లిస్తున్నాయి. అయితే, తొలిసారి అమెరికాకు వచ్చిన ఉద్యోగి లేదా సంస్థ మారిన ఉద్యోగిని స్పాన్సర్‌ను చేసినప్పుడు మాత్రమే ఈ ఫీజు వర్తిస్తుంది. కానీ, ఇప్పుడు ప్రతిపాదిత నిబంధనల ప్రకారం.. వీసా పొడిగింపు పిటిషన్లకు కూడా ఈ అదనపు ఫీజులు చెల్లించాల్సి వస్తుంది. ఈ కొత్త రూల్స్ జులైలోనే అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది.ఈసారి థర్డ్ పార్టీ క్లయింట్ లొకేషన్‌లో హెచ్-1బి ఉద్యోగుల నియామకాలపై కూడా అమెరికా దృష్టిపెట్టింది. కొత్త రూల్స్ ప్రకారం.. ఇకపై క్లయింట్ సైట్‌లో నియామకాలు చేపట్టినప్పుడు.. ఉద్యోగి-యజమాని వాస్తవ సంబంధాలను ఆయా కంపెనీలు నిరూపించుకోవాల్సి ఉంటుంది. అంతేగాక, ఆ లొకేషన్లలో పనిచేసే వృత్తి నిపుణుల అసైన్‌మెంట్ రికార్డులను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి తెలియజేయాల్సి ఉంటుంది. సాధారణంగా థర్డ్‌పార్టీ క్లయింట్ లొకేషన్ నియామకాలను ఎక్కువగా భారత ఐటీ, కన్సల్టింగ్ సంస్థలు చేపడుతుంటాయిఎంట్రీ లెవల్ ఉద్యోగాల్లో కనీస వేతన పరిమితిని రెట్టింపు చేసేలా ప్రతిపాదనలు చేశారు. దీని వల్ల విదేశీ వృత్తి నిపుణులను స్పాన్సర్ చేసే కంపెనీలపై అదనపు భారం పడనుంది. ఇక, హెచ్-4 భాగస్వాముల పని అనుమతులను ఆటోమేటిక్‌గా పొడిగించే వ్యవస్థకు స్వస్తి పలకనున్నారు.మరోవైపు, అంతర్జాతీయ విద్యార్థులకు ప్రస్తుతమున్న ‘డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్’ వ్యవస్థను తొలగించి ఫిక్స్‌డ్ పీరియడ్ వీసా జారీ వ్యవస్థను తీసుకురానున్నారు.

## సత్తా చాటుతున్న విద్యా రంగం

వరకు అప్‌గ్రేడ్ కాగా 2025?26 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం మరో 120 కేజీబీవీలను ఇంటర్మీడియట్ స్థాయికి అప్‌గ్రేడ్ చేసింది. 93 కేజీబీవీలను యంగ్ ఇండియా ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా గుర్తించి ఇంజినీరింగ్, మెడిసిన్, న్యాయ విద్య ప్రవేశ పరీక్షలకు విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ ఫలితాల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యం తెలుగులో 9 శాతం నుంచి 35 శాతానికి, ఇంగ్లిష్‌లో 4 శాతం నుంచి 29 శాతానికి, ఉర్దూలో 19 శాతం నుంచి 40 శాతానికి, గణితంలో 18 శాతం నుంచి 30 శాతానికి పెరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం ఏక్‌స్టెప్ ఏఎక్స్‌ఎల్-ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమాన్ని 1,354 పాఠశాలల్లో అమలు చేస్తూ 15,848 మంది విద్యార్థులకు చదవడం, అవగాహన చేసుకోవడం, అంకెలు, సంఖ్యా పరిజ్ఞానంలో శిక్షణ ఇస్తోంది. ఫిజిక్స్‌వాలా ఉచిత డిజిటల్ కోచింగ్‌ను 194 మోడల్ స్కూళ్లు, 495 కేజీబీవీలు, 37 తెలంగాణ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో అందిస్తోంది. ఆరు నుంచి 12వ తరగతి వరకు గణితం, సైన్స్ బోధనకు ఖాన్ అకాడమీ ఉచితంగా చేయూతనిస్తోంది. 1,132 పాఠశాలల్లో ఐసీటీ ల్యాబ్‌లు, 2,036 పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, 4,249 ప్రాథమిక పాఠశాలల్లో ఏఎక్స్‌ఎల్ కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు.రాష్ట్ర ప్రభుత్వం 2025?26 విద్యా సంవత్సరంలో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, డిజిటల్ లిటరసీని పాఠ్యాంశాల్లో చేర్చింది. ఒకటి నుంచి అయిదో తరగతి గణితం పాఠ్యపుస్తకాల్లో డిజిటల్ లిటరసీ అధ్యాయాన్ని, ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు ఏఐ, కోడింగ్, డేటా హ్యాండ్లింగ్, డిజైన్ థింకింగ్‌తో కూడిన డిజిటల్ లెర్నింగ్ మాడ్యూల్‌ను ప్రవేశపెట్టారు.ఉత్తమ విద్యా విధానాల అధ్యయనానికి ఫిన్లాండ్, జర్మనీ దేశాలకు అధ్యయన పర్యటనలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించింది. ఇందులో సుమారు 500 మంది ఉపాధ్యాయులు, అధికారులు భాగస్వాములయ్యారు. 2025-26 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తీర్ణత 95.15 శాతంగా నమోదైంది. 5,731 పాఠశాలలు 100 శాతం ఫలితాలు సాధించాయి.

## వదలని లీకుల బెడద

పరీక్షకు ముందే లీకైందని వచ్చిన మీడియా కథనాలనూ ప్రస్తావించారు రాహుల్. కాగా.. రోహ్‌తక్(హరియాణా)లో ఇద్దరు విద్యార్థి నాయకులు ఓ వీడియోనూ పోస్ట్ చేస్తూ.. పరీక్షకు ముందే బోధించిన 2 ప్రశ్నపత్రాల సెట్లలో ఒకటి అసలు దానితో సరిపోలుతోందని పేర్కొన్నారు. కాగా.. ఈ పరీక్షకు హాజరైన పలువురు అభ్యర్థులు ప్రశ్నపత్రంలో అనేక అక్షర, వ్యాకరణ దోషాలు సహా క్లారిటీలేని ప్రశ్నలున్నాయనే వ్యాఖ్యలు చేశారు. దీనికి సంబంధించి కొందరు పలు ఉదాహరణలను కూడా సోషల్ మీడియాలో పంచుకున్నారు. ముఖ్యమైన సామాజిక శాస్త్రవేత్తల పేర్లను తప్పుగా ముద్రించడం సహా సంబంధంలేని ప్రశ్నలను అడిగారని వారు పేర్కొన్నారు. మొత్తం 150 ప్రశ్నల్లో కనీసం 67 ప్రశ్నలు గతంలో నిర్వహించిన 2024 పరీక్షలో వచ్చిన వాటితో పోలి ఉన్నాయని, కనీసం బహుళైచ్ఛిక ప్రశ్నల సమాధానాల క్రమమూ మారలేదని ఆరోపించారు. అయితే.. ఈ ఆరోపణలపై జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ) నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందనా రాలేదు.

## తాడిచెర్ల-2 కేటాయింపులపై తప్పుడు ప్రకటన

బ్లాక్ -2 కేటాయించినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారని.. కానీ వాస్తవాలు దాచిపెట్టి వేరేలా చిత్రీకరించడం సరికాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం భట్టి మీడియాతో మాట్లాడుతూ.. 2013 సెప్టెంబర్ 16న ఈ కోల్ బ్లాక్‌ను ఆనాటి యూపీఏ ప్రభుత్వం సింగరేణికి కేటాయించిందని గుర్తుచేశారు. ఇప్పుడు కొత్తగా కోల్ బ్లాక్ కేటాయించినట్లు చెప్పడం ఏంటని ప్రశ్నించారు. మైనింగ్ లీజుకు దరఖాస్తు చేస్తే ఇన్నాళ్లూ పెండింగ్‌లో పెట్టారని.. ఎమ్ఎమ్‌బీఆర్ యాక్ట్ రాకముందే ఈ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించారని తెలిపారు. కేంద్ర మంత్రులను కలిసి చరిత్ర మొత్తం వివరించామని భట్టి అన్నారు. రాష్ట్రం నుంచి కొట్లాడి ఈ మైనింగ్ లీజుకు తెచ్చుకున్నామన్నారు. ట్రైబల్ ఏరియాలో ట్రైబల్స్ లేదా ప్రభుత్వ సంస్థలు మాత్రమే పని చేయాలని.. ప్రైవేట్ కంపెనీలు పని చేయడానికి అవకాశం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సత్తుపల్లి బ్లాక్ 3, కోయగూడెం బ్లాక్3కు టెండర్ వేశారని అన్నారు. బీఆర్ఎస్ బినామీలు ఆక్షన్‌లో పాల్గొని వాటిని దక్కించుకున్నారన్నారు. ఇన్నాళ్లూ సింగరేణికి తాడిచర్ల కోల్ బ్లాక్ లీజుకు ఇవ్వకపోవడం వల్ల వేల కోట్ల నష్టం జరిగిందని చెప్పుకొచ్చారు. గోదావరి పరిసరాల్లోని కోల్ బ్లాక్స్ అన్నింటినీ సింగరేణికి కేటాయించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు.

## దేవాదాయ శాఖపై నేనెందుకు సమీక్షిస్తా?

చేసిన విషయం తెలిసిందే. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. ’నేను ఏ తప్పూ చేయలేదు.. వివరణ ఎందుకు ఇస్తా’ అని అన్నారు. ప్రోటోకాల్‌కు లోబడే పనిచేస్తానని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని పలు ఆలయాల సమస్యలపై సంబంధిత శాఖ అధికారులు, ఆలయ చైర్మన్లను కలిశానని చెప్పారు. అధికారులతో ఎలాంటి సమీక్ష నిర్వహించలేదని, సమస్యలు మాత్రమే విన్నవించినట్లు వివరించారు. దేవదాయ శాఖలో నిధులు లేవంటే... నియోజకవర్గం లోని ఆలయాల సమస్యల పరిష్కారానికి ఎస్టిమేషన్‌లను మాత్రమే కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆ శాఖపై సమీక్ష నిర్వహించే హక్కు తనకు లేదని తెలుసన్నారు. ఇదంతా అవగాహన లోపంతోనే జరుగు తోందన్నారు. కొందరు కొత్త అలవాట్లు నేర్చుకున్నారని.. కాంట్రవర్సీ క్రియేట్ చేస్తూ ప్రజల మధ్యలో ఉండాలనుకుంటున్నారని వ్యాఖ్యానించారు. నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోసం.. మంత్రులను అవసరమైతే ముఖ్యమంత్రిని కూడా కలుస్తానని చెప్పారు. ఆలయాల సమస్యల పరిష్కారం కోసం మాత్రమే కమిషనర్‌ను కలిసినట్లు కడియం శ్రీహరి స్పష్టం చేశారు.

## దేశవ్యాప్తంగా ఎన్ఐఏ భారీగా సోదాలు

రాష్ట్రాలు, ఢిల్లీ కేంద్రపాలిత ప్రాంతంలోని మొత్తం 20 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు.ఈ సోదాల్లో పలు డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న పరికరాలను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపనున్నట్లు ఎన్ఐఏ అధికారులు తెలిపారు. ఈ కేసులో ఇప్పటివరకు 11 మంది నిందితులు, ఓ బాలుడిని జువెనైల్ నుంచి అదుపులోకి తీసుకున్నామని అధికారులు వెల్లడించారు. విజయవాడ పోలీసులు మార్చిలో నమోదు చేసిన కేసును మేలో ఎన్ఐఏకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ప్రధాన నిందితుడు రెహ్మతుల్లా షరీఫ్ మహ్మద్ నివాసంలో గతంలో ఐసీస్, ఏక్యూఐఎస్‌కు సంబంధించిన అభ్యంతరకర ప్రచార సామగ్రి లభ్యమైంది. గతంలో స్వాధీనం చేసుకున్న డిజిటల్ పరికరాల సాంకేతిక విశ్లేషణ ఆధారంగా ఎన్ఐఏ అధికారులు ఇవాళ సోదాలు నిర్వహించారు. అరెస్టైన నిందితులు దేశంలోని యువతను జిహాదీ భావజాలం వైపు మళ్లించే ప్రయత్నాలు చేసినట్లు అధికారుల దర్యాప్తులో వెల్లడైంది. విదేశీ హ్యాండ్లర్లతో ఆన్‌లైన్ ద్వారా సంబంధాలు కొనసాగిస్తూ ఉగ్ర భావజాలాన్ని వ్యాప్తి చేసినట్లు ఎన్ఐఏ అధికారులు గుర్తించారు. దేశాన్ని అస్థిరపరిచి ’ఖలీఫత్’ స్థాపనకు కుట్ర పన్నిన వారిని గుర్తించే దిశగా దర్యాప్తు కొనసాగుతోందని ఎన్ఐఏ అధికారులు పేర్కొన్నారు.

# కెనడా అభివృద్ధికి తెలంగాణ భాగస్వామ్యం కావాలి

ప్రసిద్ధి చెందిన క్యాపిటల్ సంస్థ సీపీపీ ఇన్వెస్ట్‌మెంట్స్ హైదరాబాద్‌కు చెందిన సీటీఆర్ ఎల్ఎస్(అబితీశ్రీా) డేటా సెంటర్స్ తో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుని ఒక బిలియన్ కెనడియన్ డాలర్ల వరకు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడం తెలంగాణ పెట్టుబడి సామర్థ్యాన్ని మరింత బలపరిచిందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఐటీ, లైఫ్ సైన్సెస్, రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో సాధించిన పురోగతిని క్రిస్ కూటర్ బృందానికి వివరించారు. ముఖ్యంగా ప్రపంచంలోని ఫార్చ్యూన్-500 కంపెనీల గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు (జీసీసీలు) హైదరాబాద్‌ను కేంద్రంగా ఎంచుకుంటున్నాయని తెలిపారు. మూసీ నది పునరుద్ధరణను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని సీఎం రేవంత్ వివరించారు. నదీ తీరాన్ని అభివృద్ధి చేసి కొత్త ఆర్థిక వ్యవస్థను నిర్మించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. అలాగే రాష్ట్రంలో సౌర విద్యుత్ విస్తరణ, హరిత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి కెనడా సహకారం అందించాలని కోరారు. తెలంగాణను ప్రపంచ స్థాయి నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం వెల్లడించారు. ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు. ఇదే తరహాలో కెనడాకు చెందిన ప్రముఖ విశ్వవిద్యాలయాలు కలిసి హైదరాబాద్‌లో మల్టీ-యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించనున్న రెండో తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్లో పాల్గొనాలని కెనడా కంపెనీలు, పెట్టుబడిదారులు, విద్యా సంస్థలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. తెలంగాణలో కొత్త పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యాలకు ఇది మంచి వేదికగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మాట్లాడిన హైకమిషనర్ క్రిస్ కూటర్, తెలంగాణ ప్రభుత్వం దూరదృష్టితో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రశంసించారు. ఉద్యోగాల కల్పన, పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణ అనుసరిస్తున్న విధానం ఆదర్శప్రాయమని కొనియాడారు. రాష్ట్రంలో ఉన్న ప్రతిభావంతులైన యువశక్తి తెలంగాణకు మరింత బలం చేకూరుస్తోందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు కెనడా అన్ని విధాలా సహకరిస్తుందని హామీ ఇచ్చిన క్రిస్ కూటర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కెనడా పర్యటనకు ఆహ్వానించారు. రాబోయే నెలల్లో కెనడా వాణిజ్య ప్రతినిధి బృందం తెలంగాణకు వచ్చి ఇంధన రంగం, పట్టణాభివృద్ధి, రక్షణ, ఏరోస్పేస్ తదితర రంగాల్లో పెట్టుబడులు, భాగస్వామ్య అవకాశాలపై విస్తృతంగా చర్చిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్-అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ బి. అజిత్ రెడ్డి, టీజీఐఐసీ ఎండీ శశాంక, ఐటీ,ఈ అండ్ సీ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్

**గోద్రెజ్ ఆధ్వర్యంలో ఏర్పాటుపై సీఎం రేవంత్‌తో చర్చలు**

**ముఖ్యమంత్రితో మలేషియా ఎంపీ శరవణన్ భేటీ**

హైదరాబాద్,జూలై8(జనంసాక్షి): తెలంగాణలోనే మొట్టమొదటి ప్రైవేట్ సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ త్వరలో ప్రారంభం కానుంది. కమ్మం జిల్లాలో ఏర్పాటు కానున్న దీనిపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ ప్రెసిడెంట్( కార్పొరేట్ వ్యవహారాలు) రాకేశ్‌స్వామి, గోద్రేజ్ అగ్రోవెట్ ఆయిల్ పామ్ బిజినెస్ సీఈఓ సౌగతో నియోగి బుధవారం కలిశారు. గోద్రేజ్ ఆగ్రోవెట్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణపైన ముఖ్యమంత్రికి నివేదిక అందజేశారు. ఈ నేపథ్యంలో పలు కీలక అంశాలపైన సీఎం చర్చించారు. ఖమ్మం జిల్లాలో రూ.300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా 700 మందికి పైగా ఉపాధి లభించనుంది. ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, నర్సరీ, ఆర్ అండ్ డీ కేంద్రం, సీడ్ గా÷-డ్గ÷న్ ఏర్పాటు కోసం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలో 113.5 ఎకరాల భూమిని గోద్రేజ్ ఆగ్రోవెట్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. సీడ్ గా÷-డ్గ÷న్ కోసం అదనంగా 35 నుంచి 40 ఎకరాల భూమిని కేటాయించాలని ప్రభుత్వాన్నిఈ సంస్థ కోరింది. ప్రాసెసింగ్ మిల్ కోసం రోడ్డును విస్తరించాలని ముఖ్యమంత్రిని ఈ సంస్థ ప్రతినిధులు కోరారు. టీజీఐఐసీ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ చేపట్టాలని సంబంధిత అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

**రేవంత్‌తో మలేషియా ఎంపి శరవణన్ భేటీ**

ఎం.సీ.ఆర్.హెచ్.ఆర్డీ బోధీ పెవిలియన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మలేషియా పార్లమెంటు సభ్యుడు డా. ఎం.శరవణన్. మర్యాదపూర్వకంగా కలిసారు. గ్రీన్ గ్రోత్ ఎకనామిక్ సమ్మిట్ 2026 లో పాల్గొనడానికి హైదరాబాద్ కు వచ్చిన శరవణన్ సిఎంతో భేటీ అయ్యారు. సీఎంని కలిసిన వారిలో గ్రీన్ గ్రోత్ ఎకనామిక్ సమ్మిట్ 2026 పాల్గొన్న మరికొందరు అంతర్జాతీయ ప్రతినిధులు ఉన్నారు..పర్యావరణ, సామాజిక, పరిపాలన పరమైన అంశాలతో పాటు మౌలిక సదుపాయాలు, ఏఐ వినియోగంతో పాటు భవిష్యత్తు పెట్టుబడులపైన ముఖ్యమంత్రి, శరవణన్, అంతర్జాతీయ ప్రతినిధుల మధ్య చర్చ జరిగింది. మావేశంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

## 3నెలలు అవకాశమివ్వండి

దేవాదుల మోటర్లు 71 మీటర్ల నీళ్లు ఉంటే పనిచేస్తాయి, కానీ ఇప్పుడు 75 మీటర్ల నీళ్లు ఉన్నాయి. అంటే నీళ్లు ఉండి కూడా కావాలని ఎత్తిపోయడంలేదని ఆరోపించారు. దేవాదుల ప్రాజెక్టులో సగానికి పైగా మోటార్లు అసలు ఆన్ చేయలేదు.మీ నిర్లక్ష్యం వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపు 80శాతం చెరువులు ఎండిపోయి ఉన్నాయన్నారు. మేడిగడ్డ దగ్గర బ్యారేజ్ కట్టొద్దని నిపుణులు ఎక్కడా చెప్పలేదని.. మేడిగడ్డ దగ్గర బ్యారేజ్ నిర్మించేందుకు అనుకూలంగానే ఉందని రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ నివేదిక ఇచ్చిందని హరీశ్ రావు స్పష్టం చేశారు. మేడిగడ్డ నుండి 160టీఎంసీల నీళ్లు మిడ్ మానేరు తీసుకువెళ్లేందుకు పరిస్థితులు అనుకూలిస్తాయా లేదా అన్న దాని గురించి మా కమిటీ వేశారని రిటైర్డ్ ఇంజనీర్లు చెప్పారు. పీసీ ఘోష్ కమిషన్‌కు కూడా ఈ రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ నివేదిక ఇచ్చిందని హరీశ్ రావు అన్నారు. మేడిగడ్డ దగ్గర బ్యారేజ్ కట్టొచ్చు కానీ నేరుగా మిడ్ మానేరుకు నీరు తీసుకెళ్లడం సాధ్యం కాదని ఆనాడు కమిటీ చెప్పింది. కమిటీ సూచనల మేరకు నేరుగా నీళ్లు తరలించే ప్రతిపాదనను బీఆర్ఎస్ ప్రభుత్వం ఉపసంహరించుకుందని రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ పీసీ ఘోష్ కమిషన్‌కు నివేదిక ఇచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మేము చెప్పినట్టే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిందని అఫిడవిట్ రూపంలో పీసీ ఘోష్ కమిషన్‌కు రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ తెలిపింది. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ రిపోర్టు పట్టించుకోలేదని రేవంత్ రెడ్డి చిల్లర మాటలు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. మేడిగడ్డ దగ్గర చిన్న రబ్బర్ డ్యామ్ వేసి మోటార్లు ఆన్ చేసి కాళేశ్వరం నీళ్లు వాడుకోవచ్చని రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంజనీర్లు ఒక రిపోర్ట్ ఇచ్చారని.. ఉత్తమ్ కుమార్ రెడ్డి నీకు చిత్తశుద్ధి ఉంటే ఆ రిపోర్ట్ బయట పెట్టాలని హరీశ్ రావు సవాల్ విసిరారు. ఆ రిపోర్ట్ ఇచ్చిన వారం రోజుల్లోనే ట్రాన్స్‌ఫర్ చేసి పోస్టింగ్ ఇవ్వకుండా రిటైర్ చేశారు. మీకు కాళేశ్వరం అంటే అంత పగ, ప్రతీకారం ఎందుకని హరీశ్ రావు ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెగిటివ్ మైండ్‌సెట్‌తో ఉన్నారని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. కన్నెపల్లి మోటార్లు ఆన్ చేయమంటే ఎన్‌డీఎస్‌ఏ సాకు చెబుతున్నారని.. మరి సమ్మక్క బ్యారేజీ మోటార్లు ఎందుకు ఆన్ చేయడం లేదని ప్రశ్నించారు. ఈ నిమిషానికి సమ్మక్క బ్యారేజీ దగ్గర లక్ష క్యూసెక్కుల ప్రవాహం ఉందని చెప్పుకొచ్చారు. గోదావరి నీళ్లు తీసుకోవాలన్న కనీస సోయి లేదని విరుచుకుపడ్డారు. చెరువులు నింపుకునే అవకాశం ఉన్నా.. నింపడం లేదన్నారు. దేవాదుల మోటార్లు పూర్తిస్థాయిలో నడపడం లేదని తెలిపారు. మోటార్లు ఆన్ చేయకుండా.. నీళ్లను దిగువకు వదులుతున్నారని అన్నారు. గురుదక్షిణగా తెలంగాణ నీటిని ఏపీకి వదులుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌ది నేరపూరిత నిర్లక్ష్యమని మాజీ మంత్రి విమర్శలు గుప్పించారు. నీళ్లు ఉండి కూడా లిఫ్ట్ చేయకపోవడం క్రిమినల్ నెగ్లిజెన్స్ అంటూ వ్యాఖ్యానించారు. క్రిమినల్ నెగ్లిజెన్స్‌కు పాల్పడిన రేవంత్, ఉత్తమ్‌ను ఉరితీసినా తప్పులేదన్నారు. అబద్దానికి ప్యాంటు షర్ట్ వేస్తే సీఎం రేవంత్ అని.. అబద్దాల్లో ఆయనను మించినవారు లేరంటూ దుయ్యబట్టారు. నిన్నటి రేవంత్ ప్రసంగంలో సొల్లు తప్ప.. నిజం లేదని అన్నారు. తుమ్మిడిహెట్టికి అనుమతులున్నాయని అబద్దాలు చెప్పారని.. అనుమతు లుంటే తట్టెడు మట్టి ఎందుకు తీయలేదని నిలదీశారు. 8 ఏళ్లు కేంద్రం, రాష్ట్రం, మహారాష్ట్రలో అధికారంలో ఉండి ఎందుకు కట్టలేదని ప్రశ్నించారు. పనులు చేయకుండా తుమ్మిడిహెట్టి పేరిట రూ.2,328కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. నీటి పారుదల మంత్రిగా ఉత్తమ్, సీఎంగా రేవంత్ విఫలం అంటూ వ్యాఖ్యానించారు.

# ఏఆర్ కానిస్టేబుల్ హత్య

▫ భార్య, కుమారుడిపై కేసు





**నల్లబెల్లి, జులై 08 (జనంసాక్షి):** ఏఆర్ కానిస్టేబుల్ హత్యకు గురైన సంఘటన మండలంలోని దస్తగిరి పల్లె గ్రామంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దస్తగిరి పల్లె గ్రామానికి చెందిన మహమ్మద్ అంకూస్ (58) ఎఆర్ కానిస్టేబుల్ గా ములుగు జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ఇంట్లో భార్య కుమారుడితో గొడవ జరిగింది. ఈ ఘర్షణలో కుమారుడు చేతికి దొరికిన చెక్కపీటతో అంకూస్ తలపై బలంగా కొట్టాడు. తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే కుప్పకూలాడు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు 108 లో నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుల పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. హత్య జరిగిన ప్రదేశానికి నర్సంపేట ఏసిపి రవీందర్ రెడ్డి, సిఐ సాయి రమణ వెళ్లి విచారణ చేపట్టారు. మృతుడి సోదరి మహమ్మద్ మహబూబ్ బీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భార్య ఫాతిమా బేగం, కుమారుడు అయూబ్ పాషలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయి ప్రసన్నకుమార్ తెలిపారు.

# తుంగతుర్తి కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు

▫ మండలాధ్యక్షుల నియామకంపై వ్యతిరేకత
▫ పరస్పరం దాడులు చేసుకున్న ఎమ్మెల్యే, వ్యతిరేక వర్గాలు

**సూర్యాపేట, జులై8 (జనంసాక్షి) :** జిల్లా కాంగ్రెస్ పార్టీలో గ్రూప్ వివాదాలు ఒక్కసారిగా బహిర్గతమయ్యాయి. అర్వపల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య ఘర్షణ ఉద్రిక్తతకు దారి తీసింది. ఛలో గాంధీభవన్ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీలోని అసంతృప్తి నేతలు పిలుపునిచ్చారు. దీంతో వారిని ఎమ్మెల్యే వర్గీయులు అడ్డుకున్నారు. ఇరు వర్గాలు రాళ్లు, కర్రలతో దాడులు చేసుకున్నారు. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపుచేసేందుకు ఇరువర్గాలపై లాఠీఛార్జి చేశారు. సూర్యాపేట జిల్లాలోని తుంగతుర్తి నియోజకవర్గంలో ఇటీవల ప్రకటించిన తొమ్మిది మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను మార్చాలంటూ ఎమ్మెల్యే అసంతృప్తి వర్గం నేతలు బుధవారం ఛలో గాంధీభవన్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో అర్వపల్లి చౌరస్తాకు వారి వాహనాలు చేరుకోగానే ఎమ్మెల్యే వర్గీయులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఒకరిపై ఒకరు రాళ్లు, కర్రలతో దాడులకు దిగారు. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ దాడుల్లో రెండు కార్ల అద్దాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు రంగప్రవేశం చేసి వారందరినీ చెదరగొట్టిన ప్పటికీ మరోసారి రాళ్లు, కర్రలతో దాడులు చేసుకుంటూ ఘర్షణ వాతావరణం సృష్టించారు. చివరకు పోలీసులు లాఠీఛార్జి చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఇరువర్గాలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. అనంతరం హైదరాబాద్ గాంధీభవన్ ముందు ఎమ్మెల్యే వ్యతిరేక వర్గం వారు ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే పెత్తనంపై నిరసన చేపట్టారు. ఎమ్మెల్యే మందల సామేలుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# అవినీతిపై విచారణ కోరితే అరెస్ట్ చేస్తారా?

▫ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ బిఆర్ఎస్ నేతలు

**నాగర్ కర్నూల్, జులై8 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ నియోజకవర్గంలో మొక్క జొన్న కొనుగోలులో అవినీతికి పాల్పడ్డ మార్కెట్ చైర్మన్ పై విచారణ జరిపించాలని డిమాండ్ చేసిన నాయకులను అరెస్టు చేయడం హాస్యాస్పదంగా ఉందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. బుధవారం నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవినీతిపరుడు మార్కెట్ కమిటీ చైర్మన్‌ను కాపాడుతున్న ఎమ్మెల్యేకు రైతుల పట్ల ఉన్న ప్రేమ అర్థమవుతుందని ఆరోపించారు. రైతుల పట్ల అభిమానం ఉంటే మార్కెట్ చైర్మన్‌ను ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. రైతు బంధు, రుణ మాఫీ, సకాలంలో యూరియా ఇవ్వకుండా రైతుల నోట్ల మట్టి కొట్టి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ భూముల్లో కూడా ఆక్రమణలకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల పొట్టకొట్టిన అవినీతి పరులను బొక్కలోకి పంపేంత వరకు విశ్రమించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చిక్కొండ్ర శ్రీశైలం, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కొండకింది మాధవ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నల్లగంటి వెంకటయ్య, మాజీ సర్పంచులు చిక్కొండ్ర నాగయ్య, అతినారపు విష్ణు , నాయకులు కిషోర్ గౌడ్, అవంచ సత్యం, శేఖర్, కట్ట వంశీ గౌడ్, గుంటి బాలు, గొడుగు యాది, తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి నాయకుడి ఇంటిపై దాడి

▫ మేయర్ అనుచరులు దాడికి పాల్పడ్డారని ఆరోపణ
▫ దాడిని ఖండించిన బిజెపి జిల్లా అధ్యక్షులు



**మంచిర్యాల ప్రతినిధి, జూలై 8 (జనంసాక్షి) :** మంచిర్యాల మాజీ ఎంపీపీ ,బిజెపి నాయకులు బేర సత్యనారాయణ ఇంటిపై మంగళవారం రాత్రి జరిగిన దాడిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఖండించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల మాజీ ఎంపీపీ బీజేపీ నాయకుడు బేర సత్యనారాయణ నివాసంపై రాత్రి జరిగిన దాడిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి సుమారు 10 గంటల సమయంలో మంచిర్యాల మేయర్ ధరణి మధుకర్ అనుచరులు బేర సత్యనారాయణ ఇంటిపై దాడి చేసి, ఇంటి అద్దాలను ధ్వంసం చేయడం, తలుపులు బలవంతంగా తెరిచేందుకు ప్రయత్నించడం, కుటుంబ సభ్యులను దుర్భాషలాడుతూ బెదిరించడం, ఇంటి వద్ద భయానక వాతావరణాన్ని సృష్టించడం అత్యంత హేయమైన చర్య అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ విభేదాలు సహజమేనని, అయితే వాటిని చర్చలు, విమర్శలు, ప్రెస్ మీట్లు వంటి ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారా వ్యక్తపరచాలని, ఇలాంటి రౌడీయిజం, వ్యక్తిగత దాడులు, బెదిరింపుల సంస్కృతికి ఎలాంటి స్థానం లేదని ఆయన స్పష్టం చేశారు. గతంలో కూడా మంచిర్యాల మేయర్ ధరణి మధుకర్‌పై పలు ఆరోపణలు ఉన్నాయని, అనేక మందిపై దాడులకు పాల్పడ్డారనే విమర్శలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆయన అవినీతి, అక్రమాలను బేర సత్యనారాయణ ప్రజల ముందుకు తీసుకురావడం, ప్రశ్నించడం వల్లే కక్షసాధింపు ధోరణితో ఈ దాడి జరిగిందని ఆరోపించారు. బేర సత్యనారాయణ కుటుంబ సభ్యుల ప్రాణాలకు పూర్తి భద్రత కల్పించాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగ్నూరి వెంకటేశ్వర్ గౌడ్ ప్రభుత్వాన్ని, పోలీసు శాఖను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ బీజేపీ పట్టణ అధ్యక్షుడు సత్రం రమేష్, మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు అమరశెట్టి రాజు, కౌన్సిలర్లు బోట్ల సత్యనారాయణ, అనిత, నాగరాజు, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఆకుల అశోక్ వర్ధన్, సదానందం, శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కమలాకర్ రావు, బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు పానుగంటి మధు, బీజేపీ రాష్ట్ర కార్యకర్త దుర్గం అశోక్, మాజీ ఎంపీటీసీ మోటపలుకుల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక ఇబ్బందులున్నా అభివృద్ధిలో ముందడుగు

▫ రూ.12 కోట్లతో నాగర్‌కర్నూల్ నూతన బస్‌స్టేషన్‌కు శంకుస్థాపన
▫ నాగర్‌కర్నూల్-వనపర్తి మధ్య ఆర్టీసీ సర్వీసుల ప్రారంభం
▫ ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల బాటలోకి తీసుకొచ్చాం
▫ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



**నాగర్‌కర్నూల్, జూలై8 (జనంసాక్షి) :** రాష్ట్రం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని రంగాల్లో అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల డైట్, కాస్మెటిక్ ఛార్జీలను పెంచి వారి సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో రూ.12 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన ఆర్టీసీ బస్ స్టేషన్‌కు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మరో మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం నాగర్‌కర్నూల్ నుంచి వనపర్తి వరకు కొత్తగా ప్రారంభించిన ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభించి, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని కూడా మంత్రులు ప్రారంభించారు. అనంతరం ఉయ్యాలవాడ బీసీ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించి, అక్కడి వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, టీజీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలకు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషకరమని తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహాలక్ష్మి పథకం అమలుతో ఇప్పటివరకు 320 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించి, సుమారు రూ.11,371 కోట్ల మేర ప్రయాణ ఖర్చును ఆదా చేసుకున్నారని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కార్మికులు 55 రోజులపాటు సమ్మె చేయాల్సిన పరిస్థితులు ఏర్పడి, పలువురు ఆత్మహత్యలకు పాల్పడిన దురదృష్టకర పరిస్థితు లను రాష్ట్రం చూసిందన్నారు. అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం కేవలం మూడు రోజుల్లో కార్మికుల సమస్యలను పరిష్కరించిందని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వం కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధి, ప్రయాణికుల సౌకర్యం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో ముందుకు సాగుతోందన్నారు. గత పదేళ్లలో ఒక్క కొత్త బస్సును కూడా కొనుగోలు చేయలేదని, ఒక్క ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. ప్రజాపాలన ప్రభుత్వంలో ఆర్టీసీని ఆపరేషనల్ నష్టాల నుంచి లాభాల దిశగా తీసుకువచ్చామని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని అమలు చేయడంతో పాటు బాండ్లు, డీఏలు విడుదల చేశామని, కారుణ్య నియామకాలు చేపట్టి కొత్త ఉద్యోగాల భర్తీ ప్రారంభించామని చెప్పారు. కొత్త బస్సుల కొనుగోలు కూడా కొనసాగుతోందన్నారు. గతంలో విధుల నుంచి తొలగించబడిన ఉద్యోగులను తిరిగి సేవల్లోకి తీసుకున్నామని వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 10 వేల ఆర్టీసీ బస్సులు ప్రతిరోజూ సుమారు 30 లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తూ 65 లక్షల మంది ప్రయాణికులకు సేవలందిస్తున్నాయని మంత్రి వివరించారు. హైదరాబాద్ నగరంలో కొత్తగా 375 రూట్లలో బస్సులు నడుపుతూ ప్రతిరోజూ అదనంగా 7 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందిస్తున్నామని, అవసరమున్న ప్రాంతాల్లో మరిన్ని సర్వీసులు ప్రారంభిస్తామని తెలిపారు. ప్రభుత్వం ప్రతి అర్హ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తోందని, గతంలో రేషన్ కార్డుల కోసం ప్రజలు చెప్పులు అరిగేలా తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు కొత్త రేషన్ కార్డులు జారీ చేసి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. మహిళలకు చీరల పంపిణీ, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందించడం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా వారిని సాధికారత దిశగా నడిపిస్తున్నామని పేర్కొన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో ప్రజల ఆకాంక్షల కోసం రాజీనామా చేసి పోరాటం చేసిన రోజుల్ని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ÷రిలిడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు ట్రాఫిక్, రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని మంత్రులు పిలుపునిచ్చారు. రవాణా శాఖ, పోలీసు శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

# విద్యారంగానికే అధిక నిధులు, అధిక ప్రాధాన్యత

▫ ప్రభుత్వ విప్ డాక్టర్ రామ్ చందర్ నాయక్



మరిపెడ, జూలై 8 (జనం సాక్షి ): కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యారంగానికి అధిక ప్రాధాన్య ఇస్తూ బడ్జెట్లో అధిక నిధులు కేటాయిస్తున్నామని డోర్నకల్ ఎమ్మెల్యే (ప్రభుత్వ విప్) డాక్టర్ జాటోతు రామచందర్ నాయక్ అన్నారు. బుధవారం మరిపెడ పట్టణంలోని సీతారాంపురం ఉన్నత పాఠశాలలో ప్రి-ప్రైమరీ తరగతి గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ! మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 10 సంవత్సరంలో చేయలేని పనులను కేవలం రెండున్నర ఏళ్లలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు అండగా నిలుస్తూ, ఎన్నికల హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తున్నామన్నారు. ఎవరు అధైర్యపడవలసిన అవసరం లేదన్నారు. పరువు లందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మరిపెడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెండ్లి. రఘువీరా రెడ్డి, మున్సిపల్ ఛైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి,మండల విద్యాశాఖాదికారి అనితా దేవీ, కేసముద్రం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐలమల్లు, వైస్ ఛైర్ పర్సన్ కాలం సునీత రవీందర్ రెడ్డి, కౌన్సిలర్లు మెరుగు. రాము, జాటోతు. సురేష్, పానుగోతు. రాములు,నీలా లచ్చిరామ్, కాంతమ్మ కరణ్ సింగ్, తిరుపతి, గంట్ల గౌతమ్ రెడ్డి, పాఠశాల హెచ్ ఎం అర్జున్,కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా మైనార్టీ నాయకులు అప్సర్,టౌన్ అధ్యక్షులు తాజోద్దీన్,వెంకట సాయి,యాకుబ్ పాషా,

# ఇద్దరి మృతికి కారణమైన నిందితుడి అరెస్టు, రిమాండ్




**పాలకుర్తి, జూలై 08 (జనంసాక్షి) :** మద్యం మత్తులో వేగంగా కారు నడిపి ఇద్దరి నిండు ప్రాణాలను బలిగొన్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన మండల పరిధిలో చోట చేసుకుంది. బుధవారం మండల కేంద్రంలో ఎస్సై పవన కుమార్ తో కలిసి సీఐ జానకీరాంరెడ్డి తెలిపిన వివరాల మేరకు... మండలంలోని బమ్మెర గ్రామానికి చెందిన చీపూరి రాహుల్ అతిగా మద్యం సేవించి మంగళవారం రాత్రి మండల పరిధిలో కారు నడిపాడు, పాలకుర్తి మండల కేంద్రంలో మద్యం మత్తులో అతివేగంగా నిర్లక్ష్యంగా కారు నడపడంతో రోడ్డుపై మోటార్ సైకిల్పై వెళ్తున్న రఘునాథపల్లి మండలం వెల్ది గ్రామానికి చెందిన పెంతల వెంకటలక్ష్మీ అక్కడికక్కడే మృతి చెందింది. అక్కడి నుంచి అతివేశంగా అదే కారుతో గూడూరులో మరో యువకుడు చిల్పూరు మండలం క్రిష్ణాజిగూడెంకు చెందిన వడ్లకొండ రంజిత్ ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. రెండో ప్రమాదం అనంతరం నిందితుడు తప్పిం చుకునేందుకు బమ్మెర గ్రామం మీదుగా కారులో వెళ్తుండగా స్థానికులు వెంబడించి పట్టుకున్నారు. అతడు మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. అతడిని చితకబాది పోలీసులకు అప్పగించారు. నిందితుడిని పోలీసులు ఆరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమని ఇది వారి ప్రాణాలతో పాటు ఇతర ప్రాణాలకు కూడా ప్రమాదకరమని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి బాధ్యతగా వాహనాలు నడపాలని సూచించారు.

# కేజీబీవీ కోటపల్లి హాస్టల్ నుండి వెళ్లిపోయిన బాలికను తల్లికి అప్పగింత

**చెన్నూర్ జూలై 8 (జనం సాక్షి) :** మంచిర్యాల జిల్లా కోటపల్లిలో మండల కేంద్రంలోని కేజీబీవీ ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఒక బాలిక, హాస్టల్‌లో ఉండడం ఇష్టంలేదని గత కొంతకాలంగా తన తోటి విద్యార్థులతో, అలాగే తన తల్లితో చెబుతూ ఉండేది. ఈ క్రమంలో, బాలిక తల్లి ఆమెకు నచ్చజెప్పి హాస్టల్‌లోనే ఉండి చదువుకోవాలని సూచించినప్పటికీ, బాలికకు హాస్టల్‌లో ఉండాలనే ఆసక్తి లేకపోవడంతో, 2026 జూలై 05 వ తేదీన ఉదయం ఎవరికి చెప్పకుండా హాస్టల్ నుండి వెళ్ళిపోయింది. ఈ విషయమై బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, కోటపల్లి ఎస్సై రాజశేఖర్ దర్యాప్తు ప్రారంభించారు. చెన్నూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో ప్రత్యేకంగా నాలుగు పోలీసు బృందాలను ఏర్పాటు చేసి, సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తూ గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసుల చాకచక్యమైన దర్యాప్తు, సమన్వయంతో కూడిన గాలింపు చర్యల ఫలితంగా, ఈ రోజు కరీంనగర్ బస్ స్టాండ్ పరిసర ప్రాంతంలో ఆ బాలికను సురక్షితంగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం బాలికను రక్షణలోకి తీసుకుని, అవసరమైన న్యాయపరమైన ప్రక్రియలు పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు చర్యలు చేపట్టారు. ఈ కేసు దర్యాప్తులో చురుకుగా, సమర్థవంతంగా పనిచేసిన చెన్నూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్, కోటపల్లి ఎస్సై రాజశేఖర్, నిల్వాయి ఎస్సై జగదీష్ రెడ్డి, అలాగే పోలీసు సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ బుజ్జిబాబు, కానిస్టేబుళ్లు శ్యామ్ సుందర్, శ్రీనివాస్, శ్రావణ్, సమ్మయ్య, నరేష్ లను జైపూర్ ఏసీపీ అభినందించారు.

## చిట్యాల్‌లో రూ.20 లక్షల సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

**నిర్మల్ రూరల్ , జూలై 08 (జనంసాక్షి) :** నిర్మల్ రూరల్ మండలం చిట్యాల్ గ్రామంలో కేంద్ర ప్రభుత్వ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) నిధులతో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బీజేపీ శాసనసభా పక్ష నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించేందుకు చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

## ఎస్ఐఆర్ డిజిటలీకరణ పూర్తి చేయాలి

▫ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ బ్యూరో, జూలై 08 (జనంసాక్షి) :** ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఫారముల డిజిటలీకరణ గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్, నిర్మల్ పట్టణంలోని గాజులపేట్ లో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఓటర్లు నింపి, తిరిగి ఇచ్చిన ఎస్ఐఆర్ ఫారముల డిజిటలికరణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బిఎల్ఓ లు డిజిటలీకరణ ప్రక్రియను నిర్ణిత గడువులోగా పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటివరకు పూర్తిచేసిన డిజిటలైజేషన్ వివరాలను బిఎల్ఓ లను అడిగి తెలుసుకున్నారు. బిఎల్ఓ లు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ఓటర్ల ఇంటికి వెళ్లి, నింపిన ఫారములను తిరిగి తీసుకోవాలని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. సూపర్వైజర్లు ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని తెలిపారు. స్థానికంగా నివాసం ఉన్న ఓటర్ల ఇంటికి వెళ్లి, వారు ఎస్ఐఆర్ ఫారములు నింపుతున్న తీరును పరిశీలించారు. స్థానికులతో మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియ పై ఏవైనా సందేహాలు ఉంటే, హెల్ప్ డెస్క్ లో అధికారుల సహాయం తీసుకోవాలని సూచించారు.

# ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా

▫ ప్రభుత్వ పాఠశాలల్లో పౌష్టిక అల్పాహారానికి శ్రీకారం

గుడిహత్నూర్,జూలై 8, (జనం సాక్షి) గుడిహత్నూర్ మండలం లోని కొల్హరి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారులు సవిత – ఉద్ధవ్ దంపతుల గృహ ప్రవేశానికి బుధవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కలెక్టర్ కు ఘన స్వాగతం పలికారు. కలెక్టర్, అధికారులు, బంధువులు పూజ కార్యక్రమాలు నిర్వహించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. దీంతో లబ్ధిదారులు జిల్లా కలెక్టర్ వారి ఇంటికి రావడంతో వారు ఎంతో సంతోషించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఈ రమేష్, సర్పంచ్ శివాజీ, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో పౌష్టిక అల్పాహారానికి శ్రీకారం**



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన అల్పాహారం అందించేందుకు హరే కృష్ణ ఫౌండేషన్ చర్యలు వేగవంతం చేసింది. ఈ మేరకు గుడిహత్నూర్ మండలం కొల్హరి గ్రామంలో కేంద్రీకృత వంటశాల ఏర్పాటు కోసం జిల్లా కలెక్టర్ రాజర్షి షా బుధవారం హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వంటశాల ఏర్పాటుకు అనువైన స్థలంతో పాటు రైస్ గోదామును కూడా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన అల్పాహారం అందించే లక్ష్యంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు అవసరమైన మౌలిక వసతులు, ఇతర ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు త్వరలోనే అల్పాహార సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారిణి మాధవి, హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు, గ్రామ సర్పంచ్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
9 జూలై 2026

# వక్ఫ్ అవినీతిపై నిజాయితీ ఎవరిది?

సంపాదకీయం

అయోధ్య రామాలయ నిర్మాణం కోసం సేకరించిన విరాళాల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ప్రశ్నించే వారిని, "వక్ఫ్ బోర్డు వ్యవహారాల్లో ఎందుకు నోరు మెదపరు" అని ఎదురు ప్రశ్నించడం ద్వారా అసలు సమస్య నుంచి దృష్టి మరల్చే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోంది. ఇది తర్కరహితమైన వాదన అనే చెప్పాలి. ఎందుకంటే, ఈ రెండు అంశాలు వేర్వేరు స్వభావం కలిగినవి, వాటిని పోల్చి ఒక దాన్ని మరో దానికి కారణంగా చూపడం సబబు కాదు.

వక్ఫ్ బోర్డు అనేది రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో, చట్టబద్ధంగా ఏర్పాటైన సంస్థ. యూపీ వక్ఫ్ బోర్డులో అవినీతి జరిగిందన్న ఆరోపణలు ఉంటే, వాటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సాక్షాత్తు ఆ రాష్ట్ర ప్రభుత్వానిదే. అంటే, యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని ప్రభుత్వమే ఈ విషయంలో జవాబుదారీగా ఉండాలి. ప్రతిపక్షాలు ప్రశ్నించాలి అనుకుంటే, ముందుగా తన ప్రభుత్వ పరిధిలో ఉన్న సంస్థపై తానే చర్యలు తీసుకోవడం ద్వారా స్పష్టత ఇవ్వాల్సింది ముఖ్యమంత్రే. అంతే తప్ప, ప్రతిపక్షాలను ప్రశ్నించమని అడగడం తన బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నంగానే కనిపిస్తుంది.

రామాలయ విరాళాల విషయంలో వస్తున్న ఆరోపణలకు, వక్ఫ్ బోర్డు వ్యవహారాలకు మధ్య ఎలాంటి ప్రత్యక్ష సంబంధం లేదు. ఒకదానికి సమాధానం చెప్పకుండా మరో అంశాన్ని తెరపైకి తేవడం ద్వారా అసలు ప్రశ్నను దాటవేసే ప్రయత్నం కనిపిస్తోంది. ప్రజలు అడుగుతున్నది స్పష్టం – రామాలయ నిర్మాణం కోసం వచ్చిన విరాళాల లెక్కలు పారదర్శకంగా ఉన్నాయా, లేదా అనేదే. దీనికి సమాధానం రావాల్సింది ట్రస్టు నుంచి, ప్రభుత్వం నుంచే తప్ప, మరో సంస్థపై ఆరోపణలు చేయడం ద్వారా కాదు.

పారదర్శకత అనేది ఏకపక్షంగా ఒకరిపైనే వర్తించే విలువ కాదు. మతపరమైన సంస్థల ఆర్థిక వ్యవహారాల్లో జవాబుదారీతనం కోరుకోవడం ఎంత సబబో, అదే ప్రమాణాన్ని అన్ని సంస్థలకు, అన్ని ప్రభుత్వాలకు వర్తింపజేయడం కూడా అంతే అవసరం.

## వ్యవసాయాన్ని స్థిరీకరించుకోవడం కోసం

# ప్రత్యామ్నాయ పంటలు ముద్దు!



తెలంగాణలో రైతు రాజ్యం నడుస్తున్నది రైతును రాజుగా చేయాలనే తపన ఉన్న రాష్ట్రం దేశంలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో కూడా లేదు. లేమిడి కాలాన్ని బట్టి పరిస్థితులను బట్టి లాభదాయకంగా ఉన్న వరికి ప్రత్యామ్నాయంగా పంటలు వేయాల్సిన గడ్డు పరిస్థితి ప్రతికూల వర్షాల ఆధారంగా తప్పేటట్టు లేదు అందుకే ప్రత్యామ్నాయ పంటల సాగుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది.దేశంలోనే తెలంగాణ వరి ఉత్పత్తిలో అగ్రగామిగా ఎదిగింది.అన్ని కాలాల్లోనూ రాష్ట్రంలో వరి సాగు 70లక్షలకు పైగా అసాధారణంగా పెరిగిపోయింది. దీనికి ప్రధాన కారణం గ్రామాల్లో కోతుల బెడద ,అడవి పందుల బెడద ఉచిత విద్యుత్, మద్దతు ధర ఉండడం మూలానా పప్పు ధాన్యాలు, నూనెగింజలు, సజ్జలు, కూరగాయలు, చిరుధాన్యాల పంటల సాగు గణనీయంగా పడిపోతోంది. ఈ నేపథ్యంలో.. వరిని అవసరం మేరకు ఉత్పత్తి చేసుకుని, దిగుమతి చేసుకుంటున్న ఇతర ధాన్యాల విషయంలో స్వయం సమృద్ధి సాధించేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇప్పటికే నూనెగింజల సాగు విస్తీర్ణం, ఉత్పత్తి పెంచితే విదేశాల నుంచి వంట నూనెల దిగుమతి తగ్గుతుందనే అభిప్రాయాలు కూడా వచ్చాయి.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే పామాయిల్ సాగుకు ఆర్థికంగా ప్రోత్సాహం ఇస్తున్నాయి. అయితే ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం రైతు భరోసాను కొనసాగిస్తూనే.. స్వచ్ఛందంగా పంటల మార్పిడి చేసే రైతులకు ఎకరానికి రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకూ బోనస్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటే పునస పంటలైన పెసలు, కందులు, సజ్జలు , మొక్కజొన్నలు తదితర ఆహార ధాన్యాల సాగు విస్తీర్ణం పెంచేందుకు మొగ్గుచూపుతారనే అభిప్రాయం ఉంది.

వ్యవసాయాన్ని స్థిరీకరించుకోవడం కోసం అన్నదాతలను అక్కున చేర్చుకొన్నది.గత సంవత్సరం సాగునీటి లభ్యత, ప్రాజెక్టులు, చెరువులు అందుబాటులో ఉండటం.. ఫామ్‌గేట్ వద్దే (కల్లంలోనే) ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు చేస్తుండడం, నేరుగా రైతు ఖాతాల్లోకే కనీస మద్దతు ధర జమ చేయడం, ఏడు రకాల సన్నాలకు బోనస్ చెల్లిస్తుండడంతో.. ప్రస్తుతం రైతులు వరి సాగుకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం కన్పించింది. కానీ సగటు వర్షపాతం లేకపోవడం వల్ల పోసిన నారుమడులు ఎండిపోయే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం కూడా రైతులను ఇతర పంటల సాగు వైపు మళ్లించడానికి, ప్రత్యామ్నాయ పంటలసాగును ప్రోత్సహించడానికి, పప్పు ధాన్యాలు, నూనె గింజలు, కూరగాయల సాగులో స్వయంసమృద్ధి సాధించడానికి ఎకరానికి ఎంతో కొంత 'బోనస్' ఇవ్వాలనే ప్రతిపాదనలు ప్రభుత్వం ముందుకు తెచ్చింది.రైతును రాజుగా చూడాలనుకున్న రేవంత్ ప్రభుత్వం పంటల మార్పిడి పై అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతున్నది.ఎల్ నినో ప్రభావంతో రైతులు గత నెలరోజులుగా సాగులో ముందుకు సాగలేక ఇబ్బందులు పడొద్దని, బోనస్ ఇస్తున్నామని 33రకాల వరి వేయొద్దని, ఏడూ రకాల సన్నాలు వరిని మాత్రమే సాగుచేయాలని గత కొద్దిరోజులుగా అలర్ట్ చేస్తూనే ఉన్నది.అదే క్రమంలో ఆరు తడిపంటలు వేరుశనగ, నువ్వులు, పొద్దుతిరుగుడు, కుసుమలు..తదితర పంటల సాగును కూడా పెంచాల్సిన అవసరాన్ని గుర్తించారు. రైతులు ప్రకృతి సహకరించక భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి, నారు మడులు ఎండిపోయి, ఏ పంటా వేయాలో తెలియక ఊగిసలాటలో కొట్టుమిట్టాడుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన పంటలకు మద్దతు ధర నిర్ణయించిన మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యం అయినా పండించిన చివరి గింజ కొనే బాధ్యతను ప్రభుత్వం తీసుకున్నది. యాసంగి సీజన్ లో 80లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుచేసి దేశంలోనే తెలంగాణ రికార్డు సృష్టించింది. విపక్షాలు మొత్తుకుంటున్నట్టు రైతుల ఆశలు ఎక్కడ వమ్ము చేయలేదు. అయితే తాజానిర్ణయంతో ఒక్కసారిగా ఏడూ వంగడాలు డిమాండ్ పెరిగింది. ఈసారి ఖరీఫ్ కు అవసరమైన విత్తనాలకన్నా ఎక్కువగానే .ప్రభుత్వం నిలవలను సిద్ధం చేసుకున్నది. అయితే ఈ సారి కూడా మద్దతు ధరకు కొంటామని హామీ ఇస్తుందా? ముందే చెప్పాలని రైతాంగాన్ని విపక్షాలు రెచ్చకొట్టే ప్రయత్నం చేస్తుంది.సాగుకు వినియోగంగా ఉన్న భూములకు ఇస్తున్న 'రైతుభరోసా' విడుదల చేసింది. నిజమైన రైతులకు వచ్చేవిధంగా ప్రక్షాళన చేసి.. తద్వారా మిగిలిన నిధులను పంటల బోనస్, పంటల బీమా పథకాలకు మళ్లించాలనే ప్రతిపాదన కూడా ప్రభుత్వం మదిలో ఉంది. ఈ నేపథ్యంలో.. వచ్చే ఏడాది నుంచి శాటిలైట్ మ్యాపింగ్ చేసి, ఎవరు పంటలు వేశారు? ఏ పంటలు వేశారనే వివరాలు సేకరించి.. కేవలం సాగుచేసిన భూములకు మాత్రమే రైతుభరోసా చెల్లించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. రాళ్లు, రప్పలు, కొండలు, గుట్టలు, స్థిరాస్తి వెంచర్లు ఉన్న భూములకు రైతుభరోసా ఇవ్వక పోతే అదే పెట్టుబడి సాయం రూ.2నుండి 3 వేల కోట్ల సొమ్మును పంటల బోనస్, పంటల బీమా లాంటి పథకాలకు వినియోగించితే ప్రత్యామ్నాయ పంటలు వేయడానికి వెనుకాడరనే భావం ఉంది.

కేంద్ర,రాష్ట్రాల సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా అన్ని రంగాల్లో బీజేపీయేతర ప్రభుత్వాలకు కొనుగోళ్ల విషయంలో,నిధులు సమకూర్చే విషయంలో రాష్ట్రాలపై వివక్ష కనబర్చుతుంది.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఆంధ్రను మాత్రమే అన్నపూర్ణగా భావించే ఆ రోజుల్లో వ్యవసాయాన్ని కూడా నిర్లక్ష్యం చేసింది.తెలంగాణ ఏర్పాటు తర్వాత సమృద్ధిగా నీరు,24గంటల కరెంట్ ఉండడం వల్ల వరి సాగుకు మొగ్గ చూపుతున్నారు. దీంతో విస్తీర్ణం బాగా పెరిగి కోట్ల టన్నుల్లో దిగుబడి రావడం, కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాలు బోనస్ ఇవ్వడం రైతు వారిని వదిలి పెట్టని పరిస్థితి. కేంద్రం నుండి తగినంత సహకారం లేకపోవడం వల్ల సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది.రాష్ట్రాల నుండి రావాల్సిన పన్నులు రాబట్టి కేంద్రం నుండి ఇచ్చే విషయంలో రాదంతం చేస్తుంది. పండించిన పంటకు కేంద్రం ఇచ్చేది శూన్యమే.వరి ధాన్యంలో మూడోవ వంతు, మక్కజొన్న అసలే కొనుగోలు చేయదు, 25శాతం ఖరీదు చేసే కందులు, పెసలు, జొన్నలు, శనగలు,సోయాబీన్, సన్ ఫ్లవర్ లాంటివి కొనుగోలు చేసి రాష్ట్రాన్ని మొత్తం సాకుతున్నట్టు బీజేపీ నాయకులూ డంబాచారం చేస్తుంటారు. 2015లో 35లక్షల ఎకరాల్లో వరి సాగు ఉండేది ఇప్పుడు 70లక్షల ఎకరాల సాగు కావడం వల్ల ప్రభుత్వానికి బోనస్ భారం అయ్యింది. ప్రభుత్వం చెప్పిన ఏడూ రకాల సన్నాలు వేస్తే ఎకరానికి 5నుండి 10 క్వింటాళ్లు దిగుబడి తగ్గుతుందనే భావం తో రైతాంగం ఉంది.వర్షాలు లేక గ్రౌండ్ వాటర్ పడిపోతే వరి సాగుకి ఇబ్బంది రాకుండా ఉండాలంటే ప్రత్యామ్నాయ లాభసాటి పంటలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.



ప్రొఫెసర్ సంగని మల్లేశ్వర్,
విభాగాధిపతి, జర్నలిజం శాఖ,
కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్,
సెల్ – 9866255355.

## మత రాజ్యం!

మతం 'మీ' చేతిలో
పడక ముందు'మంచి
మాటలే'చెప్పింది!
మీచేతికి చిక్కాక
పతనమై పోయింది!
మతంఆనాడుఅందరికీ
సన్మార్గమేబోధించింది!
ఆ బోధలవల్లే ప్రజలు
నేటికీ ధర్మం తప్పలేదు!
తప్పినవాళ్లు పాలకులే!
కాలం గడిచే కొద్దీ
పాలకులు మతాన్ని
స్వార్థానికివాడుకున్నారు
అగ్రహారాలిచ్చి బాగా
'గడ్డి' తినిపించారు!



గడ్డికిఅలవాటైమతంగాళ్లు
ఆధ్యాత్మిక అబద్దాలతో
ప్రజలకుపైలోకాలుచూపి
'వీళ్లు'మాత్రం ఇహానికి
మరిగి –ప్రజల రక్తం
తాగటంప్రారంభించారు!

నిజంగా భక్తి ఉంటే
గుడితో పనిలేదు!
నీగుండెతలుపులుతెరు!
హనుమంతుడురాముణ్ణి
తనగుండెల్లో చూపాడు!
అయోధ్యలో ఇప్పుడు

రామాలయం కావాలా?
ఎందుకుమింగటానికా?
నాటినుండి నేటివరకు
మతరాజ్యాల పని అదే!
ప్రజలు రక్తం ధారపోసి
అయోధ్యరామాలయానికి

ఇటుకలు పేర్చారు!
పాలకులుప్రజలరక్తంపీల్చి
ఏమీఎరగనట్టున్నారు!
అప్పుడు యిప్పుడూ
మతరాజ్యాలపని అదే!
ఇద్దరూ తోడుదొంగలు!
కట్టేవి కాషాయి గుడ్డలు
చేసేవి కసాయి పనులు!
మత రాజ్యం వద్దు
లౌకికరాజ్యంముద్దు!
ప్రజాస్వామ్యాన్ని
రక్షించుకుందాం!
సమసమాజనిర్మాణానికి
ఇటుకలు పేర్చుదాం!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# ప్రభుత్వ చర్యలను ప్రశ్నించటమే నేరమా?



ప్రజాస్వామ్యంలో అధికారాన్ని గెలుచుకోవడం ఎంత ముఖ్యమో, అధికారాన్ని ప్రశ్నించే హక్కును కాపాడటం అంతకంటే ముఖ్యమైనది. ప్రభుత్వాలు ఎన్నిక ల ద్వారా వస్తాయి. కానీ రాజ్యాంగం ద్వారా ఏర్పడిన పౌర హక్కులు ఎన్నికల ఫలితాలతో మారిపోవు. ఒక ప్రభుత్వం ప్రజల విమర్శలను, అసమ్మతిని, నిరసనలను సహజ ప్రజాస్వామ్య ప్రక్రియగా స్వీకరించకుండా వాటిని నేరంగా పరిగణించడం ప్రారంభించిన క్షణం నుంచే ప్రజాస్వామ్యం బలహీన పడటం మొదలవుతుంది. గత పన్నెండేళ్లుగా దేశ రాజకీయ పరిణామాలను పరిశీలిస్తే, అధికారాన్ని ప్రశ్నించే వ్యక్తులపై తీవ్రమైన చట్టాలను ప్రయోగించడం, దీర్ఘకాలం విచారణ లేకుండానే జైళ్లలో ఉంచడం, వరుస కేసులతో వేధించడం ఒక ప్రమాదకర ధోరణిగా మారిందనే విమర్శలు దేశవ్యాప్తంగా వినిపిస్తున్నాయి.


ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. కానీ అధికార యంత్రాంగాన్ని ఉపయోగించి విమర్శకులనే జవాబుదారులుగా నిలబెట్టే ప్రయత్నం జరిగితే అది రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తి విరుద్ధం. రాజకీయ నాయకులు, పాత్రికేయులు, మేధావులు, విద్యార్థి నాయకులు, రైతు ఉద్యమకారులు, సామాజిక కార్యకర్తలు, యూట్యూబ్ వ్యాఖ్యాతలు, మానవ హక్కుల కార్యకర్తలు వీరిలో ఎవరైనా ప్రభుత్వ విధానాలను ప్రశ్నించిన వెంటనే దేశద్రోహం, తీవ్రవాద అనుబంధాలు, ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొట్టడం వంటి తీవ్రమైన ఆరోపణలు మోపడం సాధారణ ఘటనగా మారిందన్న ఆందోళన అనేక వర్గాల నుంచి వ్యక్తమవుతోంది.

ప్రత్యేకంగా చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) వినియోగంపై దేశవ్యాప్తంగా తీవ్రమైన చర్చ కొనసాగుతోంది. ఈ చట్టం అసలు ఉద్దేశం దేశ భద్రతకు నిజమైన ముప్పుగా నిలిచే ఉగ్రవాద కార్యకలాపాలను అరికట్టడమే. అయితే మానవ హక్కుల సంస్థలు, న్యాయవాదులు, మాజీ న్యాయమూర్తులు చాలాకాలంగా చేస్తున్న విమర్శ ఏమిటంటే, ఈ చట్టాన్ని విచారణ పూర్తికాకముందే వ్యక్తులను సంవత్సరాల తరబడి నిర్బంధించడానికి ఒక సాధనంగా ఉపయోగిస్తున్నారనేది. జాతీయ నేర గణాంకాల వివరాలు, స్వతంత్ర అధ్యయనాలు కూడా ఒక విషయాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి. యూఏపీఏ కింద నమోదైన కేసుల్లో శిక్షల శాతం చాలా తక్కువగా ఉన్నప్పటికీ, బెయిల్ పొందడం అత్యంత క్లిష్టంగా మారుతోంది. అంటే చివరకు నిర్దోషిగా బయటపడినా, అంతకుముందు అనుభవించిన జైలు జీవితం ఒక శిక్షగానే మిగిలిపోతోంది. దేశద్రోహ చట్టం విషయంలో కూడా న్యాయస్థానాలు పలుమార్లు కీలక వ్యాఖ్యలు చేశాయి. కేవలం ప్రభుత్వాన్ని విమర్శించడం దేశద్రోహం కాదని, ప్రభుత్వ వ్యతిరేక అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం ప్రజాస్వామ్యంలో సహజ హక్కేనని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ప్రభుత్వం అంటే దేశం కాదు. అధికార పార్టీ అంటే రాజ్యాంగం కాదు. పాలకులను విమర్శించడం ద్వారా దేశాన్ని అవమానించినట్లు భావించడం ప్రజాస్వామ్య అవగాహనకే విరుద్ధం. ఇటీవలి కాలంలో వివిధ రాష్ట్రాల్లో చోటుచేసుకున్న కొన్ని ఘటనలు ఈ ఆందోళనను మరింత బలపరుస్తున్నాయి. ఒక సభలో చేసిన ప్రసంగం, సామాజిక మాధ్యమంలో చేసిన వ్యాఖ్య, ప్రభుత్వ విధానాలపై వ్యక్తం చేసిన అసమ్మతి ఆధారంగా వరుసగా వివిధ పోలీసు స్టేషన్లలో కేసులు నమోదు చేయడం, ఒక కేసులో బెయిల్ వచ్చిన వెంటనే మరో కేసులో అరెస్టు చేయడం వంటి పరిణామాలు న్యాయ ప్రక్రియనే శిక్షగా మార్చేస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి. విచారణకు ముందే వ్యక్తిని మానసికంగా, ఆర్థికంగా కుంగదీయడమే అసలు లక్ష్యంగా కనిపిస్తోందనే అభిప్రాయం పెరుగుతోంది. ఇక్కడ మరో తీవ్రమైన ప్రశ్న కూడా ఎదురవుతోంది. చట్టం అందరికీ సమానంగా అమలవుతోందా? అధికారానికి అనుకూలంగా మాట్లాడేవారికి ఒక న్యాయం, వ్యతిరేకంగా మాట్లాడేవారికి మరో న్యాయం అమలవుతోందా? మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినవారిపై చర్యలు తీసుకోవడంలో కనిపించే నిర్లక్ష్యం, అదే సమయంలో ప్రభుత్వాన్ని విమర్శించిన వారిపై అత్యంత కఠిన చట్టాలను ప్రయోగించడంలో కనిపించే వేగం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోంది. న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసేది కేవలం చట్టాల లేమి వల్ల మాత్రమే కాదు. ఉన్న చట్టాలను ఎంపిక చేసి వక్రీకరించి అమలు చేస్తున్న విధానాలలే కారణం అవుతాయి. పోలీసు వ్యవస్థ ప్రజాస్వామ్యానికి వెన్నెముక. అది అధికార పార్టీకి అనుబంధ సంస్థ కాదు. రాజ్యాంగానికి విధేయంగా పనిచేయాల్సిన పోలీసు యంత్రాంగం రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి వ్యవహరిస్తోందనే అభిప్రాయం బలపడితే దాని మూల్యం మొత్తం సమాజమే చెల్లించాల్సి వస్తుంది. ఒకసారి ప్రజలు పోలీసు వ్యవస్థ నిష్పాక్షికతను నమ్మడం మానేస్తే, చట్ట పాలన పునాదులే కదిలిపోతాయి.

అధికారంలో ఉన్నవారు ఒక విషయం మరచిపోకూడదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజాస్వామ్యం, భావప్రకటన స్వేచ్ఛ, పౌర హక్కుల గురించి గొంతెత్తిన నాయకులు అధికారంలోకి వచ్చిన తరువాత అదే హక్కులను కాలరాస్తే ప్రజలు గమనించకుండా ఉండరు. చరిత్ర చెబుతున్న ఒకే ఒక్క సత్యం ఏమిటంటే, అణచివేతతో ఏ ప్రభుత్వమూ శాశ్వతంగా నిలబడలేదు. ప్రజల అసంతృప్తిని పోలీసు కేసులతో అణచివేయాలని ప్రయత్నించిన ప్రతి పాలక వర్గం చివరకు ప్రజాస్వామ్య తీర్పు ముందు తలవంచక తప్పలేదు.

ప్రభుత్వం ఎదుర్కోవాల్సిన అసలు సమస్యలు ప్రజల జీవితాలతో ముడిపడి ఉన్నాయి. ఉపాధి, వ్యవసాయం, ధరల పెరుగుదల, నిరుద్యోగం, విద్య, వైద్యం, సామాజిక భద్రత ఇవే ప్రజల రోజువారీ ఆందోళనలు. వాటికి సమాధానాలు ఇవ్వాల్సిన ప్రభుత్వాలు తన శక్తి, సామర్థ్యాలను సమస్యల పరిష్కారం కోసం కాకుండా ప్రశ్నలు సంధించిన విమర్శకులపై కేసులు నమోదు చేయడంలో ఖర్చు చేస్తే ప్రజల సమస్యలు పరిష్కారం కావు. విమర్శను అణచివేయడం వల్ల అసంతృప్తి మాయమవదు; అది మరింత లోతుగా వ్యాపిస్తుంది.ఏదో సమయంలో ఉప్పెనలా మారుతుంది.అప్పుడు అధికార మందంతో ఊగిపోతూ డైలాగులు చెప్పేవారు...ప్రజాగ్రహపు వెల్లువలో కొట్టుకు పోతారు.

భారత రాజ్యాంగం పౌరులకు కేవలం ఓటు హక్కు మాత్రమే ఇవ్వలేదు. ప్రశ్నించే హక్కు, అసమ్మతి వ్యక్తం చేసే హక్కు, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు కూడా ఇచ్చింది. ఇవన్నీ ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల ప్రకటనలో గుర్తింపు పొందిన ప్రాథమిక స్వేచ్ఛలే. వాటిని పరిమితం చేయడం అంటే ఒక వ్యక్తిని మాత్రమే కాదు, ప్రజాస్వామ్య ఆత్మను శిక్షించడం. ప్రభుత్వాలు మారుతుంటాయి. రాజకీయ పార్టీలు వస్తుంటాయి, పోతుంటాయి. కానీ రాజ్యాంగం శాశ్వతం. అధికారాన్ని నిలబెట్టేది భయం కాదు, ప్రజల విశ్వాసం. విమర్శలను వినగలిగిన ప్రభుత్వమే బలమైన ప్రభుత్వం. ప్రశ్నించే గొంతును దేశద్రోహంగా చిత్రీకరించే ప్రభుత్వం చివరకు ప్రజాస్వామ్యాన్నే బలహీనపరుస్తుంది. అందుకే పాలకులు గుర్తుంచుకోవాల్సిన చివరి హెచ్చరిక ఒక్కటే–ప్రశ్నించే పౌరులను శత్రువులుగా చూసే రోజు నుంచి ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది; రాజ్యాంగాన్ని బలహీనపరిచే ప్రతి అడుగు చివరకు అధికారాన్నే కూలదోస్తుంది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# మహాకవి పాల్కురికి సోమనాథుడు కల్య క్షేత్రం



"తొలి కోడి కను విచ్చి నిలిచి మైవెంచి
జలజల రెక్కలు సడలించి నీల్గి
గ్రక్కున గాలార్చికంఠంబు విచ్చి
ముక్కున నీకలు చక్కొల్పి కడుపు
నిక్కించి మెడ సాచి నిక్కి ముస్సూచి
కొక్కొరో కుర్రని కూయకమున్న"

అంటూ తెలుగు జాతినే కాదు తెలుగు భాషా సాహిత్యాలను మేల్కొల్పిన మహాకవి పాల్కురికి సోమనాథుడు. తెలంగాణ తేనె మాగాణిగా పేరొందిన జనగామ జిల్లా పాలకుర్తి గ్రామంలోని సంప్రదాయ కుటుంబానికి చెందిన శ్రీమతి శ్రియా దేవి–విష్ణురామి దేవుని దంపతులకు జన్మించాడు. వారి ఇలవేల్పు అయిన శ్రీ సోమేశ్వర స్వామి పేరనే ఆయనకు సోమనాథుడని పేరు పెట్టారు. క్రీస్తు శకం 1160–1240 నడిమి కాలానికి చెందినవాడు. కాగా సోమనాథుడు కరస్థలి విశ్వనాథయ్య వద్ద విద్యాబుద్ధులను నేర్వగా గురు లింగార్యుడనే గురువు వద్ద శివ దీక్షను పొందాడు. ఆయనకు గురుభక్తి ఎక్కువ. అందుకే ఆయన ప్రధాన రచనలన్నీ " శ్రీ గురు" శబ్దారంభంగానే చేశాడు. తెలుగు, సంస్కృతం, కన్నడ భాషలలో కలిపి మొత్తం ఆయన 30 వరకు రచనలు చేసినట్లు తెలుస్తుంది. అందులో తెలుగుకు సంబంధించి సోమనాథ స్తవం, అనుభవసారం, వృషాధిప శతకం, చతుర్వేద సారం, చెన్నమల్లు సీసాలు, బసవ పురాణం, పండితారాధ్య చరిత్ర అన్నవి కాగా సంస్కృతంలో సోమనాథ భాష్యం, వృషభాష్టకం, త్రివిధ లింగాష్టకం అన్నవి ప్రధానమైనవి. కన్నడంలో సద్గురు రగడ, చెన్న బసవ రగడ, అక్షరాంక పద్యములు, శరణు బసవ రగడ, బసవలింగ నామావళి, శీల సంపాదనం, శివగణ సహస్రనామాలు అనేవి ముఖ్యమైనవి.

కర్ణాటకలోని బిజ్జలుని వద్ద మంత్రిగా ఉన్న బసవేశ్వరుడు "వీరశైవం" ప్రాతిపదికగా సత్యము, అహింస, భూత దయ, కుల నిర్మూలన, మూఢాచార నిరసనం, అంటరానితన నిర్మూలనం, శ్రామిక గౌరవం, సర్వ మానవ సమానత్వం మొదలైన ఆదర్శాల సాధనకు విశేషంగా కృషి చేశాడు. బసవన భావాలు కన్నడ సాహిత్యంలో "వచనాలు"గా స్థిరపడ్డాయి. అక్కడి ప్రచండ వాయువుల ప్రభావం తెలుగు నాట విస్తృతంగా ప్రసరించగా దానితో ప్రభావితుడైన సోమనాథుడు, నన్నయ నుండి సంప్రదాయ బద్ధంగా వస్తున్న మార్గ కవితను కాదని దేశి కవితకు పట్టం కట్టాడు. ఆ పరంపరలో వస్తువు, భాష, ఛందస్సులలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టాడు. తన కవిత్వం జాతి జనులు పాడుకునే సాహిత్యంగా మారాలని తాను ఐహిక ఆముష్మిక హేతువుగా భావించిన ద్విపదలో బసవ పురాణం, పండితారాధ్య చరిత్ర వంటి దివ్యకావ్యాలను వెలువరించాడు. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత ఆచార్య సి నారాయణ రెడ్డి గారు బసవ పురాణాన్ని "తొలి తెలుగు సాంఘిక కావ్యం"గా గుర్తిస్తే, తిమ్మా వజ్జల కోదండ రామయ్య గారు పండితారాధ్య చరిత్రను "తొలి విజ్ఞాన సర్వస్వం"గా అభివర్ణించారు.

సోమనాథుడు ప్రతిభావంతుడైన కవి కనుకనే అనేక ప్రయోగాలు చేశాడు. ఆ పరంపర లోనే రగడలు, త్రిభంగి, శతకం, ఉదాహరణం వంటి ప్రక్రియలు వెలువరించాడు.


"అల్పాక్షరంబుల అనల్పార్థ రచన"చేయు టయే కవి వివేకంబు" అన్న సోమనాథుడు బసవ పురాణంలో బెజ్జమహాదేవి కథ, గొడగూచి కథ మొదలైన ముగ్ధ భక్తుల కథలను రచించి పాఠకులను పరవశం చేశాడు.

వీరశైవంలో "కాయకమే కైలాసం" కనుక ఆయన సృష్టించిన పాత్రలన్నీ శ్రామిక గౌరవానికి, నాటి సమకాలీనతకు ప్రతిబింబాలు అనవచ్చు.

అనిదంపూర్వమైన సాహిత్యాన్ని సృష్టించిన పాల్కురికి రచనలను వెలుగులోకి తేవడంలో బండారు తమ్మయ్య తమ జీవన పర్యంతం కృషి చేశారు. బసవ పురాణానికి వేటూరి ప్రభాకర శాస్త్రి గారు, జి.వి. సుబ్రహ్మణ్యం గారు పీఠికలు రాయగా పండితారాధ్య చరిత్రకు చిలుకూరు నారాయణరావు గారు రాశారు. వరంగల్ జిల్లా పల్లగుట్ట కు చెందిన వేణుముద్దల నరసింహారెడ్డి గారు "పాల్కురికి సోమన కృతులు–పరిశీలన" అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ డిగ్రీని పొందారు. ఇటీవల సహృదయ సాంస్కృతిక సంస్థ వారు దానిని ముద్రించారు. తేదీ 25.4.1997న వీరశైవ సాహిత్య ప్రచారమే ధ్యేయంగా శివ శ్రీ ధూపం బసవ నాగయ్య గారి పూనికతో ఏర్పడిన ఓం నమ:శివాయ సాహితీ సాంస్కృతిక పరిషత్తు వారు సాహిత్య ప్రపంచంలో అలభ్యంగా ఉన్న సోమనాథుని రచనలను వెలికి తేవడంలో విశేషంగా కృషి చేసారు. నిడదవోలు వెంకటరావు గారు ఉదాహరణ వాఙ్మయ చరిత్రను రచించారు. తిరుమల రామచంద్ర ప్రత్యేక సంచికను వెలువరించారు. ఆచార్య రవ్వా శ్రీహరి చతుర్వేద సారానికి, తుమ్మపూడి కోటేశ్వరరావు గారు చెన్నమల్లు సీసములకు చక్కని పీఠికను, వ్యాఖ్యానాన్ని రచించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత తెలంగాణ తొలి సాంస్కృతిక ఆవిష్కర్త పాల్కురికి సోమనాథుడు అనే గ్రంథం ఆచార్య అనుమాండ్ల భూమయ్య గారి సంపాదకత్వంలో వెలువడింది.

2008లో కాకతీయ విశ్వవిద్యాలయం వారు పాల్కురికి సోమనాథుని కృతుల పై మూడు రోజులపాటు సదస్సు నిర్వహించి ఆ ప్రసంగ వ్యాసాలను సంపుటంగా వెలువరించారు. అలాగే జోగిపేట ప్రభుత్వ కళాశాల వారు ప్రథమాంధ్ర ప్రజాకవి–పాల్కురికి పేర పుస్తకాన్ని ప్రచురించారు. పాలకుర్తి గ్రామంలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, సోమనాథ కళాపీఠం ఆయా సందర్భాలను అనుసరించి సదస్సులను నిర్వహిస్తూ పురస్కారాలను అందజేస్తున్నారు. పాలకుర్తిలో "పాల్కురికి సోమనాథుని స్మృతి వనం" పేరుతో తెలంగాణ ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి అక్కడ భారీ స్తూపాన్ని , గ్రంథాలయ ఏర్పాటు కోసం, సాహితీ సమావేశాల నిర్వహణ కోసం ప్రత్యేకంగా గదులు నిర్మించింది.

మహాకవి సోమనాథుడు తన చివరి దశలో ఈ ప్రాంతమంతా తురుష్కుల ఆధీనం అవుతున్న కాలంలో శివశరణి సర్వశిలే చెన్నమ్మ దర్శనం కోసం బెంగళూరుకు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న మాగడి తాలూకా కల్య క్షేత్రానికి ఎడ్ల బండి పై వెళ్లి కొంతకాలం పాటు అక్కడే ఉండి శివ సాయుజ్యం పొందినట్లు చరిత్రకారులు, సాహితీవేత్తలు నిర్ధారించారు. ఈ వ్యాస రచయిత తేదీ 2.7.2026న కల్య గుట్టకు వెళ్లి అక్కడ కల్లేశ్వర స్వామి గుడి ద్వారానికి ముందు ఒక ప్రక్కన నెలకొని ఉన్న పాల్కురికి సోమనాథుని సమాధిని సందర్శించి నివాళులర్పించడం జరిగింది. ఆ గ్రామ వాస్తవ్యులు శివశ్రీ ఈశ్వర ప్రసాద్ గారి తో కలిసి వెళ్లి చారిత్రకంగా, సాంస్కృతికంగా ఎంతో పేరు ప్రఖ్యాతులుగాంచిన ఆ క్షేత్రంలోని అనుభవ మంటపం, శూన్య సంపాదన వంటి కార్యక్రమాలు జరిగిన ప్రదేశాలను చూడడం జరిగింది. ఒకనాడు బసవేశ్వరుడు, అల్లమ ప్రభు మొదలైన వీరశైవులంతా అక్కడ పాల్గొన్నారని స్థానికులు భావిస్తున్నారు. అందుకు తగినట్లుగా గుట్టపై చెన్నమ్మ నివసించిన గుహ, ఆమె సమాధి, భక్తుల నివాసానికి యోగ్యమైన మంటపం ఉన్నాయి. దానిని ఆనుకునే సుమారు 1000 సంవత్సరాల కాలం నాటి శివుడు, నంది విగ్రహాలు ఉన్నాయి. దానికి ప్రక్కన కొంత దూరంలోనే అక్కడి మూలవిరాట్టు కల్లేశ్వర స్వామి ఆలయం, దానికి ఎదురుగా బయట ఒక ప్రక్కన పాల్కురికి సోమనాథుని సమాధి నెలకొని ఉన్నాయి. దాని చుట్టూ గడ్డి– గాదం పెరిగి ఉన్నాయి. మరోవైపు చిన్నపాటి లోయ నెలకొని ఉంది. అక్కడే ఉన్న మారేడు చెట్టు రోజు ఆ సమాధిపై రెండు, మూడు దళాలను సహజంగా రాలుస్తుందనుకుంటాను. ఆయన శివ భక్తి అంత గాఢమైనది కనుకనే బహుశా ఎవరూ పట్టించుకోకపోయినా ప్రకృతి మాత్రం పరమాదరంతో ఆ మహాకవిని సేవిస్తుందని తలుస్తున్నాను. పరిస్థితులను గమనించినప్పుడు అక్కడ నిత్యం ధూప దీప నైవేద్యాలు కూడా నామమాత్రంగానే సాగుతున్నాయని తెలుస్తుంది, అది చూసిన వారికి అర్థమవుతుంది. ప్రతి సోమవారం అర్చకులు వచ్చినప్పుడే అక్కడ కైంకర్యాలు. శివరాత్రికి మాత్రం రెండు మూడు రోజుల పాటు అక్కడ అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారని చెప్పారు. ఆ గుట్ట క్రింది భాగంలోనే అక్కడి కణ్వ నది జన్మస్థలం నెలకొని ఉంది. చుట్టూ కొబ్బరి, మామిడి తోటలు, పచ్చిక బయళ్ళతో నిండి ఉన్న కల్య గుట్ట (బెట్ట) ప్రకృతి రామణీయకంగా ఉన్నా అక్కడ ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు కనిపించలేదు. శైవులు, లింగాయతులు, బసవేశ్వరుని ప్రభావం, వీరశైవం అధికంగా ఉన్నా, ఈ క్షేత్రం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండటం ఒకవైపు ఆశ్చర్యాన్ని మరోవైపు తీరని బాధను కలిగించింది. ఇదే విషయాన్ని అక్కడి ఒకరిద్దరూ ప్రవాసులతో మాట్లాడినప్పుడు సోమనాథుడు తెలుగువాడు కదా! అందుకే ఇక్కడి వాళ్లు పట్టించుకోవడం లేదేమో! అన్న మాటలు నిజమనిపించాయి. ఇప్పటికీ వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, పరిశోధకులు, ఆచార్యులు, భక్తులు వచ్చి వెళుతుంటారట. తేదీ 3.1.2001న బసవ సమితి సభ్యులు బసవకృప వ్యవస్థాపక సంపాదకులు ధూపం బసవ నాగయ్య గారు ప్రభృతులు ఈ క్షేత్రాన్ని సందర్శించి ఆ మహాకవికి నివాళులర్పించారు. అలాగే కల్య క్షేత్రాన్ని గురించి తెలుసుకోవడం, ఇక్కడి సోమనాథుని సమాధిని గురించి డాక్టర్ సి.వి రామచంద్ర రావు గారు మే– 2002 బసవకృప ప్రత్యేక సంచికలో విశేష వ్యాసం రాశారు. బసవ సమితి సభ్యులు, బసవకృప పాఠకులు, సోమనాథ కవి అభిమానులు పూనుకొని కనీసం "పాల్కురికి సోమనాథుని సమాధి" చుట్టూ మంటప నిర్మాణం చేసి, దానిపై పాల్కురికి సోమనాథుని శిలా విగ్రహాన్ని శాశ్వతంగా ఉండేలా ఏర్పాటు చేసి నామఫలకాన్ని రాయించాలని, ప్రాథమికంగా దాని పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నాను. ముఖ్యంగా తెలంగాణ, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాల దేవాదాయ ధర్మాదాయ, సాంస్కృతిక, పర్యాటక శాఖల సమన్వయంతో కల్య క్షేత్ర అభివృద్ధికి తగిన చర్యలు తీసుకునేలా కృషి చేయాలని ప్రార్థిస్తున్నాను.



డాక్టర్ శంకరమంచి
శ్యాంప్రసాద్
99 891 48 305

## రాజస్థాన్ ఘటనను ఖండిస్తూ హయత్‌నగర్‌లో మహిళల నిరసన



**హయత్‌నగర్, జూలై 8 (జనం సాక్షి) :** రాజస్థాన్‌లో 13 ఏళ్ల మైనర్ బాలికపై జరిగిన సామూహిక లైంగిక దాడి ఘటనను ఖండిస్తూ భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) హయత్‌నగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి సీపీఐ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా సామిడి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు, బాలికలపై జరుగుతున్న లైంగిక దాడుల నివారణకు కఠిన చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని అన్నారు. బాధిత బాలిక కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలిచి న్యాయం చేయాలని కోరారు. అలాగే చట్టసభల్లో మహిళలకు 43 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ మండల అధ్యక్షురాలు చెంది సుమతి మాట్లాడుతూ మహిళల భద్రతకు ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ మండల ప్రధాన కార్యదర్శి కుంచాల సౌజన్య, మహిళా నాయకులు ఆదిలక్ష్మి, రాపాక సౌజన్య, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు చెంది రాము, మహిళా సమాఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ముంగనూరు ప్రభుత్వ భూములను కాపాడాలి

**ఇబ్రహీంపట్నం, జూలై 8 (జనం సాక్షి) :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ (ప్రస్తుతం తొర్రూరు డివిజన్) పరిధిలోని ముంగనూరు గ్రామంలో ప్రభుత్వ భూములపై జరిగిన భారీ భూ కుంభకోణం, అక్రమ ఆక్రమణలు, అక్రమ రిజిస్ట్రేషన్ల అంశాలపై మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వానికి చెందిన కోట్ల రూపాయల విలువైన భూములను భూ మాఫియా అక్రమంగా ఆక్రమించుకుని, కొందరు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల సహకారంతో రిజిస్ట్రేషన్లు జరిపించడం అత్యంత దురదృష్టకరమన్నారు. ప్రభుత్వ రికార్డుల్లో ప్రభుత్వ భూములుగా నమోదైన సర్వే నంబర్లనే ఎలా రిజిస్ట్రేషన్ చేశారో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం విడుదల చేసిన అధికారిక సమాచారంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ముంగనూరు గ్రామంలోని సర్వే నంబర్లు 38/1, 44/4, 44/5, 46, 85, 89, 91, 127 ప్రభుత్వ భూములుగా గుర్తించి, రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22–ఏ కింద నిషేధిత జాబితాలో చేర్చిన విషయం స్పష్టంగా ఉందన్నారు. అయితే పత్రికల్లో వెలువడిన కథనాల ప్రకారం అదే గ్రామంలోని సర్వే నంబర్లు 44/2, 44/4, 44/6, 44/8, 44/10, 44/11 తదితర భూములపై భారీ స్థాయిలో అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగి, కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు భూ మాఫియా చేతుల్లోకి వెళ్లిన విషయం వెలుగులోకి



వచ్చిందని పేర్కొన్నారు. "ప్రభుత్వ భూములను అక్రమంగా రిజిస్టర్ ఎలా చేస్తారు? ఎమ్మార్వో, ఆర్డీవో, రిజిస్ట్రేషన్ అధికారులు దీనికి ఎలా అనుమతించారు? వీరు ప్రభుత్వ అధికారులా? లేక కాంగ్రెస్ కార్యకర్తల్లా 'బిగ్ బ్రదర్స్'కు ప్రభుత్వ భూములను కట్టబెడుతున్నారా?" అని ఆయన ఘాటుగా ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో భూ మాఫియా మరింత రెచ్చిపోయిందని ఆరోపిస్తూ, "కాంగ్రెస్ = కరప్షన్... కరప్షన్ = కాంగ్రెస్" అని ఎద్దేవా చేశారు. అవినీతికి కేర్ ఆఫ్ అడ్రస్ కాంగ్రెస్ అని, దోచుకోవడం... దాచుకోవడం... ఇదే కాంగ్రెస్ ప్రభుత్వ విధానమని విమర్శించారు. ముఖ్యమంత్రి నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలు వరకు 'దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి' అన్నట్లుగా ఎక్కడ ప్రభుత్వ భూములు కనిపిస్తే అక్కడ భూ భక్షకుల్లా మింగేస్తున్నారని తీవ్రంగా ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ప్రస్తుతం "ఆర్ ఆర్ టాక్స్ " నడుస్తుంటే, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మాత్రం "ఆర్ ఆర్ ఆర్ టాక్స్ " పేరుతో అక్రమ వసూళ్లు, భూ దందాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ సందర్భంగా బూర నర్సయ్య గౌడ్ పలు ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు. ముంగనూరు ప్రభుత్వ భూములపై జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్లపై తక్షణమే సమగ్ర విచారణ జరపాలని, అక్రమ రిజిస్ట్రేషన్లన్నింటినీ వెంటనే రద్దు చేయాలని కోరారు. భూ ఆక్రమణదారులు, భూ మాఫియాపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు, సంబంధిత ఎమ్మార్వో, ఆర్డీవో , రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల పాత్రపై పూర్తిస్థాయి విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుని ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఈ అంశంపై వెంటనే స్పందించకపోతే, బీజేపీ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో తుర్కయంజాల్, తొర్రూరు డివిజన్ అధ్యక్షులు ఎలిమినేటి నర్సింహా రెడ్డి, కందాల బలదేవ్ రెడ్డి, బోసుపల్లి ప్రతాప్, బాసరాజు సురేష్, నర్సింహ గౌడ్, నోముల కార్తీక్ గౌడ్, నందగిరి సురేష్, గుండా కృష్ణ, నాగరాజు, గ్రామ పెద్దలు, యువకులు, బీజేపీ కార్యకర్తలు మరియు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనం నడిపిన 24 మందికి శిక్షలు

- **10 మందికి మూడు రోజుల జైలు, రూ.1.42 లక్షలకు పైగా జరిమానా**

**ముషీరాబాద్, జూలై 8 (జనం సాక్షి) :** చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీల్లో పట్టుబడిన 24 మందిని బుధవారం న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. వీరిలో తొలిసారి మద్యం సేవించి వాహనం నడిపిన 14 మందికి జరిమానాతో పాటు సామాజిక సేవ (కమ్యూనిటీ సర్వీస్) శిక్ష విధించారు. రెండోసారి అదే నేరానికి పాల్పడిన 10 మందికి మూడు రోజుల జైలు శిక్షతో పాటు జరిమానా విధించారు. ఈ కేసుల్లో మొత్తం రూ.1,42,200 జరిమానా వసూలైనట్లు చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె. ఏడుకొండలు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు.

## మహిపాల్ రెడ్డి మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలి



**తూప్రాన్, జూలై 8 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ప్రజా నాయకుడు చిట్కుల మహిపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం తూప్రాన్ లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా జన్మదిన వేడుకలు జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అప్సర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేసి మానవతా దృక్పథాన్ని చాటారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో జన్మదిన కేక్‌ను కట్ చేసి, మహిపాల్ రెడ్డికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి లయన్ డాక్టర్ అప్సర్ భాయ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవా భావంతో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ అప్సర్, బీసీ సెల్ అధ్యక్షుడు సత్యనారాయణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తూప్రాన్ మాజీ సర్పంచ్ వెంకటేశం గుప్తా, ఎండి ఉమర్, చిట్టిమల్ల అనిల్, గాండ్ల వీర్, కొక్కొండ లక్ష్మారెడ్డి, ఎండి సమీర్, ఎండి అజార్, తదితరులు పాల్గొని మహిపాల్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు మాట్లాడుతూ చిట్కుల మహిపాల్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న ప్రజానాయకుడని కొనియాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

- **వనమహోత్సవం లక్ష్యాలను చేరుకోవాలి**
- **జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశాలు**



**గద్వాల నడిగడ్డ, జూలై 8 (జనం సాక్షి) :** ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత ప్రారంభమైనందున మొదటి విడతలో నిర్మిస్తున్న ఇండ్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఐడిఓసి సమావేశపు మందిరంలో వివిధ అంశాలపై జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వనమహోత్సవంలో భాగంగా జిల్లాలో ఇప్పటివరకు 36 శాతం మొక్కలు మాత్రమే నాటారని, జూలై 15 తర్వాత ఇంటింటికి కూడా మొక్కలు పంపిణీ చేసి లక్ష్యాలకు చేరువ కావాలన్నారు. నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీంను అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకునేలా సంబంధిత అధికారులు సహకరించాలన్నారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాల్సిందిగా ఆదేశించారు. గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణాలను కూడా వేగవంతం చేయాలని ఎంపీడీఓలకు ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేసి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అనంతరం మండలాలు, పురపాలికల వారీగా వివిధ అభివృద్ధి పనులు, పథకాల అమలుపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం



**మొయినాబాద్, జూలై 8 (జనంసాక్షి) :** సొంతింటి కల సాకారం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని, తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి అర్హులైన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పామెన భీమ్ భరత్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని తోలకట్ట గ్రామంలో ఇందిరమ్మ పథకంలో ఇండ్లు నిర్మించుకున్న వారివి గృహ ప్రవేశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో భీమ్ భరత్ పాల్గొని పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలలో ఒకటిగా ఇందిరమ్మ ఇల్లు పథకం అని తెలిపారు. మెరుగైన గృహ వసతి కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. లబ్ధిదారులు సొంతింటి కలను సాకారం చేసుకొని నాణ్యతతో నిర్మించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్రెడ్డికి భీమ్ భరత్ లబ్ధిదారుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే లబ్ధిదారులు ఎంతో మంది సొంతంటి కల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవడం ఆదర్శంగా కాంగ్రెస్ పార్టీకి లభిస్తుందని పేర్కొన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానయ్య, ఉపాధ్యక్షులు మర్రి రవీందర్రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గం లేబర్ సెల్ ప్రధాన కార్యదర్శి భానూరి శివశంకర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రామకృష్ణారెడ్డి, తోల్కట్ట మాజీ సర్పంచ్ లు సత్యనారాయణ, శ్రీనివాస్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చాకలి శ్రీశైలం, చిలుకూరి రాజు, ఇనాయత్, వార్డు సభ్యులు కుమార్, నవీన్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు నర్సింహ్మా, అమిత్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి

**బంట్వారం, జూలై 8 (జనం సాక్షి) :** బంట్వారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని డీఆర్ ఓ స్వర్ణలత సందర్శించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ మహేష్ సిబ్బందితో ఆమె మాట్లాడుతూ ఎస్ ఐఆర్ ప్రక్రియ ఎలా చేస్తున్నారని ఎలా కొనసాగుతుందని ఆరా తీశారు. ఎన్యూమరేషన్ ఫారాలను ప్రజలకు అందించి బీఎల్ ఓ లు వాటిని స్కానింగ్ చేయాల్సి ఉంటుందని సూచించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టాలని అధికారులకు సూచించారు. డిప్యూటి తహసీల్దార్ మహేష్ మాట్లాడుతు అన్ని గ్రామాలలో బీఎల్ఓ లు ఇంటింటికి తిరిగి ఫారంలో ఇచ్చి వాటితో పూర్తి వివరాలు సేకరించటం జరుగుతుందని దాదాపుగా అన్ని గ్రామాలలో ఓటర్లకు ఫారాలను అందించటం జరిగిందని వాటిని సకాలంలో ప్రజల నుండి సేకరించటం జరుగుతుందని తెలిపారు. బీఎల్ ఓలకు సూపర్ వైజర్లకు బీఎల్ఎకు ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తు ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని డీఆర్ ఓ స్వర్ణలత



కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామ్ గోపాల్, జీపీఓ యాదగిరి, జూనియర్అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 14న 'తపస్' జిల్లాస్థాయి ధర్నాలు విజయవంతం చేయండి

**ఇబ్రహీంపట్నం, జూలై 8 (జనం సాక్షి) :** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో జులై 14వ తేదీన నిర్వహించబోయే జిల్లాస్థాయి ధర్నా కార్యక్రమాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వోడ్నాల రాజశేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం మంచాల మండల పరిధిలోని ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన 'తపస్' సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. 2023 నుండి అమలు చేయాల్సిన పీఆర్సీ ని ప్రభుత్వం మూడేళ్లు పూర్తయినా అమలు పరచకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనవరి 2024 నుండి ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటికి తోడు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు జులై 4వ తేదీన రాష్ట్రంలోని అన్ని మండలాల తహసిల్దార్లకు వినతి పత్రాలు అందజేశామని గుర్తుచేశారు. దీనికి కొనసాగింపుగా జులై 14న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాలు నిర్వహించబోతున్నామని, మన ఆకాంక్షను ప్రభుత్వానికి తెలిసేలా ఉపాధ్యాయ లోకమంతా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య, జిల్లా అధ్యక్షులు కోట్ల కాశీ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి రమేష, రాష్ట్ర మీడియా కో కన్వీనర్ సత్తారి రాజిరెడ్డి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు భీమ్లా నాయక్, జిల్లా బాధ్యులు శివరంజని, యాదగిరి, సుజాత, భాగ్యమ్మ, మండల అధ్యక్షులు రావుల శివకుమార్, దత్తాత్రేయ, రాజేందర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# సీజనల్ వ్యాధుల నివారణకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి

- **జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల నడిగడ్డ, జూలై 8 (జనం సాక్షి) :** సీజనల్ వ్యాధుల వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐ.డి.ఒ.సి సమావేశం హాల్ నందు సీజనల్ వ్యాధుల అవగాహన,నులిపురుగుల నివారణ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.సీజనల్ వ్యాధుల నివారణకు ప్రతి మండల స్థాయిలో సమన్వయ సమావేశాలు నిర్వహించి,అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పనిచేయాలని ఆదేశించారు.ప్రతి మంగళవారం, శుక్రవారం తప్పనిసరిగా డ్రై డే కార్యక్రమాలు నిర్వహించి,చేపట్టిన పారిశుద్ధ్య పనులను రిజిస్టర్లలో నమోదు చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులైన మలేరియా,డెంగీ, చికున్‌గున్యా, ఫైలేరియా లాంటి వ్యాధులు ప్రబలకుండా




అన్నిరకాల చర్యలు చేపట్టాలన్నారు.జిల్లావ్యాప్తంగా ప్రతి గ్రామంలో, మున్సిపల్ వార్డులో వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్వాడి కేంద్రాలలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు.టీబీ కేసులను ముందస్తుగా గుర్తించి సకాలంలో చికిత్స అందించాలన్నారు. ఎన్‌సీడీ అయిన రక్తపోటు, మధుమేహం వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించి,వారికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్ర ఆల్బెండోజోల్ వేయించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. నులి పురుగుల వల్ల ఎదురయ్యే ఆరోగ్యపరమైన సమస్యల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు.ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ ,బిసి, మైనారిటీ హాస్టల్ లలో,గురుకులాలు,అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో భాధ్యతగా ఆల్బెండజోల్ మాత్రలు పిల్లలందరికీ వేయించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు,జిల్లా అధికారులు, ఎంపిడిఓలు,మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## తాండూర్‌లో బీఆర్ఎస్‌కు షాక్

- **ఎమ్మెల్యే బీఎంఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు**



**తాండూరు, జూలై 8 (జనంసాక్షి) :** తాండూర్ మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి మరింత బలం చేకూరింది. ఇంద్రనగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు షేక్ ఖాసీం అలీ, షేక్ పాషాతో పాటు పలువురు స్థానిక నాయకులు బుధవారం తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఎమ్మెల్యే బీఎంఆర్ నూతనంగా పార్టీలో చేరిన నాయకులకు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీలో కొత్త–పాత అనే తేడా లేదని, అందరూ కుటుంబ సభ్యుల్లా కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.పార్టీ కార్యక్రమాలను బలోపేతం చేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేలా ప్రతి కార్యకర్త అంకితభావంతో కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు ధారాసింగ్, పట్టణ అధ్యక్షులు నాగరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ బాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ళ నర్సిములు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, వార్డు ఇంచార్జులు, సీనియర్ నాయకులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.బీఆర్ఎస్ నుండి ముఖ్య నాయకులు కాంగ్రెస్‌లో చేరడంతో తాండూర్ రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారింది.

# గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేదకు శాశ్వత గృహమే లక్ష్యం

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- వనపర్తిలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ
- రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొనసాగుతోంది
- వనపర్తికి మరో 2 వేల ఇళ్లు.. సబ్ రిజిస్ట్రార్ భవనం, ప్రెస్ క్లబ్‌కు హామీ



**వనపర్తి బ్యూరో, జూలై 8 (జనంసాక్షి) :** గుడిసెల్లో నివసిస్తున్న ప్రతి నిరుపేద కుటుంబానికి శాశ్వత గృహం కల్పించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి గృహరహితులు లేని తెలంగాణగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.
బుధవారం వనపర్తి జిల్లా పర్యటన సందర్భంగా రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వంపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో తొలి విడతలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు, రెండో విడతలో 3.5 లక్షల ఇళ్లు మంజూరు చేసి మొత్తం 8 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టామని చెప్పారు. లబ్ధిదారులు ఒక్క రూపాయి లంచం ఇవ్వకుండా నిధులు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యే విధంగా పారదర్శక వ్యవస్థను అమలు చేస్తున్నామని వెల్లడించారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్న మంత్రి, రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ అమలు చేశామని, రైతు భరోసా కింద రూ.9,300 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ అందిస్తున్నామని, మహిళా సంఘాలకు రూ.63 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందించామని వివరించారు. ఇప్పటికే 72 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, త్వరలో మరో 22 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పారు.

### వనపర్తికి ప్రత్యేక ప్రాధాన్యం

వనపర్తి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.275 కోట్ల వ్యయం చేస్తున్నామని, రెండో విడతలో వనపర్తికి 2 వేల ఇళ్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు వనపర్తిలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ భవనం, జర్నలిస్టుల కోసం ప్రెస్ క్లబ్ భవనం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.
ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక, మట్టి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. సాదా బైనామా దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి అర్హులైన వారికి రెగ్యులరైజేషన్ కల్పించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

### ప్రభుత్వంపై అసత్య ప్రచారాలను నమ్మొద్దు : జూపల్లి

మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అమలులో ఉన్న సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ, అదనంగా కొత్త పథకాలను అమలు చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తిగా పారదర్శకంగా సాగుతోందని పేర్కొంటూ, లబ్ధిదారులు అప్పులు చేయకుండా ప్రభుత్వం నిర్దేశించిన పరిమితుల్లోనే ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. ప్రభుత్వంపై సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కోరారు.

### ప్రతి హామీని అమలు చేస్తున్నాం: వాకిటి శ్రీహరి

మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందించి గుడిసెలు లేని తెలంగాణను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

### మరో 2 వేల ఇళ్ల కోసం ఎమ్మెల్యే విజ్ఞప్తి

ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ వనపర్తికి రెండో విడతలో 2 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం సంతోషకరమన్నారు. అదనంగా మరో 2 వేల ఇళ్లు, జిల్లాలోని 32 ఎస్టీ హ్యాబిటేషన్లకు 640 ఇళ్లు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. వనపర్తి బైపాస్ రహదారి, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, పెబ్బేరు రెవెన్యూ డివిజన్, ప్రెస్ క్లబ్, క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్, జిల్లా ఎస్పీ సునీత రెడ్డి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి చట్టంపై రెవెన్యూ అధికారులకు పూర్తి అవగాహన అవసరం



**మెదక్ బ్యూరో చీఫ్, జూలై 8 (జనం సాక్షి) :** భూ భారతి చట్టంపై రెవెన్యూ అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులకు భూ భారతి చట్టంపై శిక్షణ, విధి నిర్వహణ బాధ్యతలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ రికార్డుల నిర్వహణ, భూమి హక్కుల రికార్డు (ఆర్ఓఆర్), వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యూటేషన్, వారసత్వం ద్వారా లేదా ఇతర మార్గాల్లో వచ్చిన భూముల మ్యూటేషన్, సాదా బైనామాల క్రమబద్ధీకరణ, పట్టాదారు పాస్‌పుస్తకాల జారీతో పాటు వివిధ రెవెన్యూ సేవలపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. భూ భారతి చట్టంలోని కీలక సెక్షన్లతో పాటు మ్యాపులు, సెత్వార్, ఖస్రా వంటి భూ రికార్డులపై స్పష్టమైన అవగాహన ఉండాలని తెలిపారు. నీరు, ఇసుక, ఇతర మైనింగ్ కార్యకలాపాల నియంత్రణ, అలాగే కులం, నివాసం, ఆదాయం, లోకల్ ఏరియా తదితర ధ్రువీకరణ పత్రాల మంజూరులో విచారణ నివేదికలను బాధ్యతాయుతంగా సిద్ధం చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థ ప్రభుత్వ పాలనలో కీలకమైనదని పేర్కొన్నారు. రెవెన్యూ చట్టాలపై సమగ్ర అవగాహనతో నిబద్ధత, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని, ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామసభల్లో నిర్వహించిన భూ భారతి సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, చట్ట నిబంధనల మేరకు పరిష్కరించాలని, సందేహాలుంటే ఉన్నతాధికారులను సంప్రదించాలని తెలిపారు. ట్రైనర్ భూమి సునీల్ భూ భారతి చట్టంలోని ముఖ్యాంశాలను వివరించి, తహసీల్దార్లు, ఆర్ఐలు, సర్వేయర్లు అడిగిన సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్, ల్యాండ్ సర్వే ఏడీ కిషన్, ఆర్డీవోలు రమాదేవి, రామకృష్ణ, బవయ్య, ట్రైనీ ఆర్డీవో మహమ్మద్ అహ్మద్, తహసీల్దార్లు, ఆర్ఐలు, సర్వేయర్లు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే వైఎస్సార్ ఆశయం



**నర్సాపూర్, జూలై 8 (జనం సాక్షి) :** నర్సాపూర్ పట్టణంలోని చిల్డ్రన్ పార్క్‌లో మహానేత, మాజీ ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా బుధవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి లు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిన మహానేత అని కొనియాడారు. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నేటికీ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమానికి అంకితభావంతో పనిచేయడం, ఆయన ఆశయాలను కొనసాగించడమే డా. వైఎస్సార్‌కు అందించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరాజు యాదవ్, నర్సాపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రిజ్వాన్, నర్సాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేశం, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అశోక్, జిల్లా కార్యదర్శి రవీందర్ యాదవ్, స్వాతి, నాయకులు రాధాకృష్ణ, మన్నే శ్రీనివాస్, మహేష్, చారి, దాడిగా నరేష్, లక్ష్మణ్ నాయక్, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొని డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు.

# ప్రజా భద్రతే పోలీసుల ధ్యేయం

- చట్ట అమలులో రాజీ లేదు
- జిల్లా ఎస్పీ సునిత రెడ్డి

**వనపర్తి బ్యూరో, జూలై 8 (జనంసాక్షి) :** ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించడమే జిల్లా పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఐపీఎస్. తెలిపారు. బుధవారం వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్ సెంటర్‌ను పరిశీలించిన ఎస్పీ, ఫిర్యాదుల స్వీకరణ, బాధితులతో సిబ్బంది వ్యవహరించే తీరు, కేసుల నమోదు, పరిష్కార విధానాన్ని సమీక్షించారు. అలాగే స్టేషన్ పరిశుభ్రత, పెండింగ్ కేసుల పురోగతి, రికార్డుల నిర్వహణ, స్వాధీనం చేసుకున్న వాహనాల సంరక్షణ, సీసీ కెమెరాల పనితీరు, సమస్యాత్మక వ్యక్తుల రికార్డులు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై అధికారులకు పలు సూచనలు చేశారు.

### పెండింగ్ కేసులు వేగవంతంగా పూర్తి చేయాలి

వనపర్తి టౌన్ ఎస్సై హరిప్రసాద్‌కు పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ ఆదేశించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ స్పందనాత్మక పోలీసింగ్ అమలు చేయాలని సూచించారు.

### నేరాలపై ప్రత్యేక నిఘా

అక్రమ రవాణా, గంజాయి, మాదక ద్రవ్యాలు, చోరీలు, అసాంఘిక కార్యకలాపాలపై జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా కొనసాగిస్తోందని ఎస్పీ తెలిపారు. మహిళలు, విద్యార్థినుల భద్రత కోసం షీ టీమ్స్, ప్రత్యేక పోలీసు బృందాలు నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నాయని పేర్కొన్నారు. ఈవ్‌టీజింగ్, ఆకతాయిలు, అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### తప్పుడు ప్రచారాలపై చర్యలు

సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, వదంతులు, ప్రజలను రెచ్చగొట్టే పోస్టులు, చట్టవ్యవస్థకు భంగం కలిగించే సందేశాలు ప్రచారం చేసే వారిపై సైబర్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. ధృవీకరించని సమాచారాన్ని ఇతరులకు పంపవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



### అనుమానాస్పద ఘటనలు వెంటనే తెలియజేయాలి

ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా అత్యవసర సేవల నంబర్ 112కు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ తనిఖీలో డీఎస్పీ గిరిబాబు, సీఐ సుగంధరత్నం, టౌన్ ఎస్సై హరిప్రసాద్‌తో పాటు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కాళేశ్వరం వైఫల్యాలకు కాంగ్రెస్‌ను బాధ్యులను చేయొద్దు

**సంగారెడ్డి, జూలై 8 (జనం సాక్షి) :** కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై మాజీ మంత్రి హరీష్ రావు చేస్తున్న ఆరోపణలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని కాంగ్రెస్ సీనియర్ నేత టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి విమర్శించారు. ప్రాజెక్టు నిర్మాణం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిందని, ఆ సమయంలో నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసిన హరీష్‌రావే జరిగిన లోపాలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. గాంధీభవన్లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం వైఫైల్యాలను కాంగ్రెస్ ను బాధ్యులను చెయ్యొద్దని రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, పై విమర్శలు చేయడం మానుకోవాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నాణ్యతా లోపాలు బీఆర్ఎస్ పాలనలోనే చోటుచేసుకున్నాయని, ఇప్పుడు వాటిని కాంగ్రెస్ ప్రభుత్వంపై నెట్టే ప్రయత్నం సరికాదన్నారు. అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ బ్యారేజీలలో నీటిని నిల్వ చేయవద్దని నేషనల్ డామ్ సేఫ్టీ అథారిటీ సూచించిందని జగ్గారెడ్డి తెలిపారు. ఇది కేంద్ర ప్రభుత్వానికి చెందిన సాంకేతిక సంస్థ నిర్ణయమని, ముఖ్యమంత్రి లేదా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కాదని స్పష్టం చేశారు. భద్రతా ప్రమాణాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. కాళేశ్వరం అంశంపై రాజకీయ విమర్శలు చేసే బదులు వాస్తవాలను ప్రజలకు చెప్పాలని హరీష్‌రావుకు




సూచించిన ఆయన, ఈ అంశంపై అసెంబ్లీలో చర్చకు రావాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను కోరారు. కాంగ్రెస్ నాయకులు క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి ప్రజా పోరాటం ద్వారా ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారని, వ్యక్తిగత విమర్శలు చేయకుండా కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లోపాలపై బీఆర్ఎస్ నాయకత్వం జవాబుదారీతనం ప్రదర్శించాలని జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. "డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనలను పాటించడమే ప్రభుత్వ బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే డబ్లింగ్ పనులకు భూసేకరణ పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



**గద్వాల నడిగడ్డ, జూలై 8 (జనం సాక్షి) :** రైల్వే డబ్లింగ్ పనులకు జిల్లా పరిధిలో కావాల్సిన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ఇరిగేషన్, రైల్వే లైన్ పనులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియపై బుధవారం ఢిల్లీ నుంచి ఉన్నతాధికారులు సంబంధిత జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొనగా జోగులాంబ గద్వాల కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి వీసీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మహబూబ్ నగర్ నుంచి డోన్ వరకు చేపడుతున్న డబ్లింగ్ రైల్వే లైన్ పనులకు జోగులాంబ గద్వాల జిల్లా పరిధిలో 104 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందన్నారు. ఇప్పటికే సంబంధిత రైతుల నుంచి భూసేకరణ ప్రక్రియ చివరి దశకు చేరుకున్నందున త్వరలోనే అవార్డు పూర్తి చేయాలన్నారు. అవార్డు పూర్తికాగానే రైల్వే అధికారులకు ఈ భూమిని అప్పగించడం జరుగుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వర గౌడ్ పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్

బిజినేపల్లి, జూలై 8 (జనం సాక్షి) : భవన నిర్మాణ కార్మికులకు, సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు 50 సంవత్సరాలు నిండిన తర్వాత 5వేల రూ,ల పింఛన్ సౌకర్యం కల్పించాలనిఏఐటియుసిజిల్లా ప్రధాన కార్యదర్శిమారేడు శివ శంకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బిజినపల్లి భవన నిర్మాణ కార్మికుల ముఖ్య కార్యకర్తల సమావేశం భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు చిన్న పాగా శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ పాల్గొని హలో కార్మిక, చలో తాడూర్, ఏఐటియుసి నాగర్ కర్నూల్ జిల్లా మూడవ మహాసభల కరపత్రాలు విడుదల చేశారుఅనంతరం మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా కార్మికుల కుటుంబాలకు ఆదుకోనీ కార్మికులకు ఇందిరమ్మ ఇల్లు, కార్మిక కుటుంబాల పిల్లలకు ఉచిత విద్య ,వైద్యం,కార్మికునికి 50 సం,, నిండిన తర్వాత 5000 పింఛన్లు ఇవ్వాలి, కార్మికుడు సహజ మరణం చెందితే 2, లక్షల నుండి 5 లక్షల వరకు పెంచాలి, మ్యారేజ్ గిఫ్ట్ కింద 30 వేలు ఇస్తున్నారు, దీనిని లక్ష రూపాయలు పెంచాలి, కార్మికులకు డెలివరీ కాన్పు కు 30 వేల రూపాయల నుంచి లక్ష రూపాయలు పెంచాలి,కార్మికులకు కూలి రేట్లు పెంచాలి, ప్రతి మండల కేంద్రంలో లేబర్ అడ్డాలను ఏర్పాటు చేయాలన్నారు, కార్మికులకు సబ్సిడీ కింద మోటార్ సైకిల్ ఇవ్వాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అభివృద్ధి ఫలాలు కార్మికుల పిల్లలకు చదువులు ఉద్యోగాలు అందే విధంగా చూడాలని అన్నారు, భవన నిర్మాణ కార్మికులు లేనిది కూలి కానుంచి ప్రధానమంత్రి వరకు ఇల్లు నిర్మించాలంటే భవనిర్మాణ కార్మికులు చాలా అవసరం అందుకని భవన నిర్మాణ కార్మికులను చిన్నచూపు చూడొద్దని మేస్త్రీలు కార్మికులు లేనిది పల్లెలు పట్టణాలు బహుళ అంతస్తులు




నిర్మించాలంటే మేస్త్రి కార్మికులను సమాజంలో చిన్న చూపు చూడొద్దని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం అనుబంధం ఏఐటీయూసీ, బిజినపల్లి మండల అధ్యక్షులు, డి,లక్ష్మయ్య, కార్యదర్శి, వెంకట్ రాములు, సహాయ కార్యదర్శి, నాగయ్య, మండల నాయకులు ఎండి రఫిక్, లక్ష్మణ్, బంగారయ్య, వెంకటయ్య, మల్లేష్ తదితర కార్మికులు పాల్గొన్నారు,

## ఓటు హక్కు పరిరక్షణకు ఎస్ఐఆర్ కీలకం



**బెజ్జంకి, జూలై 8 (జనం సాక్షి) :** మండలంలోని గూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ గూడెల్లి శ్రీకాంత్ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీకాంత్ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీలోపు ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ వివరాలను నమోదు చేసుకుని,అవసరమైన ఎస్ఐఆర్ దరఖాస్తు పత్రాలను సంబంధిత బీఎల్ఓలకు తప్పనిసరిగా అందజేయాలని సూచించారు. గడువులోగా నమోదు చేయకపోతే ఓటు కోల్పోయే అవకాశం ఉందని తెలిపారు. ఒక వ్యక్తికి ఒకే చోట మాత్రమే ఓటు ఉండేలా చేయడమే భారత ఎన్నికల సంఘం లక్ష్యమని వివరించారు. అనంతరం గూడెం గ్రామపంచాయతీని తొలిసారిగా సందర్శించిన తహసీల్దార్ శ్రీకాంత్‌ను సర్పంచ్ గూడెల్లి శ్రీకాంత్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జీపీఓ నిరీష్,గ్రామ కార్యదర్శి యాదగిరి,బీఎల్ఓ సరోజన,సీఏ సుష్మ,ఎమ్మార్వో కార్యాలయ సిబ్బంది రమేశ్,గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఒక ఎమ్మెల్యేగా ఏ అధికారినైనా కలిసే హక్కు నాకుంది

- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- నేను తప్పు చేయనప్పుడు ఎవరికీ వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదు
- నా అధికారాలు, పరిమితులు ఏంటో నాకు తెలుసు



**స్టేషన్ ఘన్పూర్ , జూలై 08 ( జనం సాక్షి ) :** ఒక ఎమ్మెల్యేగా, ప్రజా ప్రతినిధిగా ఏ అధికారినైనా కలిసే హక్కు నాకు ఉందని, నా నియోజకవర్గ సమస్యలు తెలపడం ఎమ్మెల్యేగా గా నా హక్కు అని మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. నియోజక వర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ నాకు రూల్స్ తెలుసు, నేను ఎక్కడా రూల్స్ అతిక్రమించలేదని, బిజినెస్ రూల్స్, రాజ్యాంగ ప్రకారం క్యాబినెట్ ర్యాంక్ లో ఉన్నవారు మాత్రమే సమీక్ష చేస్తారని, ఎమ్మెల్యే లు,ఎమ్మెల్సీలు సమీక్షలో పాల్గొంటా రని అన్నారు. నా నియోజకవర్గ పరిధిలోని ఆలయాల అభివృద్ధిపై వారి కార్యాలయానికి వెళ్లి దేవాదాయ శాఖ కమిషనర్ ని కలిసానని ఆలయాల అభివృద్ధికి ఆలయ కమిటీ చైర్మన్లతో కలిసి పలు వినతి పత్రాలు అందజేశానని అన్నారు. అవగాహనా లోపంతో మాట్లాడుతు న్నారని, నాపై ఇలాంటి వార్తలు రావడం చాలా బాధగా ఉందని, అభివృద్ధి గురించి ఆలోచించని వారు, ప్రజల మధ్యలో ఉండని వారు కాంట్రావర్సీలు సృష్టించి వార్తల్లో ఉండాలని చూస్తారని, అభివృద్ధిపై దృష్టి పెట్టకుం డా కొందరు అనవసర విషయాలపై దృష్టి పెడుతు న్నారని అన్నారు. ఉమ్మడి జిల్లాను పట్టించుకునే వారే లేకుండా అయ్యా రని, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో దేవా దులపై దృష్టి పెట్టాల్సిన బాధ్య త ఎవరిదని ప్రశ్నించారు. ఎంజీఎం ఆసుపత్రికి సూపరిం డెంట్ లేదు దానిని ఎవరూ పట్టించుకో వాలని, సూపర్ స్పెషలిటీ ఆసుపత్రి ప్రారంభోత్స వం చేయాలి దాన్ని పట్టించుకునే వారే లేరని అన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజి టెండర్లు పూర్తి చేయించి పనులు ప్రాంభిం చడానికి చొరవ తీసుకో వాల్సింది ఎవరని, అధికారాన్ని ప్రజల కోసం ఉప యోగించాలి కాని కాంట్రావర్సీల కోసం కాదని పరో క్షంగా మంత్రి కొండ సురేఖను ఉద్దేశించి మాట్లా డారు. వ్యక్తిగత విమర్శల కంటే అభివృద్ధి అంశాల కే ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు.


# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులను పరిశీలించిన జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న



**వరంగల్ ఎంజీఎం, జూలై 8(జనంసాక్షి):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతి, నాణ్యత, బిల్లుల చెల్లింపులకు సంబంధించిన అంశాలను సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకుని, నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా బల్దియా పరిధిలోని రాంపూర్ పట్టణ ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్సీ) నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం వరంగల్ పరిధిలోని రామన్నపేటలో డ్రైనేజీ నిర్మాణ పనులు, వాటికి సంబంధించిన బిల్లుల చెల్లింపు ప్రక్రియను సమీక్షించారు. తదుపరి దేశాయిపేట లోని ప్రతాపరుద్ర ఫిల్టర్ బెడ్ నిర్వహణ, అభివృద్ధి పనులు, 12వ డివిజన్లో మున్నూరు కాపు సంఘం వద్ద సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులు, పెరుక సంఘం సమీపంలో మిగిలిన అభివృద్ధి పనులు, లక్ష్మీ మేఘ టౌన్షిప్లో బీరన్నగుడి సమీపంలో హెచ్డీపీఈ పైప్లైన్ పనులు పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. అలాగే 16వ డివిజన్లో గోవిందరాజుల గుట్ట వద్ద నిర్మిస్తున్న ఈఎల్ఎస్ఆర్ వాటర్ ట్యాంక్ పనులు, అదే డివిజన్లో కొనసాగుతున్న రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. పైడిపల్లి ప్రాంతంలో రోడ్డు నిర్మాణ పనులు, లక్ష్మీపు రంలో ఇంజనీరింగ్ విభాగం చేపడుతున్న అభివృద్ధి పనులు, జాన్పాక్ ప్రాంతంలో చేపట్టనున్న అభివృద్ధి పనులు కూడా పరిశీలించారు. చింతల్, రంగశాయిపేట, ఉర్సు ప్రాంతాల్లో పూర్తయిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపు ప్రక్రియను సమీక్షిస్తూ, ప్రజలకు ఉపయోగపడే పనులను నాణ్యతతో, పారదర్శకంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవి కుమార్, సంతోష్ బాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రంగారావు, సురేష్, అసిస్టెంట్ ఇంజనీర్లు రామన్న, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ పట్టాను రద్దు చేయాలని విష్ణుపురం బాధితుల ధర్నా



**పాలకుర్తి, జూలై 08 (జనంసాక్షి) :** తమ కుటుంబాలకు చెందిన పదహారు ఎకరాల వ్యవసాయ భూమిని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చేయించుకున్న అక్రమ పట్టాను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని విష్ణుపురం గ్రామానికి చెందిన బాదితులు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా బాదిత రైతులు బొమ్మిశెట్టి ఎల్లయ్య, శివరాత్రి సురేష్, బొమ్మిశెట్టి చిన్న రాజయ్య మాట్లాడుతూ తామంతా బతుకు దెరువు కోసం ఇతర ప్రాంతాలకు జీవనం కోసం వలస పోయామని, ఇది గ్రహించిన పెద్దమనిషి ముత్యాలు అనే వ్యక్తి 15 ఎకరాల వ్యవసాయ భూమిని తన కుటుంబ సభ్యుల పేరుతో పట్టా చేయించుకున్నాడని ఆరోపించారు. మాభూమిని అక్రమంగా పట్టా చేయించుకున్నావు మా భూమి మాకు పట్టా చేయాలని అడిగితే ఎలాంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాకు న్యాయం చేయాలని తహసీల్దార్ సరస్వతికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కొంరయ్య, మల్లయ్య, రమేష్, శివకుమార్, యాకయ్య, వెంకన్న, సత్తెమ్మ, పార్వతమ్మ,సోమయ్య, ముత్యాలు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆగని అక్రమ వసూళ్లు అధికారుల మౌనం

- కన్నేపల్లి ఇసుక రీచ్లో రూ.3000 వరకు అదనపు వసూలు




**కాళేశ్వరం , జూలై 8 (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కన్నేపల్లి ఇసుక రీచ్లో అక్రమ వసూళ్లు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. సంబంధిత అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారీతిన దోపిడీ చేస్తున్నారని లారీ యజమానులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అదనంగా ఒక్కో ఇసుక లోడుకు రూ. 3,000 నుంచి రూ. 3,500 వరకు అక్రమంగా వసూలు చేస్తున్నట్లు లారీ యజమానులు ఆరోపిస్తున్నారు. రేటు కట్టకపోతే లోడ్ ఇవ్వడం లేదు. అడిగే వారే లేరు అని వారు వాపోతున్నారు. ఇసుక క్వారీలలో జరుగుతున్న అక్రమాలపై సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంట్రాక్టర్లపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పలు విమర్శలకు తావు ఇస్తోంది.

# వేగం పుంజుకుంటున్న ఎస్ఐఆర్ ప్రక్రియ

- ఓటర్లకు 98% దరఖాస్తుల అందజేత
- పూర్తిచేసిన దరఖాస్తులు స్వీకరించడంలో నిమగ్నులైన బిఎల్వోలు
- దరఖాస్తులు నింపడంలో అవుతున్న ఆలస్యం
- ఓటర్లకు అవగాహన కలిగిస్తున్న సంబంధిత అధికారులు



**వరంగల్ బ్యూరో, జూలై 8 (జనంసాక్షి) :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ ఐ ఆర్) వరంగల్ జిల్లాలో ఇప్పుడిప్పుడే వేగం పుంజుకుంటుంది. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఎస్ ఐ ఆర్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఓటర్లకు అవగాహన కలిగించడం జరుగుతుంది. అంతేకా కుండా ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులతో సమీక్షలు జరపడం తగిన సూచనలు ఇవ్వడం చేస్తున్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా గత నెల 25 నుండి ఈనెల 24 వరకు బి ఎల్ వోలు దరఖాస్తులు ఓటర్లకు అందించడం, ఈనెల 31 వరకు ముసాయిదా జాబితా ప్రచురణ, 31 నుండి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ, అలాగే ఈనెల 31 నుండి సెప్టెంబర్ 28 వరకు అభ్యంతరాలు పరిష్కారం తోపాటు అక్టోబర్ 1న తుది ఓటర్ జాబితా ప్రచురణ కార్యక్రమం ఉంది. అయితే ఇప్పటివరకు వరంగల్ జిల్లా వ్యాప్తంగా 98 శాతం దరఖాస్తుల పంపిణీ జరిగినట్లు సమాచారం. అయితే దరఖాస్తులు పూర్తిచేసి ఇవ్వడంలో కొంత ఆలస్యం జరుగుతుంది. ఈ విషయంలో ఓటర్లు దరఖాస్తుల నింపడంలో కన్ఫ్యూజన్ అవడం, తప్పులు నింపితే ఓటు పోతుందనే భయం, ఎలా నింపాలో తెలియక కొంత సందిగ్ధత ఏర్పడడంతో దరఖాస్తులు బిఎల్ఓ లకు ఇవ్వడంలో ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తుంది. ఓటర్లకు పూర్తిస్థాయి అవగాహన కలిగించేందుకు సంబంధిత అధికారులు సిబ్బంది కృషి చేస్తున్నారు. దరఖాస్తులు నింపకుండా ఉన్నవారు ఎలా నింపాలో తెలియక ఇబ్బంది పడుతున్న వాళ్లకు బిఎల్వోలు వారి వద్ద ఉండేటువంటి కొందరు చదువుకున్న తెలిసినవాళ్లు నింపేందుకు ముందుకు రావడంతో ఇప్పుడిప్పుడే పూర్తి చేసిన దరఖాస్తులతో బిఎల్ఓ కు అందించడం జరుగుతుంది. ఇందుకు ఉదాహరణ గా వరంగల్, కిలా వరంగల్ మండల తాసిల్దారులు శ్రీకాంత్, ఇక్బాల్ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఓటర్లకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగిస్తున్నారు. వరంగల్ తూర్పు నియోజక వర్గంలో మొత్తం ఓటర్లు 2 లక్షల 60 వేల 437 ఓటర్లు ఉన్నారని, ఇప్పటికే 13 రోజుల్లో 99 శాతం దరఖాస్తులు ఓటర్లకు అందజేసినట్లు తెలిపారు. ఇంకా కొన్ని వాళ్ళ అడ్రస్సుల్లో వాళ్ళు ఉండకపోవడం, చనిపోయిన వారు కావడం మొదలైన కారణాలతో దరఖాస్తులు ఇవ్వలేని పరిస్థితి ఉన్నట్లు చెబుతున్నారు. ఇప్పటికీ వరంగల్ తూర్పు నియోజకవర్గం లో 6 నుంచి 8 శాతం ఓటర్లు పూర్తిచేసిన దరఖాస్తులు తీసుకొచ్చి ఇచ్చినట్లు తెలిసింది. ఓటర్లు పూర్తిచేసిన దరఖాస్తులు ఇచ్చినప్పుడు తమ వద్ద ఉన్నటువంటి అదనపు దరఖాస్తుపై బి ఎల్ ఓలా సంతకం తీసుకొని తమ వద్ద ఓటర్లు ఉంచుకోవాలని అధికారులు చెబుతున్నారు. ఈనెల 24 తో దరఖాస్తుల ప్రక్రియ పూర్తికా నుండగా ఇప్పుడిప్పుడే దరఖాస్తులు ఇచ్చేందుకు ఓటర్లు వేగం పెంచుతున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. 2002 ఎస్ఐఆర్ లో ఉన్నవాళ్లు ఎలా నింపాలి, 2002 ఎస్ఐఆర్లో లేనివాళ్లు, ప్రస్తుతం ఓటు హక్కు ఉన్నవాళ్లు దరఖాస్తు ఎలా నింపాలో వివరిస్తున్నారు. దరఖాస్తులు నింప రాని వారు సంబంధిత బిఎల్ఓ లను, బిఎల్ఓ సూపర్వైజర్ లను సంప్రదిస్తే వారు దరఖాస్తుల నింపేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఓటర్లు తమ దరఖాస్తులు నింపే సమయంలో ఎలాంటి తప్పులు దొర్లకొండ జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులు అవగాహన కలిగిస్తున్నారు. మరో 16 రోజుల్లో ఓటర్లు తాము పూర్తి చేసిన దరఖాస్తులను బిఎల్ఓ లకు అందజేయాల్సిన అవసరం ఉంది. ఈ క్రమంలో దరఖాస్తుల స్వీకరణ మరింత వేగవంతం అయ్యేలా ఓటర్లను చైతన్యవం తులను చేయడమే కాకుండా వారు ఇతరులకు కూడా దరఖా స్తులు సునాయకంగా నింపే విధంగా తయారయ్యేలా సంబం ధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఓటర్లు కూడా తమ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేసి ఇవ్వాలని కోరుతున్నారు.

# కాంగ్రెస్ - బీఆర్ఎస్ పార్టీలు దొందూ దొందే

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ చందుపట్ల కీర్తి రెడ్డి జిల్లా అధ్యక్షుడు నిశిదర్ రెడ్డి హెచ్చరిక



**టేకుమట్ల జులై 08 (జనంసాక్షి) :** టేకుమట్ల మండలంలో యథేచ్ఛగా కొనసాగుతున్న ఇసుక అక్రమ రవాణా, ఇసుక మాఫియా ఆగడాలను నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బండారి సమ్మయ్య, జిల్లా నాయకులు కూర సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా. చందుపట్ల కీర్తి రెడ్డి జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఏడు నూతుల నిశీధర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. చందుపట్ల కీర్తి రెడ్డి నిషిధర్ రెడ్డి వారు మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ (టీఆర్ఎస్) ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా సాగిన ఇసుక మాఫియా, ప్రభుత్వం మారిన తర్వాత కాంగ్రెస్ పాలనలో కూడా ఏమాత్రం తగ్గలేదని తీవ్రంగా విమర్శించారు. గతంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఇదే ఇసుక అక్రమాలపై తీవ్ర స్థాయిలో ధర్నాలు, ఆందోళనలు నిర్వహిస్తూ, తాను గెలిస్తే నియోజకవర్గంలో ఇసుక దందాను పూర్తిగా నిర్మూలిస్తానని ప్రజలకు హామీ ఇచ్చిన ప్రస్తుత ఎమ్మెల్యే, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత అదే ఇసుక దందా యథేచ్ఛగా కొనసాగుతున్నా ఎందుకు అరికట్టడం లేదని ప్రశ్నించారు. లేకపోతే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను కలుపుకుని మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు భారీ ఆందోళనలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించి ఇసుక మాఫియాపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఓబిసి జిల్లా అధ్యక్షులు దేశెట్టి గోపాల్ గారుమండల ఉపాధ్యక్షుడు శ్రీపతి రవి గుండబోయిన తిరుపతి జిల్లా నాయకులు బట్టల మొగిలి రామారావు మండల మాజీ ఉపాధ్యక్షులు చాట కోళ్ల తిరుపతి బీజేవైఎం నాయకులు అనిల్ సాయిలు కొమురయ్య దొమ్మటి రవీందర్ వెంకటేష్ సాయి శ్రీకాంత్ బుక్క వెంకన్న మధు సుంకర రాంమోహన్ దేవేందర్ దావు రఘు సోషల్ మీడియా కన్వీనర్ ఎర్ర రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో సహకరించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, జులై 08(జనంసాక్షి) :** గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధుల సహకారంతో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు తన ఛాంబర్లో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని కోరారు. జిల్లాలో ఇప్పటివరకు 98.96 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని, 25.79 శాతం ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, వివరాలు నింపే ప్రక్రియలో, ఓటర్ల నుంచి తిరిగి ఫారాలను స్వీకరించడం లో బీఎల్వోలకు రాజకీయ పార్టీల బీఎల్ఏలు పూర్తి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. బీఎల్వోలు ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తున్నారని తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా జూలై 24న పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితా అత్యంత కీలకమైనదని, ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా, అనర్హుల పేర్లు తొలగించేలా రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధులు, బీఎల్వోలు సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, ఆర్డీవో కృష్ణవేణి, ఎన్నికల సూపరింటెండెంట్ సలీం, డీటీ నితీష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి చాంద్ పాషా, బీజేపీ ప్రతినిధులు ఎస్ బలరాం, రవీంద్ర చారి, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి భూక్యా రాందాస్, సీపీఎం ప్రతినిధి రాజేందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తే జైలుకే..

- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి) :** జిల్లాలో పల్లెల్లో గాని, పట్టణంలో గాని ఎక్కడైనా ఎవరైనా గంజాయి, పీడీఎస్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడం, నేరాల నియంత్రణ, ప్రజలతో పోలీసుల అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయడం కోసం బుదవారం పట్టణంలోని రణ దివెనగర్ కాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని తెల్లవారుజాము చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం 5 గంటల నుంచే సుమారు 150 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఇందులో 107 ద్విచక్ర వాహనాలు, 16 ఆటోలు, ఒక కారు, నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. నంబర్ ప్లేట్ లేకుండా సంచరిస్తున్న 16 వాహనాలను స్వాధీనం చేసుకొని, (దీమీ) సెక్షన్ 318(4) ప్రకారం చీటింగ్ కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు మత సామరస్యాన్ని కాపాడాలని, సామాజిక మాధ్యమాలు లేదా బహిరంగ ప్రదేశాల్లో గొడవలకు, విద్వేషాలకు దారితీసేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవద్దని సూచించారు. ఎక్కడైనా వివాదాస్పద పరిస్థితులు తలెత్తినప్పుడు వాటిలో జోక్యం చేసుకోకుండా వెంటనే డయల్-100కు సమాచారం అందించాలని కోరారు. జిల్లాలో అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వ రాయితీ పీడీఎస్ బియ్యం, గంజాయి వంటి వాటినీ అక్రమంగా నిలువ చేయడం, విక్రయించడం లేదా అక్రమంగా తరలించడం నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే జిల్లాలో రౌడీషీటర్లు తమ ప్రవర్తన మార్చుకొని చట్టాన్ని గౌరవించేలా జీవించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గంజాయి నిర్మూలనకు జిల్లా పోలీసులు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని, గంజాయి సేవించడం, నిల్వ ఉంచడం, రవాణా చేయడం, సరఫరా చేయడం లేదా విక్రయించడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. ప్రత్యేక తనిఖీల్లో భాగంగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కాంబ్లే సుభాష్ వద్ద నుంచి 10 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, రూరల్ సీఐ రహీం పాషా, సీఐలు బి.డి. ప్రేమ్ కుమార్, ప్రణయ్ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు డి. వెంకటి, టి. మురళి, ఎస్సైలు వి. విష్ణువర్ధన్, ఎస్. జీవన్ రెడ్డి, విష్ణు ప్రకాష్, హారుణ్తో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత
- స్టేషన్ఘన్పూర్ పోలీస్ స్టేషన్ను సందర్శించిన సిపి

**స్టేషన్ ఘన్పూర్, జూలై 08 (జనంసాక్షి) :** పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రజల ఫిర్యాదులపై అధికారులు, సిబ్బంది తక్షణ మే స్పందించి ప్రజల కు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవా లని వరంగల్ పోలీస్ కమిషనర్( సిపి) ఎన్.శ్వేత ఆదేశించారు. స్టేషన్ఘన్పూర్ మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లో ఉన్న రికార్డులను పరిశీలించి, కేసుల పురోగతి గురించి అడిగి తెలు సుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ శ్వేత మాట్లాడుతూ పోలీసులు ప్రజల సేవకులనే భావనతో విధులు నిర్వహించాల్సిన బాధ్యత ఉందన్నారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రతి ఫిర్యా దు దారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని అన్నారు. అందిన ప్రతి ఫిర్యాదును వెంటనే నమోదు చేసి రసీదు అందజేయాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏసీపీ భీమ్ శర్మ, సిఐ జి వేణు, ఎస్ఐ లు వినయ్ కుమార్, పిట్ట రాజేష్, మనీషా, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గుప్తనిధుల తవ్వకాలు..

- 8 మందిపై కేసు నమోదు

**రెబ్బెన, జూలై8 (జనంసాక్షి):** కొమురం భీం జిల్లా రెబ్బెన మండలం కైర్గాం జీపీ ఎడవెల్లి గ్రామంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టిన ఎనిమిది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. బామ్మినపల్లి తిరుపతి ఇంటి వెనుక భాగంలో సోమవారం రాత్రి పూజలు నిర్వహించి గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు విచారణ చేపట్టి తిరుపతి, అతని భార్యతో పాటు మంచిర్యాల, చంద్రాపూర్ ప్రాంతాలకు చెందిన మరికొందరిపై కేసు నమోదు చేశారు. ఏఎస్ఐ ఫిర్యాదు మేరకు దర్యాప్తు కొనసాగుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# మళ్ళీ వాయిదా పడ్డ ఆలయ పునర్నిర్మాణ టెండర్లు

**కాళేశ్వరం , జూలై 8 (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయాన్ని పునర్నిర్మాణం చేయుటకు గత నెల 17న మూసివేసి ఆది ముక్తేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని బాలాలయంలో భక్తుల కు దర్శనం కల్పిస్తు న్నారు. ఆలయ నిర్మాణం కోసం 198 కోట్లు ప్రభు త్వం కేటాయించగా ఆ పనుల కోసం గత నెల 23న టెండర్లు నిర్వహించాల్సి ఉండగా జూలై 4కు వాయిదా పడ్డాయి. స్థానిక ఎమ్మె ల్యే, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు అమెరికా పర్యటనలో ఉండడంతో టెండర్లు మళ్లీ జులై 8కి వాయిదా పడ్డాయి. అయితే 8న టెండర్లు జరగకుండా మళ్లీ 15వ తారీకుకు వాయిదా పడ్డట్టు తెలిసింది. దీంతో ఎప్పుడూ టెండర్లు నిర్వహిస్తారో? ఎప్పుడు ఆలయ నిర్మాణ పనులు చేబడతారో? కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారల దర్శనం ఎప్పుడు దొరుకు తుందో? అని భక్తులు వేచి చూస్తున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
09 జూలై 2026

# ప్రజారోగ్య కార్యక్రమాలను వంద శాతం అమలు చేయాలి



**ఖమ్మం కార్పొరేషన్, జూలై 8 (జనం సాక్షి) :** జిల్లాలో అమలవుతున్న ప్రజారోగ్య కార్యక్రమాలను శాఖల సమన్వయంతో వంద శాతం లక్ష్యంతో అమలు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ వైద్య అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి జాతీయ నులి పురుగుల నివారణ, డెంగ్యూ నివారణ, టిబి ముక్త్ భారత్, సంకల్ప్ కార్యక్రమాల అమలు, తల్లి-శిశు ఆరోగ్య పరిరక్షణ, ఆసుపత్రులలో మౌళిక వసతులు, క్షేత్ర స్థాయి వైద్య సేవలపై వైద్య, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు జాతీయ నులి పురుగుల నివారణ, సంకల్ప్ కార్యక్రమం, టిబి ముక్త్ భారత్, డెంగ్యూ నివారణ కార్యక్రమాల అమలు, లక్ష్యాలు, ఇప్పటి వరకు సాధించిన పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ జూలై 13న నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, డీసీహెచ్ఎస్ రాజశేఖర్ గౌడ్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ నరేందర్, అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రవీణ, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ వేణుగోపాల్ రావు, డాక్టర్ ప్రదీప్ బాబు, ఆర్ఎంఓ డాక్టర్ రాంబాబు, ఆర్ఎంఓ జిజిహెచ్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బిందు శ్రీ, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ మోతియా, డాక్టర్ అరుణ, డెమో సుబ్రహ్మణ్యం, వైద్యాధికారులు, మునిసిపల్ కమీషనర్ లు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ చేపట్టాలి

- మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



**ఖమ్మం కార్పొరేషన్, జూలై 8 (జనం సాక్షి) :** వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ప్రజల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సమగ్ర కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఎల్‌నినోను కేవలం వాతావరణ మార్పుగా కాకుండా రైతుల జీవనోపాధి, తాగునీటి భద్రత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే కీలక సవాలుగా ప్రభుత్వం పరిగణించాలని పేర్కొన్నారు. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్న తర్వాత స్పందించడం కాదని ముందస్తు ప్రణాళికతో నష్టాన్ని నివారించడం, ప్రజల ప్రాణాలు, జీవనోపాధిని కాపాడటం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రధానంగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం కావడంతో ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షపాతం తగ్గితే రైతులు, వ్యవసాయ కూలీలు, పశుపోషకులు, గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం ఇప్పటి నుంచే అప్రమత్తంగా వ్యవహరించకపోతే కరువు పరిస్థితులు, పంటల దిగుబడి తగ్గడం, తాగునీటి కొరత, భూగర్భ జలాల క్షీణత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని మాజీమంత్రి పువ్వాడ హెచ్చరించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తాగునీరు, సాగునీటి అవసరాలు ప్రధానంగా నాగార్జునసాగర్, గోదావరి జలాలు, మున్నేరు, వైరా, పాలేరు, కిన్నెరసాని వంటి జలవనరులపై ఆధారపడి ఉన్నాయని పేర్కొన్నారు. వర్షపాతం తగ్గి జలాశయాలకు ఆశించిన మేర నీటి ప్రవాహం లేకపోతే రాబోయే కాలంలో తాగునీటి, సాగునీటి సమస్యలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందన్నారు. చెరువులు, కాలువలు, పంపింగ్ వ్యవస్థలు, మిషన్ భగీరథ మౌలిక వసతులను ముందుగానే సిద్ధం చేయడంతో పాటు వర్షపు నీటి సంరక్షణ, చెరువుల పూడికతీత, జలాశయాల నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.

## ఖమ్మం జిల్లాలో పెండింగ్ భూసేకరణ పూర్తి

**ఖమ్మం కార్పొరేషన్, జూలై 8 (జనం సాక్షి) :** న్యూఢిల్లీ కేబినెట్ సెక్రటేరియట్ నుండి సెక్రటరీ (కోఆర్డినేషన్) మనోజ్ గోవిల్ బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కలెక్టరేట్ నుండి పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలచే తెలంగాణలో చేపట్టిన నీటి పారుదల, రైల్వే ప్రాజెక్టుల పురోగతిని, కాజీపేట – విజయవాడ మూడో రైల్వే లైన్ (విద్యుదీకరణతో సహా) ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాకు సంబంధించి కాజీపేట – విజయవాడ మూడో రైల్వే లైన్ విద్యుదీకరణ ప్రాజెక్టు కోసం పెండింగ్‌లో ఉన్న 0.786 హెక్టార్ల భూసేకరణను 2026 మే నెలలో పూర్తి చేసి సమస్యను పరిష్కరించినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్డీసి సదానందం, సంబంధిత శాఖల అధికారులు, కలెక్టరేట్ భూసేకరణ విభాగ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు

**నూతనకల్/మద్దిరాల, జూలై 8 (జనంసాక్షి) :** ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు నూతన్ కల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నూతనంగా నిర్మిస్తున్న సబ్ సెంటర్ భవనాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో అందుతున్న వైద్య సేవలు, రికార్డుల నిర్వహణపై సిబ్బందిని ఆరా తీశారు ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్‌తో మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎన్ని ఏఎన్సీ కేసులు నమోదయ్యాయి..? పీహెచ్‌సీలో ఎన్ని డెలివరీలు చేశారు? అని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ఫీవర్ సర్వే జరుగుతుందా..? ఎన్ని జ్వర కేసులు నమోదయ్యాయి..? అని ఆరా తీశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని జనరల్ వార్డు, లేబర్ రూమ్, ఫార్మసీ, మెడికల్ ఆఫీసర్ రూమ్, మీటింగ్ హాల్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసరాలను పరిశీలించి శుభ్రతపై పలు సూచనలు చేశారు. మెడిసిన్ స్టాక్ రికార్డ్, ఏఎన్సీ రిజిస్టర్, బర్త్ ప్లాన్ రిజిస్టర్లను స్వయంగా తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ అప్‌డేట్‌గా ఉండాలని ఆదేశించారు.

### మరమ్మతుల కోసం నిధుల మంజూరు

పీహెచ్‌సీ భవనం పరిస్థితిని గమనించిన కలెక్టర్ రిపేర్ల కోసం తక్షణమే రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. వీటికి అదనంగా పీహెచ్‌సీ వద్ద ఉన్న రూ.4.30 లక్షల నిధులను కూడా భవన మరమ్మతులకే వినియోగించు కోవాలని సూచించారు. వెంటనే జేఏఎస్ మీటింగ్ నిర్వహించి, పనులు ప్రారంభించాలని మెడికల్ ఆఫీసర్, పంచాయతీ రాజ్ ఏఈని ఆదేశించారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు.



### 15 రెవిన్యూ గ్రామాల రీ సర్వే భూములకు పట్టాలు మంజూరు చేయుటపై సమీక్ష

తాసిల్దార్ కార్యాలయంలో రెవిన్యూ సిబ్బంది మరియు సర్వే సిబ్బందితో దీర్ఘకాలం సేద్యం చేసుకుంటున్న రైతుల భూములకు రీ సర్వే పూర్తి చేసి భూభారతి చట్టం 2025 ద్వారా పట్టాలు మంజూరు చేయుటకు నూతనకల్ మండలంలో 9 రెవిన్యూ గ్రామాలు, మద్దిరాల మండలంలో 5 రెవిన్యూ గ్రామాలలో వెంటనే సమీక్ష నిర్వహించి వాటికి సంబంధించిన ఫైళ్లను సిద్ధం చేసి డాక్యుమెంట్లను పూర్తిచేసుకుని తదుపరి చర్యలు తీసుకొనుటకు ఆదేశించారు. తదుపరి వెంకటేశ్వర బయో బ్యాగుల తయారీ కేంద్రం( బయో ప్రోడక్ట్) ను పరిశీలించిన కలెక్టర్ ఎంత ఖర్చుతో మరియు విక్రయించుటకు ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో ఆర్డిఓ వేణు మాధవరావు, తహసిల్దార్ శ్రీనివాసరావు,మెడికల్ ఆఫీసర్ ఆశ్రిత రెడ్డి, సిహెచ్ఓ చరణ్, పంచాయతీ రాజ్ ఏఈ కళ్యాణ్,సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్, ఆర్ఐ హాసన్ అలీ, మెడికల్ సిబ్బంది, బూడిద శ్రీనివాస్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ఘాతంతో కౌలు రైతు మృతి



**పి.ఏ.పల్లి, జూలై 8 (జనంసాక్షి) :** గుడిపల్లి ఎస్ఐ నరసింహులు గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం పి.ఏ.పల్లి మండలం రంగారెడ్డి గూడెం గ్రామ శివారు యందు నీలుగూరి శ్రీనివాస్ రెడ్డి వ్యవసాయ పొలంలో కౌలుకు చేసేటటువంటి ఫేక్ సైదా తండ్రి నన్నేసాబ్ వయస్సు (51) సంవత్సరాలు, గ్రామం:వెంకట్రామపురం, మండలం మేళ్లచెరువు, జిల్లా:సూర్యాపేట వ్యవసాయం పనుల నిమిత్తం కరెంటు రాకపోవడంతో ట్రాన్స్ఫార్మర్ ఫీజు సరి చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తో మృతి చెందాడు. అతని భార్య రంజాన్ బి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు గుడిపల్లి ఎస్సై నరసింహులు గౌడ్ తెలిపారు.

## మహనీయుల విగ్రహాల ఆవిష్కరణతో ఘన నివాళులు

- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి
- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**భూదాన్ పోచంపల్లి, జూలై 8 (జనం సాక్షి) :** మండలంలోని పిల్లాయిపల్లి గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్, ఇబ్రహీంపట్నం తొలి ఎమ్మెల్యే కళ్లెం పాపిరెడ్డి జయంతి సందర్భంగా మంగళవారం వారి కాంస్య విగ్రహాలను శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ, దేశ సేవ కోసం సిక్కు మతాన్ని స్వీకరించి సిక్కు రెజిమెంట్‌లో చేరిన కళ్లెం పాపిరెడ్డి రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. అనంతరం 1948 సెప్టెంబర్ 17న నిజాం విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో రజాకార్లకు వ్యతిరేకంగా కీలక పాత్ర పోషించారని తెలిపారు. 1952 57 మధ్య ఇబ్రహీంపట్నం తొలి ఎమ్మెల్యేగా సేవలందిస్తూ ప్రాంత అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. అలాగే ఆచార్య వినోబా భావే, వేదిరే రామచంద్రారెడ్డిలతో కలిసి భూదానోద్యమంలో భాగస్వాములై భూములను సేకరించి పేదలకు అందించడంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, డా. బి.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్, కళ్లెం పాపిరెడ్డి సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. వారి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని సామాజిక న్యాయం, ప్రజాసేవకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, కళ్లెం చంద్రశేఖర్ రెడ్డి, వేదిరే అరవింద్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు కళ్లెం రాఘవరెడ్డి, గ్రామ సర్పంచ్ పెరుమాండ్ల మహాలక్ష్మి దానయ్య, ఉపసర్పంచ్ బందారపు లక్ష్మణ్ గౌడ్, జిల్లా నాయకులు పాక మల్లేష్ యాదవ్, మాజీ సర్పంచ్ అందెల హరీష్ యాదవ్, కొంతం శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌తో పేద కుటుంబాలకు భరోసా

- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**భూదాన్ పోచంపల్లి, జూలై 8 (జనం సాక్షి) :** మున్సిపల్ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని 57 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.57,06,612 విలువైన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు సకాలంలో అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, జిల్లా నాయకులు పాక మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రైతు సదస్సుకు ఏదులాపురం మున్సిపాలిటీలో ప్రత్యేక ఏర్పాట్లు



**ఖమ్మం రూరల్, జూలై 8 (జనం సాక్షి) :** ఈ నెల 10న చింతకాని మండలం జగన్నాథపురంలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి వ్యవసాయ రైతు సదస్సును విజయవంతం చేసేందుకు ఎదులాపురం మున్సిపాలిటీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేస్తూ మున్సిపాలిటీ పరిధిలోని 32 వార్డులకు ప్రత్యేక అధికారులు, వార్డు అధికారులు, బస్సు ఇన్‌చార్జీలను నియమించారు. సదస్సుకు రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా ప్రతి వార్డుకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. ఆయా వార్డుల నుంచి రైతులను సభా ప్రాంగణానికి సకాలంలో తరలించడం, రవాణా ఏర్పాట్లు, హాజరు నమోదు, సమన్వయం తదితర అంశాలను పర్యవేక్షించే బాధ్యతలను సంబంధిత అధికారులకు కేటాయించారు. 23, 24, 28 నుంచి 32వ వార్డులకు కె. శ్రీధర్ రెడ్డి, 3, 4, 5, 6, 22, 25, 26, 27వ వార్డులకు కె. శ్రీనివాసరావు, 20, 21వ వార్డులకు ప్రదీప్, 19వ వార్డుకు రాజు, 18వ వార్డుకు ఎస్.కె. బాబు, 1, 2వ వార్డులకు ఎన్. రఘు, 17వ వార్డుకు ఎం.డి. ఫరీఉద్దీన్, 14, 15, 16వ వార్డులకు పి. శ్రీనివాస్, 7వ వార్డుకు కె. జ్యోత్స్న, 8, 9, 12, 13వ వార్డులకు పి. సతీష్, 10, 11వ వార్డులకు జి. వీరన్నలను ప్రత్యేక అధికారులుగా నియమించారు. ఆయా వార్డులకు వార్డు అధికారులను కూడా నియమిస్తూ బాధ్యతలు అప్పగించారు. సదస్సు విజయవంతానికి అధికారులు పూర్తిస్థాయిలో సమన్వయంతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

# పల్లెల ప్రగతి కోసం సమగ్ర ప్రణాళికలు రూపొందించాలి

- అవగాహన సదస్సులో కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూలై 8 (జనం సాక్షి) :** గ్రామాల సంపూర్ణ అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై సర్పంచ్‌లు, గ్రామ సచివాలయ కార్యదర్శులకు బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. స్వచ్ఛ భారత్ మిషన్ అమలు, పన్ను వసూళ్లు, తడి, పొడి చెత్త, హానికారక, సానిటేషన్ వ్యర్థాల సేకరణ, వీబీ జీ రాంజీ అమలు తీరు, మౌలిక వసతులు, సదుపాయాల కల్పన, వాటర్ షెడ్ కార్యక్రమాల అమలు, లింకు రోడ్లు, సీ.సీ రోడ్ల నిర్మాణాలు, వీధి దీపాల నిర్వహణ, నిధుల వినియోగం, వన మహోత్సవం, తాగు నీటి సరఫరా పర్యవేక్షణ, పాఠశాలలు, అంగన్వాడీలు, ఆసుపత్రులు, ఇతర ప్రభుత్వ సంస్థల నిర్వహణ తీరుతెన్నుల పరిశీలన, పెన్షన్ల పంపిణీ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు మార్గనిర్దేశం చేశారు. అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎం.పీ.డీ.ఓలు, ఎం.పీ.ఓలు, సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

## కృత్యాధర బోధనతోనే గుణాత్మక విద్య



**కామారెడ్డి ప్రతినిధి, జూలై 8 (జనం సాక్షి) :** కృత్యాధర బోధనతో విద్యార్థులను ఆకట్టుకుని తద్వారా గుణాత్మక విద్య అందించవచ్చునని జిల్లా కలెక్టర్ శ్రీ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గాంధారి మండల కేంద్రం లోని బాలికల ప్రాథమిక పాఠశాలను ఆయా సందర్శించి విద్యార్థుల ప్రగతిని ఆయన పరిశీలించారు. పాఠశాల లో అవలంబిస్తున్న కృత్యాధర బోధన , ఆట పాటల ద్వారా విద్యను నేర్పించడం పై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులను అదనంగా డిప్యూటేషన్ పద్ధతిలో సర్దుబాటు చేయాలని ఆయన జిల్లా విద్యాశాఖాధికారి ని ఆదేశించారు. గ్రామస్తుల భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలనిఆయన కోరారు. ప్రభుత్వ పాఠశాల లలో విద్యార్థుల సంఖ్యను మరింత పెంచాలని ఆయన సూచించారు. కలక్టర్ గారి ఆదేశాల మేరకు ఇద్దరు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి మల్లికార్జున్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఈ వో మల్లికార్జున్, ఏం ఈ వో శ్రీహరి, స్థానిక సర్పంచ్ పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



**ఖమ్మం రూరల్, జూలై 8 (జనం సాక్షి) :** దివంగత ముఖ్యమంత్రి వై ఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజా హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయాయని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచనల మేరకు ఖమ్మంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ 77వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని బేబి స్వర్ణకుమారి, ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణతో కలిసి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఖమ్మం రూరల్ మండలంలోని కొండాపురంలో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు దయాకర్ రెడ్డి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీఇంబర్స్‌మెంట్ వంటి పథకాలతో వైఎస్సార్ పేదల గుండెల్లో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని, కార్యకర్తలంతా ప్రభుత్వానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీలు జూకూరి గోపాలరావు, బోడా మంగీలాల్, ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిన అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఖమ్మం రూరల్ మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు తోట వీరభద్రం, నాయకులు కళ్లెం వెంకట్ రెడ్డి, బండి జగదీష్, డివిఆర్ బాబు, మద్ది మల్లారెడ్డి, పుల్లయ్య, లింగాల రవికుమార్, మందడపు రామకృష్ణ రెడ్డి, మందడపు మనోహర్, ఉమ్మినేని కృష్ణ, భీమనాథుల అశోక్ రెడ్డి, కొప్పెర ఉపేందర్, తిప్పిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఏనుగు వెంకట్ రెడ్డి, షేక్ ఇమామ్, చింతమల్ల గురుమూర్తి, బోడా శ్రావణ్ కుమార్, తాళ్లూరి రాము, చంద్రు నాయక్, బాణోతు దివ్య, బట్టపోతుల సతీష్, చల్లా కృష్ణారెడ్డి, హారిక నాయుడు, మొగిలిచర్ల సైదులు, ఎయిర్‌టెల్ నర్సింహారావు, వెనిగళ్ళ నాగేశ్వరరావు, ఆటోప్రసాద్, నాగరాజు, విప్లవ్ కుమార్, మద్ది వీరారెడ్డి, వెంపటి రవి, పంతులు నాయక్, చింతమల్ల రవి, బండి సతీష్, కన్నెటి అనిల్, తంబి, కరాటే వేణు, ఉపేందర్, రాజు, తిరుపతమ్మ, రుదావత్ రమాదేవి, కన్నెగంటి రావు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైఎస్సార్‌కు ఘనంగా నివాళులు అర్పించారు.

# జూనోటిక్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ బి. చంద్రశేఖర్




**నల్లగొండ ప్రతినిధి, జూలై 8 (జనం సాక్షి) :** జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు వ్యాపించే జూనోటిక్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, నల్లగొండ నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లా పశు వైద్యశాలలో జూనోసిస్ డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేబిస్, జపనీస్ ఎన్సెఫలైటిస్, బ్రుసెల్లోసిస్, బర్డ్ ఫ్లూ, లెప్టోస్పిరోసిస్, టీనియాసిస్ వంటి జూనోటిక్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. రేబిస్ అత్యంత ప్రమాదకరమైన వ్యాధి అని, పిచ్చికుక్క కాటుతో సంక్రమించే అవకాశం ఉన్నందున కుక్కల జనాభా నియంత్రణకు జంతు జనన నియంత్రణ శస్త్రచికిత్సలు అవసరమని తెలిపారు. ప్రస్తుతం నల్లగొండలో ఏబీసీ కేంద్రం పనిచేస్తుండగా, మిర్యాలగూడ, దేవరకొండల్లో కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. వర్షాకాలంలో వీధి కుక్కలు ఎక్కువగా ఆవేశంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా చెత్త సేకరణ వాహనాల్లోనే వేయాలని, వీధి కుక్కలకు బయట ఆహారం వేయకుండా ఇళ్లలోనే ఆహారం అందించాలని సూచించారు. పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవడంతో పాటు రేబిస్ నిరోధక టీకాలు వేయించాలని కోరారు. జూనోటిక్ వ్యాధుల నివారణకు పశుసంవర్ధక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా 210 కుక్కలకు రేబిస్ నిరోధక టీకాలు వేయడంతో పాటు, బలహీనంగా ఉన్న కుక్కలకు టానిక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అష్రఫ్ అలీ అమీర్, అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రాహుల్, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ పరిశీలకులు శామ్యూల్ జాన్, జిల్లా పశు వైద్య మరియు పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జి.వి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.




# రూ.8లక్షల కోట్లు ఆవిరి

## ఈపీఎఫ్‌లో గుడ్‌న్యూస్..

### జులై 15 నాటికి వడ్డీ జమ

**న్యూఢిల్లీ:** ఈపీఎఫ్ చందాదారులకు ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ గుడ్‌న్యూస్ చెప్పింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక వడ్డీని మరో వారం రోజుల్లో జమ చేయనున్నట్లు వెల్లడించింది. జులై 15 నాటికి దాదాపు 34 కోట్ల ఈపీఎఫ్ ఖాతాల్లో రూ.1.44లక్షల కోట్ల వడ్డీ సొమ్ము జమ కానున్నట్లు తెలిపింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ 8.25శాతం వడ్డీని కేంద్ర ఆర్థిక శాఖ నిర్ణయించిన సంగతి తెలిసిందే.ఇప్పటికే వడ్డీ జమకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఫీల్డ్ వెరిఫికేషన్ జరుగుతోందని సంబంధిత అధికారులు వెల్లడించారు. రెండు, మూడు రోజుల్లో పూర్తయిన తర్వాత.. వారంలోగా చందాదారుల ఖాతాల్లో వడ్డీ జమ కానుంది. గతంలో ఈపీఎఫ్ నిధుల వార్షిక వడ్డీని ప్రకటించిన కొన్ని నెలల తర్వాత సెప్టెంబరు-అక్టోబరులో చందాదారుల ఖాతాల్లో వడ్డీ జమ అయ్యేది. అయితే, ఈసారి ఆటోమేటెడ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడంతో ఈ ప్రాసెసింగ్ సమయం తగ్గిందని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ వెల్లడించారు.



**దేశంలో ఎక్కడి నుంచైనా సేవలు..**

ఈపీఎఫ్‌ఓ తాజాగా సెంట్రలైజ్డ్ ఐటీ ఎనేబుల్డ్ సర్వీసెస్ పేరుతో కొత్త డిజిటల్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది. గతంలో ఈపీఎఫ్‌ఓకు చెందిన ప్రాంతీయ, ఫీల్డ్ ఆఫీసులు సొంత డేటాబేస్‌లను నిర్వహించాల్సి వచ్చేది. ఇప్పుడు కొత్త వ్యవస్థలో వీటన్నింటిని ఒకే జాతీయ డేటాబేస్ కిందకు తీసుకొచ్చారు. దీని వల్ల ఖాతాదారుల రికార్డులన్నీ ఒకే చోట ఉండనున్నాయి. ఫలితంగా ఈపీఎఫ్ సేవలు మరింత సులభతరం కానున్నాయి. ఇకపై దేశంలోని ఏ ఈపీఎఫ్‌ఓ ఆఫీసు నుంచైనా చందాదారుల రిక్వెస్ట్‌లను ప్రాసెస్ చేసే వీలుంటుంది. దీనివల్ల ఈపీఎఫ్ ఖాతాదారులకు సేవలు వేగంగా అందుతాయని అధికారులు వెల్లడించారు.

ఇకపై ఒకే పోర్టల్..

దీంతో పాటు చందాదారుల కోసం ఒకే 'యునిఫైడ్ మెంబర్ పోర్టల్'ను తీసుకొస్తున్నట్లు ఈపీఎఫ్‌ఓ ప్రకటించింది. ఇకపై చందాదారులు ఈ పోర్టల్‌లో లాగిన్ అయిన తర్వాత.. తమ పీఎఫ్ బ్యాలెన్స్‌లు, క్లెయిమ్‌ల స్టేటస్‌లతో పాటు ఇతర సేవలను ఒకే చోట పొందొచ్చు. గతంలో ఇందుకోసం వేర్వేరు పోర్టల్స్ ఉండేవి. ఇక, ఆటోమెటెడ్ క్లెయిమ్ పరిమితిని కూడా ఈపీఎఫ్‌ఓ రూ.లక్ష నుంచి రూ.5లక్షలకు పెంచిన సంగతి తెలిసిందే.

## ట్రంప్ ఒక్క మాటతో స్టాక్ మార్కెట్లకు బ్లడ్‌బాత్..

**న్యూఢిల్లీ:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం కుప్పకూలాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ఒక్క ప్రకటనతో సూచీలు అమాంతం పతనమయ్యాయి. సెన్సెక్స్, నిఫ్టీ దాదాపు 2 శాతానికి పైగా కుంగాయి. ఈ అనూహ్య పరిణామాలతో దాదాపు రూ.8లక్షల కోట్ల మేర మదుపర్ల సంపద ఆవిరైంది. నేటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 1600 పాయింట్లకు పైగా దిగజారగా.. నిఫ్టీ 24వేల మార్క్‌ను కోల్పోయింది.పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ఈ ఉదయం సూచీలు (రాబినీఞని ఓజీతీనవబి) నష్టాలతోనే ప్రారంభమయ్యాయి. క్రితం ముగింపు (78,180)తో పోలిస్తే దాదాపు 400 పాయింట్ల నష్టంతో 77,816 వద్ద సెన్సెక్స్ నేడు ట్రేడింగ్‌ను ప్రారంభించింది. మధ్యాహ్నం వరకు ఒడుదొడుకులతోనే సాగిన సూచీ.. ఆ తర్వాత కుప్పకూలింది. ఇరాన్‌తో సీజ్‌ఫైర్ ముగిసిందంటూ ట్రంప్ చేసిన ప్రకటన మార్కెట్ల బ్లడ్‌బాత్‌కు దారితీసింది. కేవలం 30 నిమిషాల్లోనే సెన్సెక్స్ 1000 పాయింట్లు తగ్గింది. ఒక దశలో 1800 పాయింట్లకు పైగా పతనమైన సూచీ.. మార్కెట్ ముగిసే సమయానికి 1677.12 పాయింట్లు క్షీణించి 76,503.60 వద్ద స్థిరపడింది. అటు నిఫ్టీ కూడా 516.65 పాయింట్ల నష్టంతో 23,882.05 వద్ద ముగిసింది.దాదాపు అన్ని రంగాల సూచీలు నేడు నష్టపోయాయి. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, శ్రీరామ్ ఫైనాన్స్, మారుతి సుజుకీ, హిందుస్థాన్ యునీలివర్ షేర్లు భారీగా పడిపోయాయి. ఓఎన్జీసీ, హిందాల్కో ఇండస్ట్రీస్, కోల్ ఇండియా, బజాజ్ ఆటో స్వల్పంగా లాభపడ్డాయి. జియో ఫైనాన్షియల్ షేరు 12 శాతం మేర కుంగింది.

పతనానికి కారణాలివే..

అమెరికా, ఇరాన్ పరస్పర దాడులతో పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఈ నేపథ్యంలోనే బుధవారం మధ్యాహ్నం ట్రంప్ స్పందిస్తూ.. టెహ్రాన్‌తో కాల్పుల విరమణ ముగిసిందని ప్రకటించారు. ఆ దేశంలో చర్చలు జరపడం కూడా సమయం వృథా అని పేర్కొన్నారు. దీంతో మళ్లీ యుద్ధభయాలు నెలకొన్నాయి.ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. బ్రెంట్ క్రూడ్ ధర 6శాతం పెరిగి 78.56 డాలర్లకు చేరింది.రూపాయి విలువ మరింత క్షీణించింది. నేటి ట్రేడింగ్‌లో మరో 63 పైసలు తగ్గి 95.59 వద్ద స్థిరపడింది.వాల్‌స్ట్రీట్ ఫ్యూచర్స్ కూడా నష్టాల్లోనే ట్రేడ్ అవుతోంది. నాస్‌డాక్ 1.5శాతం, డోజోన్స్ ఫ్యూచర్స్ 1.2శాతం, ఎస్అండ్‌పీ 500 ఫ్యూచర్స్ 1 శాతం మేర కుంగాయి.




**ఆఖర్లో మదుపర్ల లాభాల స్వీకరణ**

ఎఫ్ఐఐ కొనుగోళ్లు: రూ.393.19 కోట్లు
డీఐఐ విక్రయాలు: రూ.383.43 కోట్లు

ఆసియా మార్కెట్లలో బలహీనతలకు తోడు గత 4 ట్రేడింగ్ రోజుల్లో సూచీలు 2 శాతానికి పైగా పెరిగినందున మదుపర్లు మంగళవారం ఆఖర్లో లాభాల స్వీకరణకు దిగారు. దీంతో సూచీలు నష్టపోయాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 48 పైసలు లాభపడి 94.95 వద్ద స్థిరపడింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 1.22 శాతం పెరిగి 72.87 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా సూచీ 4.91 శాతం నష్టపోయింది. జపాన్, షాంఘై, హాంకాంగ్ సూచీలూ డీలాపడ్డాయి. ఐరోపా మార్కెట్లు మిశ్రమ ధోరణిలో కదలాడాయి.బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.11 లక్షల కోట్లు తగ్గి, రూ.480.20 లక్షల కోట్ల (5.04 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది. సెన్సెక్స్ ఉదయం 78,461.16 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,285.07 పాయింట్లు) సానుకూలంగా ప్రారంభమైంది. ఇంట్రాడేలో 78,664.92 పాయింట్ల గరిష్ఠాన్ని, 78,031.04 పాయింట్ల కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 104.35 పాయింట్ల నష్టంతో 78,180.72 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సైతం 31.65 పాయింట్లు కోల్పోయి 24,398.70 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,348.95-24,530.90 పాయింట్ల మధ్య కదలాడింది.సెన్సెక్స్ 30 షేర్లలో 16 నష్టపోయాయి. ట్రెంట్ 12.42 శాతం, అదానీ పోర్ట్స్ 1.59 శాతం, బీఈఎల్ 1.54 శాతం, ఎల్ అండ్ టీ 1.19 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.12 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 0.81 శాతం, ఏషియన్ పెయింట్స్ 0.75 శాతం చొప్పున తగ్గాయి. హెచ్‌సీఎల్ టెక్ 3.04 శాతం, టెక్ మహీంద్రా 2.86 శాతం, ఇన్ఫోసిస్ 2.81 శాతం, టైటన్ 2.62 శాతం, ఎటర్నల్ 2.12 శాతం, టీసీఎస్ 1.86 శాతం, బజాజ్ ఫైనాన్స్ 2.29 శాతం మేర లాభపడ్డాయి. రంగాల వారీ సూచీలకొస్తే భారీ యంత్ర పరికరాలు 1.73 శాతం, స్థిరాస్తి 1.61 శాతం, పారిశ్రామిక 1.49 శాతం, విద్యుత్తు 1.12 శాతం, లోహ 1.04 శాతం, కమొడిటీస్ 0.90 శాతం, హాస్పిటల్స్ 0.90 శాతం మేర డీలాపడ్డాయి. ఫోకస్డ్ ఐటీ 2.25 శాతం, ఐటీ 2.12 శాతం, మన్నికైన వినిమయ వస్తువులు 0.65 శాతం, మిడ్‌స్మాల్ ప్రైవేట్ బ్యాంక్స్ క్వాలిటీ టిల్ట్ 0.55 శాతం, చమురు-గ్యాస్ 0.09 శాతం రాణించాయి. బీఎస్ఈలో 1,534 షేర్లు సానుకూలంగా, 2,700 షేర్లు ప్రతికూలంగా ముగిశాయి. 163 షేర్లలో ఎలాంటి మార్పు లేదు.

12 శాతానికి పైగా నష్టపోయిన ట్రెంట్ షేరు

వెస్ట్‌సైడ్, జుడియో, స్టార్ బ్రాండ్లతో రిటెయిల్ స్టోర్లను నిర్వహిస్తున్న టాటా గ్రూప్ సంస్థ ట్రెంట్ జూన్ త్రైమాసిక ఆదాయ వృద్ధి మార్కెట్ అంచనాలను అందుకోలేకపోయింది. దీంతో షేరు బీఎస్ఈలో 12.42 శాతం నష్టపోయి రూ.2,928.05 వద్ద ముగిసింది. ఒక దశలో 12.69 శాతం కోల్పోయి రూ.2,919 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది.కొచ్చిన్ షిప్‌యార్డ్ ఓఎఫ్ఎస్‌కు అనూహ్య స్పందన: కొచ్చిన్ షిప్‌యార్డ్ ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)కు సంస్థాగత మదుపర్ల నుంచి అనూహ్య స్పందన లభించిందని పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగం (దీపమ్) కార్యదర్శి అరుణీష్ చావ్లా ట్వీట్ చేశారు. వారికి కేటాయించిన 59.66 లక్షల షేర్లకు గాను 2.10 కోట్లకు పైగా షేర్లకు బిడ్లు దాఖలు చేశారని తెలిపారు. వారు సమర్పించిన సూచనప్రాయ ధర రూ.1,414.97 వద్ద బిడ్ల విలువ సుమారు రూ.2,900 కోట్లుగా ఉందని పేర్కొన్నారు. నేడు (8న) రిటెయిల్ మదుపర్లు బిడ్లు దాఖలు చేసుకోవచ్చు. ప్రభుత్వం ఒక్కో షేరుకు రూ.1,400 కనీస ధరను నిర్ణయించింది. మొత్తం 1.32 కోట్లకు పైగా షేర్లను (5.04 శాతం) ఓఎఫ్ఎస్‌లో విక్రయించడానికి సిద్ధమైంది. దీని ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.1,800 కోట్లు లభిస్తాయి. సోమవారం ముగింపు ధర రూ.1,504.75తో పోలిస్తే ఓఎఫ్ఎస్‌కు ప్రభుత్వం నిర్దేశించిన కనీస ధరపై 7 శాతం రాయితీ ఉంది. మంగళవారం షేరు 3.75 శాతం నష్టపోయి రూ.1,448.30 వద్ద ముగిసింది.కల్ట్.ఫిట్ ఐపీఓ ముసాయిదా పత్రాల దాఖలు: ఫిట్‌నెస్ సేవల ప్లాట్‌ఫామ్ కల్ట్.ఫిట్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకు వచ్చేందుకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వద్ద ప్రాథమిక ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. ప్రతిపాదిత ఐపీఓ ద్వారా రూ.950 కోట్ల విలువైన తాజా ఈక్విటీ షేర్లను విక్రయించనుంది.




# దిగొచ్చిన బంగారం ధర..

### రూ.6వేలు తగ్గిన వెండి

**న్యూఢిల్లీ:** దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు ఒక్కసారిగా దిగొచ్చాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, ఇరాన్‌తో డీల్‌పై ట్రంప్ ప్రకటన నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం తర్వాత ఈ లోహాల ధరల్లో ఒక్కసారిగా దిద్దుబాటు చోటుచేసుకుంది. దీంతో మధ్యాహ్నం 3 గంటల సమయంలో హైదరాబాద్ విపణిలో 10 గ్రాముల మేలిమి 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,46,730 పలికింది. ఈ ఉదయంతో పోలిస్తే దీని ధర దాదాపు రూ.2వేల పైన తగ్గింది. ఇక, కేజీ వెండి ధర రూ.2.28లక్షలకు చేరింది. క్రితం రోజుతో పోలిస్తే వెండి ధర దాదాపు రూ.6వేల మేర దిగొచ్చింది.అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 4049 డాలర్లు పలికింది. ఈ ఉదయం దీని ధర దాదాపు 4200 డాలర్లు పలకగా.. ట్రంప్ ప్రకటన తర్వాత ఒక్కసారిగా పడిపోయింది. ఔన్సు వెండి ధర 58.40 డాలర్లుగా ట్రేడ్ అవుతోంది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీల్లోనూ ఈ లోహాల ధరలు పతనమయ్యాయి. గోల్డ్ ఆగస్టు ఫ్యూచర్స్ కాంట్రాక్ట్ 10 గ్రాముల ధర 1.5శాతం పడిపోయి రూ.1.43లక్షల వద్ద ట్రేడ్ అవుతోంది. వెండి సెప్టెంబరు ఫ్యూచర్స్ కేజీ ధర 3.17శాతం మేర తగ్గి రూ.2.23 లక్షలుగా కొనసాగుతోంది.అమెరికా-ఇరాన్ పరస్పర దాడులతో పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు రాజుకున్నాయి. ఈ పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందిస్తూ.. ఇరాన్‌తో సీజ్‌ఫైర్ ముగిసిందని ప్రకటించారు. దీంతో చమురు ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. అటు దేశీయ స్టాక్ మార్కెట్లు కూడా భారీగా పతనమయ్యాయి. రూపాయి విలువ మరింత క్షీణించింది. ఈ పరిణామాల నేపథ్యంలో బంగారం, వెండి ధరలు కూడా పడిపోవడం గమనార్హం.



## ఎంబ్రాయర్ 3 వాణిజ్య జెట్‌లకు డీజీసీఏ అనుమతి

దిల్లీ: మూడు వాణిజ్య విమానాలు- ఈ195- ఈ2, ఈ190, ఈ195 కోసం భారత డీజీసీఏ నుంచి టైప్ సర్టిఫికేషన్ లభించిందని బ్రెజిల్‌కు చెందిన విమానయాన సంస్థ ఎంబ్రాయర్ తెలిపింది. కాగా.. ప్రాంతీయ విమానయాన సంస్థ స్టార్ ఎయిర్ వద్ద ఉన్న ఎంబ్రాయర్‌కు చెందిన ఈ175 విమానానికి ఇప్పటికే డీజీసీఏ టైప్ సర్టిఫికేషన్ ఉంది. 'ఎంబ్రాయర్ విమానాలకు టైప్ సర్టిఫికేషన్ రావడాన్ని స్వాగతిస్తున్నాం. క్షుణ్నంగా మదింపు చేసినందుకు డీజీసీఏకు ధన్యవాదాల'ని ఎంబ్రాయర్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (విక్రయాలు, మార్కెటింగ్) రౌల్ విలారన్ తెలిపారు. ఒక విమానానికి సంబంధించి పూర్తి డిజైన్, గాలిలో ఎగరగల సామర్థ్యానికి ఇచ్చే ఆమోదాన్నే టైప్ సర్టిఫికేషన్‌గా వ్యవహరిస్తారు.






## ఏఐతో ఉపాధికి ఇబ్బందేమీ లేదు

- పాశ్చాత్య భయాలు మనకు వద్దు
- కేంద్ర మాజీ ఐటీ కార్యదర్శి రెంటాల చంద్రశేఖర్

హైదరాబాద్: కృత్రిమ మేధ (ఏఐ) వల్ల ఉద్యోగాలు కోల్పోతామనే పాశ్చాత్య దేశాల ఆందోళనలు, భయాలు భారత్‌కు ఎంతమాత్రం అవసరం లేదని కేంద్ర ప్రభుత్వ మాజీ ఐటీ కార్యదర్శి, నాస్కామ్ మాజీ అధ్యక్షుడు రెంటాల చంద్రశేఖర్ స్పష్టం చేశారు. ఇతర దేశాల ఆలోచనా విధానానికి భిన్నంగా క్షేత్రస్థాయిలో ఉపాధి కల్పన, మెరుగైన ప్రజా సేవల పంపిణీ లక్ష్యంగా మన దేశం సొంతంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ, ప్రోసస్ గ్రూప్, బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్(బీసీజీ) సంయుక్తంగా రూపొందించిన 'అందరికీ ఏఐ' నివేదికపై హైదరాబాద్‌లో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఏఐ సాంకేతికతలో కేవలం చిన్నపాటి ప్రయోగాలు, ప్రయోగాత్మక ప్రాజెక్టులకే పరిమితం కాకుండా, విప్లవాత్మక మార్పులు రావాలని ఆయన పేర్కొన్నారు. గతంలో ఆధార్, యూపీఐ, టెలికాం సాధించిన విజయాలను ఆయన గుర్తు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఏఐ సాంకేతికత నైపుణ్యాలలో భారత్ 16 శాతం వాటాతో అగ్రగామిగా నిలిచిందన్నారు. రాబోయే 15 ఏళ్లలో ప్రపంచ ఆర్థిక వృద్ధిలో భారత్ వాటా దాదాపు 20 శాతానికి చేరనుందని పేర్కొన్నారు. ఈ సాంకేతికత ద్వారా ఉత్తమ ఫలితాలను సాధించాలంటే రెండు అంచెల వ్యూహం అవసరమని పేర్కొన్నారు. ప్రైవేట్ స్టార్టప్‌లు నిర్దిష్ట సమస్యలకు వేగవంతమైన పరిష్కారాలు కనుగొనడంతోపాటు, ప్రభుత్వ ఆధ్వర్యంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ)లాంటి వాటిని పటిష్ఠం చేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం, ప్రైవేటు రంగాలు సమన్వయంతో పనిచేసినప్పుడే, సమస్యలను సులభంగా పరిష్కరించొచ్చని పేర్కొన్నారు. సాంకేతిక రంగంలో ఎప్పుడూ ముందుండే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఏఐలోనూ కీలకంగా నిలుస్తున్నాయని చంద్రశేఖర్ అన్నారు. ఐటీ రంగానికి, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు తెలంగాణ కేంద్రంగా నిలవగా, ఆంధ్రప్రదేశ్ ఏఐ ఆధారిత పరిపాలన, ఉత్పాదక రంగంలో విశేష పురోగతి సాధిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు, సామాన్యులకు అత్యాధునిక సాంకేతికతను చేరవేయడంలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కూడా కీలకమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఐఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ రమేష్ లోగనాథన్, ఆటోక్రసీ మెషినరీ సీఈఓ సంతోషి బుద్ధిరాజు, ప్రోసస్ గ్రూప్ ఇండియా ఎండీ సెహ్రాజ్ సింగ్, దక్కన్ ఏఐ సహ వ్యవస్థాపకురాలు పూర్వ భండారి తదితరులు పాల్గొన్నారు.

## తోటలో నక్కిన ఆ ఉగ్రవాది ఎన్‌కౌంటర్..

శ్రీనగర్(జనంసాక్షి): జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేతకు ఆపరేషన్ చేపట్టిన భద్రతా బలగాలు భారీ విజయం సాధించాయి. షోపియాన్‌లో ఓ పండ్ల తోటలో నక్కిన ఉగ్రవాదుల్లో ఒకడిని బుధవారం హతమార్చాయి. మృతుడిని లష్కరే తయ్యిబా టాప్ కమాండర్ జాకిర్ అహ్మద్ గనీగా గుర్తించారు. అతడికి పహల్గాం ఉగ్రదాడితో సంబంధాలున్నట్లు దర్యాప్తు వర్గాల సమాచారం. షోపియాన్‌లోని ఓ పండ్ల తోటలో ఉగ్రవాదులు నడుచుకుంటూ వెళ్తున్న దృశ్యాలు ఇటీవల నిఘా కెమెరాల్లో రికార్డయ్యాయి. దీంతో జమ్మూకశ్మీర్ పోలీసులు, ఆర్మీ, సీఆర్పీఎఫ్ దళాలు జులై 3న సంయుక్త ఆపరేషన్ చేపట్టాయి. ఉగ్రవాదులు నక్కిన ప్రాంతాన్ని నలుమూలల నుంచి దిగ్బంధించి వేట మొదలుపెట్టాయి. దాదాపు ఐదు రోజులుగా కొనసాగుతోన్న ఈ ఆపరేషన్‌లో బుధవారం ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. భద్రతా బలగాలను గమనించిన ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దీంతో సిబ్బంది ఎదురుకాల్పులు జరిపినట్లు అధికారులు వెల్లడించారు.అనంతరం ఘటనాస్థలంలో ఓ ఉగ్రవాది మృతదేహాన్ని గుర్తించారు. అతడిని జాకిర్ అహ్మద్ గనీగా తేల్చారు. అతడితో పాటు ఉన్న మరో ఉగ్రవాది లతీఫ్ భట్ కోసం భద్రతా బలగాలు గాలిస్తున్నాయి. అతడు బయటకు వెళ్లకుండా తోట చుట్టూ దళాలు మోహరించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌పై జమ్మూకశ్మీర్ పోలీసులు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "మీరు పారిపోవచ్చేమో.. కానీ దాక్కోలేరు" అని ఉగ్రవాదులను హెచ్చరించారు.

# లిస్ట్‌లో నా పేరూ ఉంది..

### ఎక్స్‌బాక్స్ వైస్ ప్రెసిడెంట్‌కు తప్పని లేఆఫ్

**న్యూఢిల్లీ:** 3200 మందికి ఉద్వాసన పలుకుతున్నట్లు ప్రముఖ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ గేమింగ్ విభాగం ఎక్స్‌బాక్స్ ఇప్పటికే ప్రకటించింది. ఈ లేఆఫ్‌లు జూనియర్లకే పరిమితం కాలేదు. 37 ఏళ్లుగా సంస్థలో భాగమైన వైస్‌ప్రెసిడెంట్ కెవిన్ లాచాపెల్ పేరు కూడా ఆ జాబితాలో ఉంది. ఈ విషయాన్ని లింక్డిన్ వేదికగా షేర్ చేస్తూ కెవిన్ ఉద్వేగానికి గురయ్యారు. "ఎక్స్‌బాక్స్ లేఆఫ్ జాబితాలో నా పేరు కూడా ఉంది. మైక్రోసాఫ్ట్‌తో 37 ఏళ్ల అనుబంధానికి ఇది ముగింపు. నా ప్రయాణంలో ఎక్స్‌బాక్స్ బ్యాక్‌వర్డ్ కంపాటబిలిటీ ప్రోగ్రామ్‌ను రూపొందించిన ప్రతిభావంతులైన ఇంజినీర్ల బృందానికి నాయకత్వం వహించిన జ్ఞాపకాలు ఎంతో విలువైనవి. అభివృద్ధి దిశగా ఎక్స్‌బాక్స్ జర్నీని చూసేందుకు ఆసక్తిగా ఉన్నాను" అంటూ తనకు అండగా నిలిచినవారికి కృతజ్ఞతలు తెలియజేశారు. కెవిన్ 1989లో మైక్రోసాఫ్ట్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేరారు. ఆ తర్వాత గేమింగ్ విభాగమైన ఎక్స్‌బాక్స్‌లో చేరి, వైస్ ప్రెసిడెంట్ స్థాయికి ఎదిగారు.3200 మందికి ఉద్వాసన పలుకుతున్నట్లు వెల్లడించిన ఎక్స్‌బాక్స్ సోమవారం ఒక్కరోజే వీరిలో 1600 మందిని తొలగించింది. 2026-27 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి మిగతా లేఆఫ్‌లు పూర్తవుతాయని వెల్లడించింది. ప్రస్తుతం తమ వ్యాపారం ఆశించిన స్థాయిలో లేదని, అందుకే తప్పనిసరి పరిస్థితుల్లో ఈ క్లిష్టమైన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని సీఈఓ ఆశాశర్మ ఉద్యోగులకు మెయిల్ చేశారు.




## ఆగస్టు 1 నుంచి ఎక్స్ఛేంజీల ద్వారా మళ్లీ షేర్ల బైబ్యాక్

ముంబయి: స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా షేర్ల బైబ్యాక్ పద్ధతిని తిరిగి అందుబాటులోకి తెచ్చేందుకు సంబంధిత నిబం ధనలను సెబీ నోటిఫై చేసింది. దీని ప్రకారం.. ఆగస్టు 1 నుంచి తమ షేర్లను బహిరంగ విపణిలో తిరిగి కొను గోలు చేసేందుకు (బైబ్యాక్) కంపెనీలకు అనుమతి ఇచ్చింది. అయితే బైబ్యాక్ ప్రక్రియను 66 పనిదినాల్లో పూర్తి చేయాలని పరిమితి విధించింది. గతంలో షేర్ల బైబ్యాక్‌కు 6 నెలల సమయం ఉండేది. ప్రత్యేక బైబ్యాక్ విండో ఏర్పాటు చేయకుండా సాధారణ ట్రేడింగ్ మార్గంలోనే కంపెనీలు బైబ్యాక్ కార్యకలాపాలు నిర్వహించేందుకు తాజా నిబంధనలు వీలు కల్పించనున్నాయి. నమోదిత కంపెనీలకు మూలధన కేటాయింపు కోసం బైబ్యాక్ ప్రక్రియను ఆకర్షణీయంగా మార్చడమే ఈ నిర్ణయం వెనక ముఖ్య ఉద్దేశం. '2026 ఆగస్టు 1 నుంచి స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా ఓపెన్ మార్కెట్ నుంచి బైబ్యాక్ చేసే షేర్ల విలువ కంపెనీ చెల్లింపు మూలధనం, నగదు నిల్వల్లో 15% కంటే తక్కువగా ఉండాల'ని సెబీ నోటిఫికేషన్‌లో తెలిపింది. కంపెనీలకు ఖర్చులను తగ్గించడానికి బైబ్యాక్ ప్రక్రియ కోసం మర్చంట్ బ్యాంకర్‌ను నియమించుకోవడాన్ని సెబీ ఐచ్ఛికం చేసింది.




## మేలో 1.53 కోట్ల మంది దేశీయ విమాన ప్రయాణికులు

**న్యూఢిల్లీ:** మే నెలలో భారత విమానయాన సంస్థలు దేశీయంగా 1.53 కోట్ల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాయి. ఏప్రిల్‌లో ప్రయాణించిన 1.38 కోట్ల మందితో పోలిస్తే ఈ సంఖ్య 11 శాతం ఎక్కువ. 2025 మేతో పోల్చినా దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్య ఈ ఏడాది మేలో 9.49 శాతం పెరగడం గమనార్హం. మేలో ఇండిగో మార్కెట్ వాటా 64.9 శాతానికి తగ్గగా.. ఎయిరిండియా గ్రూపుది 25.6 శాతానికి పెరిగింది. ఆకాశ ఎయిర్ మార్కెట్ వాటా 5.8 శాతం వద్దే కొనసాగగా, స్పైస్‌జెట్ మార్కెట్ వాటా 2.5 శాతానికి దిగొచ్చింది. 10 ప్రధాన విమానాశ్రయాల వద్ద సమయపాలనలో (ఓటీపీ) 82.8 శాతంతో ఇండిగో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో ఆకాశ ఎయిర్ (78.3%), ఎయిరిండియా గ్రూపు (74.5%) ఉన్నాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
9 జూలై 2026

# మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



**శేరిలింగంపల్లి, జూలై 8 (జనంసాక్షి):** శేరిలింగంపల్లి నియోజకవర్గం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని జనప్రియ నగర్‌లో నెలకొన్న వరదనీటి కాలువ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించడానికి కృషి చేస్తానని రాష్ట్ర ప్రజా బడ్జెట్ కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ ప్రకటించారు. జనప్రియ నగర్ వరదనీటి కాలువ అవుట్‌లెట్ సమస్య పరిష్కారం కోసం బుధవారం సీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదనీటి కాలువ అవుట్‌లెట్ సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం కనుగొంటామని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

వరదనీటి కాలువ అవుట్‌లెట్ సరిగ్గా లేకపోవడం వల్ల కాలనీలు ముంపునకు గురవుతున్నాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గాంధీ తెలిపారు. కైదమ్మ కుంట చెరువు అవుట్‌లెట్ ద్వారా అధిక నీటి ప్రవాహం వస్తోందని, దీనిని పరిగణలోకి తీసుకొని వరదనీటి కాలువ నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు. పక్కా ప్రణాళికలు వేసుకొని యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి పూర్తి చేయాలని, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని ఆయన వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మెరుగైన సౌకర్యాలు కల్పించి ఉత్తమ జీవన విధానానికి బాటలు వేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో సీఎంసీ ఇంజనీరింగ్ విభాగం డీఈ శ్రీదేవి, నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ధాత్రి నాథ్ గౌడ్, శ్రీనివాస్, రామకృష్ణ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ రద్దీకి డేటా ఆధారిత పరిష్కారాలు

- వారం రోజుల పాటు వాహనాల సమగ్ర లెక్కింపు చేపట్టాలని ఆదేశం
- ఐటీ ఉద్యోగుల్లో కార్‌పూలింగ్‌కు ప్రోత్సాహం ఇవ్వాలని సూచన
- సీసీ కెమెరాలు, సిగ్నళ్ల పనితీరుపై జాయింట్ సిపి సన్ ప్రీత్ సింగ్ ప్రత్యేక సమీక్ష
- డ్రంక్ అండ్ డ్రైవ్‌పై రాజీ లేకుండా కఠిన చర్యలు



**శేరిలింగంపల్లి, జూలై 8 (జనం సాక్షి):** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ రద్దీని శాస్త్రీయంగా విశ్లేషించి సమర్థవంతమైన నిర్వహణకు డేటా ఆధారిత కార్యాచరణ రూపొందించాలని సైబరాబాద్ ట్రాఫిక్ విభాగం సంయుక్త కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అధికారులను ఆదేశించారు. శేరిలింగంపల్లి ట్రాఫిక్ జోన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల స్టేషన్ హౌస్ అధికారులతో బుధవారం కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించి పలు కీలక సూచనలు చేశారు. ప్రధానంగా పరిశ్రమలు, ఐటీ సంస్థలు, వాణిజ్య కేంద్రాల నుంచి ఏయే సమయాల్లో ఎంత మేర వాహన రాకపోకలు జరుగుతున్నాయనే అంశంపై వారం రోజుల పాటు సమగ్ర సర్వే నిర్వహించాలని సూచించారు. ప్రతిరోజూ సమయానుసారంగా వాహనాల లెక్కింపు చేపట్టి ఉదయం, సాయంత్రం రద్దీ సమయాల్లో ట్రాఫిక్ తీవ్రతను అంచనా వేయాలని తెలిపారు. ఈ సర్వే ద్వారా భవిష్యత్ ట్రాఫిక్ ప్రణాళికకు అవసరమైన ఖచ్చితమైన సమాచారం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ఐటీ కారిడార్‌లో పనిచేసే ఉద్యోగులు వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించి కార్‌పూలింగ్, షేరింగ్ విధానాలను అనుసరించేలా అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే వాహనాల వర్గీకరణ, ట్రాఫిక్ వాల్యూం, రహదారుల సామర్థ్యంపై సమగ్ర విశ్లేషణ చేపట్టి అవసరమైన చోట్ల ట్రాఫిక్ నిర్వహణలో మార్పులు చేయాలని అధికారులను ఆదేశించారు. కమిషనరేట్ పరిధిలోని ప్రధాన జంక్షన్లు, రహదారుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును సమీక్షించి అవి సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో నిరంతరం పరిశీలించాలని సూచించారు. కెమెరాల జియో ట్యాగింగ్, హై రిజల్యూషన్ కెమెరాల ఏర్పాటు, సిగ్నల్ అబ్స్ట్రాక్ట్‌లు, పెలికాన్ సిగ్నళ్లు, జంక్షన్ల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. షాపింగ్ మాల్స్, హోటళ్లు, ఆసుపత్రులు, విద్యాసంస్థల వద్ద ట్రాఫిక్ పరిస్థితులను అధ్యయనం చేసి రద్దీ సమయాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యాసంస్థల ప్రారంభ, ముగింపు సమయాల్లో విద్యార్థుల ప్రయాణ విధానాన్ని పరిశీలించి ట్రాఫిక్‌పై దాని ప్రభావాన్ని విశ్లేషించాలని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను కట్టడి చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సన్ ప్రీత్ సింగ్ స్పష్టం చేశారు. సమావేశంలో శేరిలింగంపల్లి ట్రాఫిక్ డీసీపీ రవికుమార్, అడిషనల్ డీసీపీ హనుమంతరావు, ట్రాఫిక్ అడ్మిన్ అడిషనల్ డీసీపీ నరేందర్, ఎస్‌సీసీ సీఈఓ నవేద్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బల్కంపేట బోనాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- జూలై 20 నుంచి 22 వరకు ఆషాడ ఉత్సవాలు
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి : మంత్రి సురేఖ
- భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు
- పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి.. అధికారులతో సమీక్ష



**అమీర్‌పేట్, జూలై 8 (జనం సాక్షి):** బల్కంపేట శ్రీ ఎల్లమ్మ అమ్మవారి ఆషాడ బోనాల ఉత్సవాలు, వార్షిక కళ్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. బుధవారం బల్కంపేట ఆలయంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో పాల్గొన్న ఆమె ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. దాదాపు 700 ఏళ్ల చరిత్ర కలిగిన బల్కంపేట శ్రీ ఎల్లమ్మ ఆలయానికి విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ ఆలయాన్ని దర్శించడం అష్టాదశ శక్తిపీఠాలను దర్శించినంత పుణ్యఫలాన్ని ఇస్తుందనే విశ్వాసం భక్తుల్లో ఉందన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

ఆషాడ బోనాల ఉత్సవాలు జూలై 20న సాయంత్రం ఎదుర్కోలు ఉత్సవంతో ప్రారంభమవుతాయని, జూలై 21న ఉదయం కళ్యాణోత్సవం, జూలై 22న సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీస్, ట్రాఫిక్, టీజీఎస్‌పీడీసీఎల్, జలమండలి, జీహెచ్‌ఎంసీ, వైద్యారోగ్య, అగ్నిమాపక, ఆర్టీసీ, సాంస్కృతిక, ఆర్‌అండ్‌బీ, ఐఅండ్‌పీఆర్, దేవాదాయ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక క్యూలైన్లు, తాగునీటి సదుపాయం, పారిశుద్ధ్య నిర్వహణ, వైద్య శిబిరాలు, ప్రత్యేక ఆర్టీసీ బస్సులు, విద్యుత్ భద్రత, ట్రాఫిక్ మళ్లింపులు, భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా ఉండేలా చూడాలని ఆదేశించారు.

సమావేశంలో దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, ఐఅండ్‌పీఆర్ ప్రత్యేక కమిషనర్ ముకుంద రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక అల, అడిషనల్ సీపీ ఇక్బాల్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ నర్సింహారావుతో పాటు దేవాదాయ, పోలీస్, ట్రాఫిక్, జీహెచ్‌ఎంసీ, టీజీఎస్‌పీడీసీఎల్, వైద్యారోగ్య, అగ్నిమాపక శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎడ్యుకేషన్ హబ్ నిర్మాణ పనులు పరిశీలించిన సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ



**దుద్యాల, జూలై 8 (జనం సాక్షి):** రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్ వికారాబాద్ జిల్లా, కొడంగల్ నియోజకవర్గం కడ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో పర్యటించి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా దుద్యాల్ మండలం హకీంపేట పరిధిలోని ఎడ్యుకేషన్ హబ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి ఆయన పరిశీలించారు. ఎడ్యుకేషన్ హబ్‌లో చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్ కాంట్రాక్టర్లకు సూచించారు. ప్రతి బ్లాక్‌కు ప్రత్యేక అధికారులను నియమించి ఇచ్చిన గడువు లోపు పనులు పూర్తి అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు. పనుల పురోగతిలో అధికారులు నిర్లక్ష్యాన్ని వీడాలని ఆయన తెలిపారు. పనులన్నీ వేగవంతంగా జరగాలంటే మానవ వనరుల సామర్థ్యం పెంచడంతోపాటు రెండు షిఫ్టులుగా పనిచేయాలని ఆయన కాంట్రాక్టర్లకు సూచించారు. ప్రిన్సిపల్ సెక్రటరీతో పాటు అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైని) సచిన్ బస్వరాజ్ గుట్టూరు, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, జడ్పీ సిఇఓ సుధీర్, ఇంజనీరింగ్ సిబ్బంది ఉన్నారు.

## వేధింపులు తట్టుకోలేక యువకుడి ఆత్మహత్య

**యాలాల, జూలై 8 (జనం సాక్షి):** వికారాబాద్ జిల్లా యాలాల మండలం కోకట్ గ్రామానికి చెందిన గాండ్ల శివకుమార్ (31) వేధింపులు భరించలేక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం, శివకుమార్‌కు అదే గ్రామానికి చెంది న ఓ వివాహితతో కొంతకాలంగా పరిచ యం ఉండేది. అనంతరం ఆమెకు దూరంగా ఉండా లని శివకుమార్ ప్రయత్నించాడని, అయితే ఆ సంబంధాన్ని కొనసాగించాలని ఆమె ఒత్తిడి తెచ్చిందని కుటుంబ సభ్యులు ఆరోపి స్తున్నారు. ఈ విషయమై గ్రామ పెద్దల సమక్షంలో పంచా యితీ జరిగినప్పటికీ వివాదం ముగియలేదని తెలిపారు. సంబంధాన్ని కొనసా గించకపోతే పరువు తీస్తానంటూ ఫోన్‌లో తరచూ బెదిరింపు లు, బ్లాక్‌మెయిల్‌కు పాల్పడి ఒదని ఆరోపించా రు. ఈ పరిస్థితులతో తీవ్ర మానసిక క్షోభకు గురైన శివకుమార్ ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మృతుడి భార్య చంద్రకళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు యాలాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టా రు. నిందితురాలిని సోమవారం రాత్రి హైదరా బాద్‌లో అరెస్ట్ చేసి మంగళవారం కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

# కొత్త ఉపాధి విధానంతో పేదలకు నష్టమే

- ‘వీబీజీఆర్‌ఏఎంజీ’ అమలుతో ఉపాధి హామీ నిర్వీర్యమవుతుంది : చెరుపల్లి సీతారాములు
- కేంద్రం నిధుల వాటా తగ్గడంతో రాష్ట్రాలపై భారం పెరుగుతుందన్న ఆందోళన
- మున్సిపాలిటీల్లోనూ ఉపాధి హామీ పథకం అమలు చేయాలని విజ్ఞప్తి



**హయత్‌నగర్, జూలై 8 (జనం సాక్షి):** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ఉపాధి విధానం వల్ల పేదల ప్రయోజనాలు దెబ్బతింటాయని మాజీ ఎమ్మెల్సీ, మాజీ సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు విమర్శించారు. “కొండ నాలుకకు మందు పెడితే ఉన్న నాలుక ఊడినట్లు” ప్రస్తుతం ఉపాధి హామీ పథకం పరిస్థితి మారిందని ఆయన వ్యాఖ్యానించారు. బుధవారం మన్సూరాబాద్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వామపక్షాల చొరవతో గతంలో తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) ద్వారా కోట్లాది గ్రామీణ పేదలకు ఉపాధితో పాటు కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. చెక్‌డ్యాంల నిర్మాణం, చెరువుల పునరుద్ధరణ, మట్టి పనులు వంటి అభివృద్ధి కార్యక్రమాలతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఈ పథకం బలంగా నిలిచిందని పేర్కొన్నారు.

అయితే ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానాన్ని రాష్ట్రాలపై బలవంతంగా అమలు చేయించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. దీంతో ఇప్పటికే విజయవంతంగా అమలవుతున్న ఉపాధి హామీ విధానం నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ఏడాది తెలంగాణకు 21 కోట్ల పని దినాల అవసరం ఉండగా కేవలం ఏడు కోట్ల పని దినాలే కల్పించారని, ఇదే కారణంగా చూపుతూ రానున్న రోజుల్లో పని దినాలను మరింత తగ్గించే అవకాశాలు కనిపిస్తున్నాయని అన్నారు.

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో 120 రోజుల ఉపాధి, రోజుకు రూ.400 కూలీ ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అయితే ఇటీవల రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో కేంద్రం తీసుకొచ్చిన కొత్త విధానాన్ని అమలు చేస్తామని ప్రకటిస్తూ, పేరు విషయంలో మాత్రమే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఫ్యూచర్ సిటీ పరిధిలో విలీనమైన గ్రామాలతో కలిపి వందకు పైగా గ్రామాల ప్రజలు ఉపాధి అవకాశాలు కోల్పోయి వలసలకు వెళ్లే పరిస్థితి ఏర్పడుతోందని చెప్పారు.

గ్రామీణ ప్రాంతాలతో పాటు మున్సిపాలిటీల్లోనూ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని, పాత ఎన్‌ఆర్‌ఈజీఎస్ విధానాన్నే యథాతథంగా కొనసాగించాలని సీపీఎం తరపున రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు చెరుపల్లి సీతారాములు తెలిపారు. కొత్త విధానం అమలైతే వేలాది పేద కుటుంబాలు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు.

# సీఎం సహాయనిధి పేద ప్రజలకు భరోసా



ఎమ్మెల్యే కాలే యాదయ్య

**చేవెళ్ల, జూలై 08 (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు భరోసానిస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల మండల, మున్సిపాలిటీ పరిధికి చెందిన ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 50 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ.21,79,000/- విలువైన చెక్కులను ఎమ్మెల్యే కాలే యాదయ్య అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న పేద ప్రజల కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని తెలిపారు. ప్రజలకు అవసరమైన ప్రతి ప్రభుత్వ సంక్షేమ పథకం సకాలంలో అందేలా నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈ మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ రాము గౌడ్, కౌన్సిలర్లు బండారి శైలజాఆగి రెడ్డి, పైండ్ల మధుసూదన్ రెడ్డి, దావల్గారి గోపాల్ రెడ్డి, తాళ్లపల్లి నరసింహులు, సొసైటీ చైర్మన్ లు దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, పార్టీ అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, మున్సిపల్ పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్లు లొంక శ్రీనివాస్ గౌడ్, రాజశేఖర్, గౌదిచేర్ల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ లు ఉపసర్పంచ్లు మధుసూధన్ గుప్తా, పడాల ప్రభాకర్, గంగి యాదయ్య, టేకులపల్లి శ్రీనివాస్, పార్టీ నాయకులు మాణిక్యం, కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు. తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ లెక్చరర్లను నియమించాలి

**బీఆర్‌ఎస్వి, బీవీఎఫ్ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా**

**బోధన్, జూలై 8 (జనంసాక్షి) :** బోధన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ లెక్చరర్లను నియమించాలని కోరుతూ బుధవారం బీఆర్‌ఎస్వీ, బివిఎఫ్ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపి అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు వడ్ల సతీష్ చారి, సిరివెసు సంతోష్ లు మాట్లాడుతూ, బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ కోర్స్ చదువుతున్న విద్యార్థులకు ఇంగ్లీష్, జనరల్ ఫౌండేషన్ కోర్స్ మరియు ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ సబ్జక్ట్స్ బోడించడానికి రెండు సంవత్సరాలనుండి సంబంధిత అధ్యాపకులు లేక విద్యార్థులకు ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు.

ప్రైవేట్ కళాశాలలో వృత్తి విద్య కోర్స్ చదవడానికి 18-20 వేల వరకు ఖర్చు అవ్వుతుందని,అలాగే ఫీజ్ రియంబర్స్మెంట్ విడుదల అవ్వక ఫీజ్ కడితే గాని టిసి, మెమోలు ఇవ్వడం లేదన్నారు. అందువల్ల ప్రభుత్వ కళాశాలలో చేరితే ఇక్కడ బోధించడానికి అధ్యాపకులు లేరని విద్యార్థి సంఘ నాయకులు అసహనం వ్యక్తం చేశారు. నిజామాబాదు జిల్లాలో కొన్ని జూనియర్ కళాశాలలో కనీసం 100 మంది విద్యార్థులు లేకున్నా అక్కడ ఉపాధ్యాయులు ఉండడం మరి బోధన్ లో కేవలం ఒకేషనల్ కోర్స్ చదువుతున్న విద్యార్థులు 345 మంది ఉన్న అధ్యాపకులు లేకపోవడం జిల్లా ఇంటర్మీడియట్ విద్య శాఖ అధికారి పనితీరుకు అద్దం పడుతుంద న్నారు. వారం రోజులలో ఫ్యాకల్టీని నియమించక పోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్వి పట్టణ అధ్యక్షులు వడ్ల సతీష్ చారి, బహుజన విద్యార్థి ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షులు సిరివెసు సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

# తాడిచెర్ల బ్లాక్-2 కేటాయింపులో బీఎంఎస్ కీలక పాత్ర

- సింగరేణి భవిష్యత్తు దృష్ట్యా కేంద్రాన్ని కోరిన బీఎంఎస్
- 277 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలున్న బ్లాక్ సింగరేణికి కీలకం : వడ్డేపల్లి కుమారస్వామి
- 1,400 మందికి ప్రత్యక్ష ఉపాధి భద్రత లభిస్తుందని వ్యాఖ్య
- ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు

**గోదావరిఖని, జూలై 8 (జనం సాక్షి):** భూపాలపల్లి జిల్లాలోని తాడిచెర్ల బొగ్గు బ్లాక్--2ను సింగరేణికి కేటాయించే ప్రక్రియలో భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) కీలక పాత్ర పోషించిందని బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి కుమారస్వామి తెలిపారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. గత నెల 30న బీఎంఎస్ కోల్ సెక్టార్ ఇన్‌చార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు సంఘం ప్రతినిధి బృందం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డిని కలిసి తాడిచెర్ల బ్లాక్-2ను సింగరేణికి కేటాయించాలని కోరుతూ సమగ్ర వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. సింగరేణిలో బొగ్గు నిల్వలు క్రమంగా తగ్గుతున్న నేపథ్యంలో సంస్థ భవిష్యత్తు, కార్మికుల ఉపాధి భద్రత కోసం ఈ బ్లాక్ అత్యంత కీలకమని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. తాడిచెర్ల బ్లాక్-2లో సుమారు 277 మిలియన్ టన్నుల నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని, సింగరేణికి ఉన్న అనుభవం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సమర్థవంతమైన యంత్రాంగాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. దీనిపై కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించి, కోల్ బ్లాకుల బిడ్డింగ్ ప్రక్రియలో సింగరేణి పాల్గొంటే అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే మణుగూరు పీకే ఓసీ-2 డిప్‌సైడ్ ఎక్స్‌టెన్షన్ ప్రాజెక్టు, ఇల్లందు పూసపల్లి ఓసీ ప్రాజెక్టుల విషయంలో కూడా సానుకూల నిర్ణయాలు తీసుకునేందుకు చర్యలు చేపడతామని కేంద్ర మంత్రి వెల్లడించినట్లు కుమారస్వామి చెప్పారు. ఈ సందర్భంగా తాడిచెర్ల బ్లాక్-2 కేటాయింపునకు సహకరించిన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి, బీఎంఎస్ కోల్ సెక్టార్ ఇన్‌చార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డికి సింగరేణి కార్మికుల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ కార్మికుల సంక్షేమం, పరిశ్రమ అభివృద్ధి, దేశ ప్రగతే లక్ష్యంగా పనిచేస్తూ సింగరేణి అభివృద్ధి, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం తన పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. సింగరేణి కార్మికులంతా బీఎంఎస్‌కు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వై. సారంగపాణి, కేంద్ర కోశాధికారి సాయి వేణు సతీష్, కేంద్ర వైస్ ప్రెసిడెంట్ అరకాల ప్రసాద్, ఏరియా సెక్రటరీ మేడ రామ్మూర్తితో పాటు సంఘం నాయకులు ఈముల సత్యనారాయణ, ఎల్లావుల కోటయ్య, సంఘాని సాంబయ్య, గాలిపెల్లి తిరుపతి, గాజుల వెంకటస్వామి, బండారి శ్యాంసుందర్, జనగామ రాజలింగం, లక్ష్మణ్, అశోక్, సతీష్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్ పిచ్చి.. కుటుంబాన్ని హత్య చేసే యత్నం

- భార్యాభర్తల పరిస్థితి విషమం.. అత్తమామలు సేఫ్
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న కోట్ పల్లి పోలీసులు



**వికారాబాద్ జిల్లా బ్యూరో/ కోట్‌పల్లి జులై 8 (జనం సాక్షి):** మానవత్వం మంట కలిసిపోతుంది. దయ దక్షిణ్యాలు ఏ కోసాను కనిపించడం లేదు. ఏదో ఒక పిచ్చితో మొత్తం కుటుంబాన్ని సర్వ నాశనం చేయాలని కంకణం కట్టుకుంది ఓ కోడలు. వికారాబాద్ జిల్లా కోట్ పల్లి మండలం ఎన్నారం గ్రామంలో ఈ సంఘటన బుధవారం జరిగింది. గ్రామస్తులు కోట్‌పల్లి పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్నారం గ్రామానికి చెందిన కావలి మేరీ తన భర్త రత్నయ్యను మామ యేసయ్యను అత్త శాంతమ్మలను పాయసంలో విషం కలిపి హత్య చేసే యత్నం చేసింది. అత్తమామలు భర్తను నమ్మించి తెలివిగా పాయాసంలో గుర్తు తెలియని విషయం కలిపి నలుగురికి ఒకేసారి వడ్డించింది. ముందుగా భర్త రత్నయ్య తినగా అత్తమామలు కొంత పాయసం తినేసరికి అందులో నుంచి ఒక రకమైన వాసన రావడంతో అనుమానం వచ్చి కోడలు మేరిని నిలదీశారు. అత్తమామలను భర్తను నమ్మించడానికి మేరీ కూడా విషం కలిపిన పాయసాన్ని కొంత తినేసింది. దీంతో భర్త రత్నయ్య కోడలు మేరీ విషం తిని తీవ్ర అస్వస్థకు గురి అయ్యారు. ఈ విషయాన్ని పసిగట్టిన అత్తమామలు ఇరుగుపొరుగు కు తెలియజేయడంతో వారిని వెంటనే సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మేరీ ఆమె భర్త రత్నయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వికారాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. తమ కోడలు మేరీ తమ కుటుంబ సభ్యులను హత్య చేయడానికి పాయాసంలో విషం కలిపి వడ్డించిందని కోట్ పల్లి పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రాథమిక సమాచారం మేరకు నిందితురాలు మేరికి ఫోన్ పిచ్చి ఉందని ఎప్పుడు ఫోన్ లో నిమగ్నమై ఉంటుందని ఫోన్ చూడవద్దని భర్త అత్తమామలు మందలించడంతో వారిని హత్య చేయడానికి పథకం చేసినట్లు తెలుస్తుంది. రత్నయ్య మేరీలు గత ఏడాది ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కొన్ని నెలల పాటు వారి కాపురం అన్యోన్యంగా సాగిన తరువాత ఫోన్ పిచ్చి కాపురంలో కలహాలు సృష్టించింది. భర్తతో గొడవపడి పుట్టింటికి వెళ్ళిపోయింది. వారం రోజుల క్రితం తిరిగి భర్త ఇంటికి వచ్చిన మేరీ ఫోను చూడడం పిచ్చి మానుకోలేక మేరీ కుటుంబం మొత్తాన్ని హత్య చేయడానికి పూనుకుంది. ఈ సంఘటన జిల్లాలో తీవ్ర సంచలనంగా మారింది. మరిన్ని విషయాలు తెలుసుకోవడానికి కోట్‌పల్లి పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం మేరీ ఆమె భర్త రత్నయ్య వికారాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి పరిస్థితి విషమంగా ఉందని 24 గంటలు గడిస్తే గాని చెప్పలేము అని డాక్టర్లు సూచించినట్లు తెలుస్తుంది. మేరీ వడ్డించిన విషం కలిపిన పాయసం తిన్న ఆమె మామ యేసయ్య అత్త శాంతమ్మలు ప్రాణాపాయ పరిస్థితి నుంచి బయటపడ్డారు. ప్రస్తుతం వాళ్లు కోరుకుంటున్నారు. కేసు దర్యాప్తు జరుగుతుంది.

# 33% రిజర్వేషన్ ఈ పార్లమెంటు సమావేశాలోనే ఆమోదంచాలి

**ఐద్వా ఆల్ ఇండియా అధ్యక్షురాలు పీకే శ్రీమతి**



**ముషీరాబాద్, జూలై 08 (జనం సాక్షి):** మహిళలకు 33% రిజర్వేషన్ బిల్లును ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ఆమోదించి వెంటనే అమలు చేయాలని ఐద్వా ఆల్ ఇండియా అధ్యక్షురాలు పీకే శ్రీమతి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం చౌరస్తా వద్ద అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మీ అధ్యక్షతన మానవహారం నిర్వహించారు. ఈ మానవహారాన్ని ఉద్దేశించి ఐద్వా ఆల్ ఇండియా అధ్యక్షురాలు పి కే శ్రీమతి, ఆల్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ పుణ్యవతిలు మాట్లాడుతూ... దేశ జనాభాలో సగ భాగంగా ఉన్న మహిళలకు రాజకీయాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించడం ప్రజాస్వామ్యానికి అత్యంత అవసరమనీ, మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించే బిల్లును ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ఆమోదించి, ఎలాంటి జాప్యం లేకుండా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. జనగణన, డిలిమిటేషన్ వంటి వాటిని మహిళా రిజర్వేషన్ బిల్లుకు లింకు పెట్టి మహిళల రాజకీయ హక్కులను మరింత ఆలస్యం చేయడం తగదన్నారు. మహిళలకు సమాన అవకాశాలు, సమాన ప్రాతినిధ్యం కల్పించడం రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణమైన బాధ్యత అని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్ అరుణ జ్యోతి, ఉపాధ్యక్షురాలు టి జ్యోతి, రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు కెన్. ఆశలత, బుగ్గవీటి సరళ, పి ప్రభావతి, కే నాగలక్ష్మి, ఎన్ రత్నమాల, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండి పద్మ, పి శశికళ , ఎం వినోద, బట్టుపల్లి అనురాధ, షబానా, వై. వరలక్ష్మి లతో పాటు రాష్ట్రంలో 29 జిల్లాల ఐద్వా కార్యకర్తలు హాజరయ్యారు.

# సన్‌షైన్ ఆస్పత్రిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి: ఏఐఎఫ్‌బీ



**కరీంనగర్ టౌన్, జూలై 8, ( జనం సాక్షి) :**
కరీంనగర్ నగరంలోని సన్‌షైన్ హాస్పిటల్స్‌లో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి, ఆస్పత్రిని సీజ్ చేయాలని అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ డిమాండ్ చేశారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో 27వ డివిజన్ కార్పొరేటర్ బోట్ల శ్యామల, తంగేళ్ల కిరణ్ కుమార్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కామెర బద్రినాథ్, రావుల ఆదిత్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.
జిల్లా డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ గతంలో సమర్పించిన నివేదికలో సన్‌షైన్ హాస్పిటల్స్‌లో నార్కోటిక్, సైకోట్రోపిక్ మందుల వినియోగంలో తీవ్ర అక్రమాలు జరిగినట్లు పేర్కొన్నప్పటికీ, ఇప్పటి వరకు ఆస్పత్రి యాజమాన్యం లేదా సంబంధిత వైద్యులపై ఎలాంటి క్రిమినల్ చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యకరమని శేఖర్ అన్నారు. కొందరు అధికారులు ఆస్పత్రి యాజమాన్యానికి సహకరిస్తున్నారని ఆరోపించారు.డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం--1940, డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ రూల్స్--1945, ఎన్డీపీఎస్ చట్టం--1985 నిబంధనలు ఉల్లంఘించారని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ నివేదికలో స్పష్టంగా ఉన్న నేపథ్యంలో, సంబంధిత వైద్యుల లైసెన్సులను శాశ్వతంగా రద్దు చేయాలని తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.ఆస్పత్రికి ఫైర్ ఎన్‌వోసీ లేకపోవడంతో పాటు తగిన అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లు కూడా లేవని ఫైర్ శాఖ నివేదికలో తేలిందని పేర్కొన్నారు. ఇలాంటి తీవ్రమైన లోపాలున్న ఆస్పత్రిపై కేవలం జరిమానాతో సరిపెట్టడం సమంజసం కాదన్నారు.ప్రభుత్వం వెంటనే సన్‌షైన్ హాస్పిటల్స్‌ను సీజ్ చేసి రిజిస్ట్రేషన్, ఫార్మసీ లైసెన్సును రద్దు చేయాలని, ఎన్డీపీఎస్ చట్టం, డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం కింద బాధ్యులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి కోర్టులో ప్రాసిక్యూషన్ చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే ఆస్పత్రికి అనుకూలంగా వ్యవహరించారని ఆరోపిస్తున్న సంబంధిత అధికారులపై శాఖాపరమైన, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు.తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే ప్రజా రక్షణ కోసం పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్, రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్, తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్‌కు ఆధారాలతో కూడిన ఫిర్యాదులు అందజేయనున్నట్లు తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పూర్తి పారదర్శకత

- ఎల్-1 అర్హులకే ఇళ్ల మంజూరు
- 45 రోజుల్లో నిర్మాణం ప్రారంభించాలి
- బేస్‌మెంట్ 600 చదరపు అడుగులు, స్లాబ్ 750కి మించరాదు
- గుడిసె కుటుంబాలకు తొలి ప్రాధాన్యం



**గోదావరిఖని, జూలై 8 (జనంసాక్షి):** ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ఆన్‌లైన్ విధానంలోనే జరుగుతోందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. రామగుండం నియోజకవర్గ స్థాయి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను కంప్యూటర్ ఆధారిత విధానంలో ఎల్-1, ఎల్-2, ఎల్-3 కేటగిరీలుగా విభజించారని వివరించా రు. ఇంటి స్థలం ఉన్న అర్హులు ఎల్-1లో ఉంటారని, ఇందిరమ్మ కమిటీ సిఫారసు మేరకు మున్సిపల్ కమిషనర్ లాగిన్ ద్వారా గెజిటెడ్ అధికారులు పరిశీలించి అర్హత నిర్ధారించిన తర్వాత జిల్లా కలెక్టర్‌కు చేర్చుతారని తెలిపారు. ఇన్‌చార్జి మంత్రి ఆమోదం అనంతరం మాత్రమే మంజూరు ఉత్తర్వులు జారీ అవుతాయని స్పష్టం చేశారు.
రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎల్-1లో 449 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, అయితే కేవలం 184 మంది మాత్రమే నిర్మాణం ప్రారంభించారని కలెక్టర్ తెలిపారు. ధర్మారం ప్రాంతంలో నిర్మాణాలు వేగంగా కొనసాగుతుండగా, రామగుండం ప్రాంతంలో పురోగతి సంతృప్తికరంగా లేదన్నారు. మంజూరైన లబ్ధిదారులందరూ వెంటనే నిర్మాణం ప్రారంభించాలని సూచించారు.
నిబంధనల ప్రకారం 45 రోజుల్లోగా నిర్మాణం ప్రారంభించకపోతే మంజూరును రద్దు చేసే అవకాశం ఉందని, రద్దు చేసే ముందు ప్రజాప్రతినిధులు లబ్ధిదారులతో మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకోవాలని చెప్పారు. ఆ తర్వాత కూడా ప్రారంభించకపోతే ఆ ఇళ్లను రద్దు చేసి ఇతర అర్హులకు కేటాయిస్తామని స్పష్టం చేశారు.
ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ బిల్లులు ప్రతి సోమవారం క్రమం తప్పకుండా విడుదల చేస్తున్నామని, లబ్ధిదారులు నిర్మాణ పురోగతిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే దానికి అనుగుణంగా చెల్లింపులు జరుగుతాయని తెలిపారు. ఇటీవల 1,312 మంది దరఖాస్తులను పరిశీలించి 607 మందిని ఎల్-1లో గుర్తించామని, వారం రోజుల్లో ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు.
ఎల్-2లో ఉన్న 700 మందికి ఇంటి స్థలం లేనప్పటికీ, సంబంధిత పత్రాలు సమర్పిస్తే ఎల్-1కి మార్చి మంజూరు చేసే అవకాశం ఉందని వివరించారు. ఎల్-3లో గతంలో ప్రభుత్వ గృహ పథకాల లబ్ధి పొందినవారు ఉంటారని, 2014కి ముందు మంజూరై నిర్మాణం పూర్తి చేయని వారికి సహాయం అందిస్తామన్నారు. బేస్‌మెంట్ 600 చదరపు అడుగులకు మించకూడదని, స్లాబ్ ఏరియా 750 చదరపు అడుగులకు మించరాదని స్పష్టం చేశారు. గుడిసెల్లో నివసించే కుటుంబాలకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నామని, గుడిసెలు లేని సమాజం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.
ఈ కార్యక్రమంలో రామగుండం మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ ఎల్లయ్య, హౌసింగ్ పీడీ రాజేశ్వర్, తహసీల్దార్ రవీందర్ రావు, కార్పొరేటర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.





# అట్టహాసంగా అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

### 36 ఏళ్లుగా విద్యారంగానికి అమూల్య సేవ

- సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు
- రాజకీయాల్లోనూ చెరగని ముద్ర
- జిల్లా వ్యాప్తంగా కేక్ కటింగ్, అన్నదానం

**కరీంనగర్ బ్యూరో/ చిగురుమామిడి జూలై 8 (జనంసాక్షి):**
అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి 56వ జన్మదినం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అట్టహాసంగా వేడుకలు నిర్వహించారు. గత 36 సంవత్సరాలుగా విద్యారంగానికి అనేక సేవలు అందిస్తున్న నరేందర్ రెడ్డి ద్వారా తెలంగాణ విద్యా విధానం ప్రత్యేక గుర్తింపు పొందిందని అభిమానులు అభినందించారు. కరీంగర్‌లోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నవారు మాట్లాడుతూ సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధింపజేసి దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో ఉత్తమ స్థానాలు సాధించడం నరేందర్ రెడ్డి సొంతమని హర్షం వ్యక్తం చేశారు. సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించి విద్యా రంగంలో ఐకాన్‌గా ఎదిగిన నరేందర్ రెడ్డి కృషికి అద్భుత ఫలితాలు లభించాయని పేర్కొన్నారు. రాజకీయాల్లోనూ తన ముద్ర వేసుకుంటున్న నరేందర్ రెడ్డిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కార్యకర్తలు కోరారు.
కరీంనగర్ జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కిమ్ ఫహాద్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో కేక్ కటింగ్, ఎన్ఎస్‌యూఐ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు ఇమ్రాన్ ఆధ్వర్యంలో కమాన్ సమీపంలో అన్నదానం, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మునిగంటి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద అన్నదానం నిర్వహించారు. ఎస్టీ సెల్ అధ్యక్షులు శ్రావణ్ నాయక్ ఆధ్వర్యంలో చింతకుంటలో కేక్ కటింగ్, దేశ్రాజ్‌పల్లిలో సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ జరిగింది.

**రెడ్డి సంఘం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి,స్వీట్ల పంపిణీ**
రెడ్డి సంఘం ఆధ్వర్యంలో చిగురుమామిడి మండల కేంద్రంలో కేక్ కటింగ్, స్వీట్ల పంపిణీ చేశారు. రెడ్డి జేఏసీ మండల అధ్యక్షుడు కలువల రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు నరేందర్ రెడ్డి చేస్తున్న సేవలను గుర్తు చేశారు. విద్య, సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణలో ఆయన చూపుతున్న స్ఫూర్తిని ప్రశంసించారు. కరీంనగర్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, వీఎన్ఆర్ ఫౌండేషన్ సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు వివిధ కార్యక్రమాల్లో పాల్గొని జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# జోనల్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ ముగింపు

- పరిశోధనా సామర్థ్యాలు, సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకున్న సిబ్బంది
- 21 విభాగాల్లో కఠిన పోటీ.. విజేతలు రాష్ట్ర స్థాయి పోటీలకు సిద్ధం
- కమిషనర్ గౌస్ ఆలం అభినందన




కరీంనగర్, జులై 8 (జనంసాక్షి): కరీంనగర్ జోన్-3 పరిధిలోని కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి యూనిట్ల పోలీస్ సిబ్బందికి సంబంధించిన జోనల్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ విజయవంతంగా ముగిసింది. ఫోరెన్సిక్ సైన్స్, ఇన్వెస్టిగేషన్, ఫింగర్ ప్రింట్ సైన్స్, సైబర్ అవగాహన, క్రైమ్ సీన్ ఫోటోగ్రఫీ తదితర 21 విభాగాల్లో సిబ్బంది తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. పోలీస్ శాఖలో పరిశోధనా ప్రమాణాలను మెరుగుపరచడం, అత్యాధునిక సాంకేతికతపై అవగాహన కల్పించడం, సిబ్బందిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించడం ఈ మీట్ ప్రధాన లక్ష్యమని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలను ప్రత్యేకంగా అభినందించారు.
ప్రధాన విజేతలు: ఫోరెన్సిక్ సైన్స్, క్రైమ్ ఇన్వెస్టిగేషన్, క్రిమినల్ లా, మెడికో లీగల్ టెస్ట్, ఫింగర్ ప్రింట్స్ సైన్స్ విభాగాల్లో ఇన్‌స్పెక్టర్ ఎం. సంపత్ కుమార్ (కామారెడ్డి), సి.ఐ. ఎ. ప్రదీప్ కుమార్ (కరీంనగర్), సి.ఐ. కె. నాగేశ్వరరావు (రాజన్న సిరిసిల్ల) ఉత్తమ ప్రదర్శన చేశారు. ఎస్.ఐ.ల విభాగంలో బి. వంశీకృష్ణ (కరీంనగర్), వి. రఘుపతి (సిద్దిపేట), ఎన్. రమాకాంత్ (రాజన్న సిరిసిల్ల), ఐ. భార్గవ్ (కామారెడ్డి), జి. నరేందర్ రెడ్డి (కరీంనగర్), వి. లక్ష్మణ్ (రాజన్న సిరిసిల్ల) విజయం సాధించారు.
పోలీస్ పోర్ట్రెట్, అబ్జర్వేషన్ టెస్ట్ విభాగాల్లో ఏ.ఎస్.ఐ. వి. మధుసూదన్ (సిద్దిపేట) ప్రథమ స్థానం సాధించారు. వెహికల్ సెర్చ్, రూమ్ సెర్చ్‌లో పి.సి. పి. రాంచంద్రం (కామారెడ్డి), గ్రౌండ్ సెర్చ్‌లో పి.సి. డి. ఎల్లయ్య (కరీంనగర్), ఎన్. నగేష్ (సిద్దిపేట) విజేతలుగా నిలిచారు. కంప్యూటర్ అవేర్‌నెస్, ఆఫీస్ ఆటోమేషన్, ప్రోగ్రామింగ్, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ విభాగాల్లోనూ వివిధ యూనిట్ల సిబ్బంది ప్రతిభ చాటారు. జోన్-3 తరపున ప్రథమ స్థానాలు సాధించిన విజేతలు త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొంటారని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు శ్రీనివాస్, జి. వేణుగోపాల్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



### కల్తీ నూనెలు, సింగిల్-యూజ్

# ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు

### మున్సిపల్ కమిషనర్ జి. మల్లికార్జున స్వామి

**జమ్మికుంట, జూలై 8 (జనం సాక్షి):** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, టీ స్టాళ్లు, బజ్జీ బండ్లు, తోపుడు బండ్ల నిర్వాహకులతో పాత మున్సిపల్ కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జి. మల్లికార్జున స్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ,ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆహార పదార్థాల తయారీలో ఎట్టి పరిస్థితుల్లోనూ కల్తీ నూనెలు లేదా పలుమార్లు వాడిన వంట నూనెను ఉపయోగించరాదని సూచించారు. పామాయిల్‌కు బదులుగా డబుల్ ఫిల్టర్ పల్లి నూనె లేదా సన్‌ఫ్లవర్ నూనె వంటి నాణ్యమైన వంట నూనెలను మాత్రమే వినియోగించాలని తెలిపారు.సింగిల్-యూజ్ ప్లాస్టిక్.వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలని ఆదేశించారు.ప్లాస్టిక్ ప్లేట్లు,ప్లాస్టిక్ గ్లాసులు,ప్లాస్టిక్ కవర్లలో టిఫిన్లు ఇవ్వకూడదని, ఆకులు లేదా పర్యావరణహిత పాత్రల్లో మాత్రమే ఆహారాన్ని అందించాలని సూచించారు.టీ స్టాళ్లలో టీ ని గాజు లేదా స్టీల్ గ్లాసుల్లో మాత్రమే అందించాలని తెలిపారు.వారం రోజుల తర్వాత ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామని, ప్లాస్టిక్ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసులు లేదా ఇతర నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే రూ.1,000 నుంచి రూ.2,000 వరకు జరిమానా విధించడంతో పాటు నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా బజ్జీ బండ్లు, హోటళ్ల నిర్వాహకులు తప్పనిసరిగా చేతులకు గ్లౌజులు, తలకు హెడ్ క్యాప్, ముఖానికి మాస్క్ ధరించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ పరిశుభ్రమైన ఆహారాన్ని వినియోగదారులకు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ జి.రాజిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఐ.రమేష్,హోటల్ యజమానులు, బజ్జీ బండ్ల నిర్వాహకులు,తోపుడు బండ్ల వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

# సెలవులపై వెళ్లిన మండల వైద్యాధికారి

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిలిచిపోతున్న సేవలు
- వైద్యం కోసం ఎదురుచూస్తూ బెంచిపై నిద్రపోతున్న రోగులు

**ముత్తారం,జూలై 08 (జనంసాక్షి):** మండల వైద్యాధికారి సెలవుపై వెళ్లడంతో ముత్తారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు పూర్తిగా నిలిచిపోతున్నాయి.దీంతో రోగులు గంటల తరబడి వేచి ఉండి నిరాశతో వెనుదిరుగుతున్నారు.బుధవారం ఉదయం నుంచే పీహెచ్‌సీకి వచ్చిన రోగులకు డాక్టర్ లేకపోవడంతో ఎలాంటి వైద్యం అందలేదు.అసలే వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు జ్వరం, దగ్గు, బీపీ, షుగర్ ఇతర పరీక్షల కోసం ఆసుపత్రికి వచ్చిన రోగులకు మందుల ఇచ్చి పంపిస్తున్నారు. వైద్యం కోసం ఎదురుచూస్తూ ఒక మహిళ ఉదయం 9 గంటల నుంచి వైద్యం కోసం పీహెచ్‌సీకి వచ్చి వేచి ఉంది.డాక్టర్ రాకపోవడంతో ఆమె ఆవరణలో ఉన్న బెంచిపైనే నిద్రపోయింది.మరో మహిళకు ఇంటి వద్ద కోతి కరవడంతో ఉదయం నుంచి కూర్చున్నా. డాక్టర్ ఎప్పుడు వస్తారో తెలియడం లేదు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.పీహెచ్‌సీ సిబ్బంది మాట్లాడుతూ డాక్టర్ సెలవులో ఉన్నారు.వారి స్థానంలో ఇంచార్జ్ డాక్టర్‌ను పంపాలని ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాం.కానీ ఇప్పటివరకు ఎవరూ రాలేదు" అని తెలిపారు.ఇది ప్రభుత్వ వైఫల్యమని గ్రామస్తులు మండిపడ్డారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే డాక్టర్ లేకపోతే పేదలు ఎక్కడికి వెళ్లాలి? ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లే స్తోమత లేదు.ప్రభుత్వం వెంటనే స్పందించి శాశ్వత డాక్టర్‌ను నియమించాలి" అని డిమాండ్ చేశారు.వెంటనే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వెంటనే జోక్యం చేసుకుని,పీహెచ్‌సీలో డాక్టర్‌ను నియమించి రోగులకు సకాలంలో వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# భూ సేకరణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

- రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు సమన్వయంతో పని చేయాలి
- నిర్వాసితులకు తక్షణం పరిహారం, పునరావాసం
- ప్రాజెక్టుల పురోగతి సమీక్షించిన ఆర్ఆర్ కమిషనర్
- జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలి




**కరీంనగర్ బ్యూరో, జూలై 8 (జనంసాక్షి) :** జిల్లాలోని వివిధ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్ అండ్ ఆర్ (రీహాబిలిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్) భూ సేకరణ కమిషనర్ కె. శివకుమార్ నాయుడు అధికారులను ఆదేశించారు. బుధవారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో చేపట్టిన వివిధ ప్రాజెక్టుల భూ సేకరణ పురోగతి పై రెవెన్యూ, ఇరిగేషన్, భూ సేకరణ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.
శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు, మిడ్ మానేరు, గౌరవెల్లి రిజర్వాయర్ కాలువలు, కాకతీయ కాలువ, కాళేశ్వరం ప్రాజెక్టు, కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లైన్, మానేరు రివర్‌ఫ్రంట్ తదితర ప్రాజెక్టుల భూ సేకరణ పురోగతి, అవార్డుల జారీ, పరిహారం చెల్లింపులు, పునరావాస చర్యలపై కమిషనర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని కమిషనర్ పేర్కొన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్‌తో పాటు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేసి భూ సేకరణను వేగవంతం చేయాలని సూచించారు. అవార్డుల జారీ, పరిహారం చెల్లింపులు, నిర్వాసితుల పునరావాసం వంటి అంశాల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
భూ సేకరణలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరగా ముగించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ భూ సేకరణ పనులను వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, పకడ్బందీగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధిస్తామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, డీఆర్ఓ, భూ సేకరణ ఇన్‌చార్జి ఎస్.డి.సి. స్వామి, ఆర్డీఓలు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బైక్ విక్రయించారని మనస్థాపం.. యువకుడి ఆత్మహత్య

**మర్పల్లి (జనంసాక్షి):** వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం పరిధిలోనిలోని దామస్తాపూర్ గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పట్లోళ్ల నరసింహారెడ్డి (33) మనస్థాపానికి గురై పురుగుల మందు సేవించి, చికిత్స పొందుతూ మృతి చెందాడు.కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, బైక్‌ను ఎందుకు విక్రయించావని మందలించడంతో మనస్థాపానికి గురైన నరసింహారెడ్డి ఈ నెల 4వ తేదీన తన ఇంట్లో పురుగుల మందు సేవించాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని వికారాబాద్ లోని మిషన్ ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో, తన భర్త మృతిపై ఎలాంటి అనుమానం లేదని, మనస్థాపంతోనే ఈ ఘటనకు పాల్పడ్డాడని పేర్కొన్నట్లు ఎస్సై అబ్దుల్ రావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

# కరీంనగర్ మధ్యలో గోదాములు వెంటనే తరలించాలి

- గొదాంగడ్డ ప్రాంతంలో గిడ్డంగులు నివాసాల మధ్యే
- భారీ వాహనాల రాకపోకలతో ప్రమాదాలు, కాలుష్యం తీవ్రం
- గత 10 ఏళ్లుగా ప్రజల డిమాండ్
- రైల్వే స్టేషన్ సమీపంలో కొత్త గోదాములు ఏర్పాటు చేయాలి



**కరీంనగర్ బ్యూరో, జూలై 8 (జనంసాక్షి) :**
కరీంనగర్ పట్టణ మధ్యలో ఉన్న గొదాంగడ్డ ప్రాంతంలోని గిడ్డంగుల (వేర్‌హౌజ్)ను వెంటనే సుదూర ప్రాంతాలకు తరలించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు డిమాండ్ చేశారు. బుధవారం గోదాములను సందర్శించి పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం ఆయన ఈ విషయం తెలిపారు.
వేర్‌హౌజ్ అధికారులు, సిబ్బందితో మాట్లాడిన సునీల్ రావు ధాన్యం నిల్వల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గోదాముల్లో నిల్వ ఉన్న ప్యాడీని స్వయంగా పరిశీలించారు. తర్వాత గిడ్డంగుల కార్యాలయంలో మేనేజర్ విజయతో సుదీర్ఘంగా చర్చించారు. గోదాముల తరలింపు, చుట్టుపక్కల డివిజన్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, భారీ వాహనాల రాకపోకల వల్ల జరుగుతున్న ప్రమాదాలు, కాలుష్యం వంటి సమస్యలపై చర్చించారు. ఈ విషయాన్ని పై అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మేనేజర్‌ను సూచించారు. గత 1966లో ఈ గోదాములు ఏర్పాటు చేసినప్పుడు ఇది పట్టణ శివారు ప్రాంతంగా ఉండేదని యాదగిరి సునీల్ రావు గుర్తు చేశారు. కాలక్రమేణా నగరం విస్తరించడంతో గోదాముల చుట్టూ నివాసాలు, కాలనీలు ఏర్పడ్డాయని తెలిపారు. నిత్యం వచ్చే భారీ లారీల వల్ల స్థానికులు తరచూ ప్రమాదాలు ఎదుర్కొంటున్నారని, గతంలో అనేక ప్రమాదాల్లో ప్రాణ నష్టం సంభవించిందని చెప్పారు. అంతేకాకుండా కాలుష్యం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు.
గత పది సంవత్సరాలుగా స్థానిక ప్రజలు గోదాముల తరలింపును గట్టిగా డిమాండ్ చేస్తున్నారని సునీల్ రావు తెలిపారు. ఇంతకుముందు సీడబ్ల్యూసీ చైర్మన్‌కు వినతి పత్రాలు సమర్పించామని గుర్తు చేశారు. గతంలో 28 వేల మెట్రిక్ టన్నుల ప్యాడీ నిల్వ ఉండగా ప్రస్తుతం 23 వేలకు తగ్గినా భారీ వాహనాల తాకిడి మాత్రం తగ్గలేదని చెప్పారు.
నగరానికి రైల్వే స్టేషన్ లేకపోవడంతో గతంలో ఇక్కడ గోదాములు ఏర్పాటు చేశారని, ప్రస్తుతం చక్కటి రైల్వే స్టేషన్ ఉన్నందున గోదాములను స్టేషన్ సమీపంలో లేదా సుదూర ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. త్వరలోనే ఈ సమస్యను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు చేపట్టేలా కృషి చేస్తామని సునీల్ రావు స్పష్టం చేశారు.

# మానేరు గుండె కోత.. అన్నదాత కడుపుకోత



## బీఆర్ఎస్ హయాంలో నిర్మాణం.. కాంగ్రెస్ పాలనలో మౌనం

- కోట్లు కుమ్మరించిన చెక్ డ్యాములు కుప్పలు
- రైతుల ఆవేదన.. ప్రమాదాలు, విషాదాలు
- విచారణ జరపాలని డిమాండ్

**ముస్తాబాద్, జూలై 8 (జనంసాక్షి):** వేములవాడ నియోజకవర్గంలోని మూలవాగు, సిరిసిల్ల నియోజకవర్గంలోని మానేరు వాగులపై నిర్మించిన చెక్ డ్యాములు రైతుల ఆశలను కలలుగానే మిగుల్చాయి. కోట్లాది రూపాయలు ఖర్చు చేసినా చాలా డ్యాములు కొట్టుకుపోయి, మిగిలినవి నిరుపయోగంగా మారాయి. అన్నదాతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మానేరు వాగుపై 11 చెక్ డ్యాములు, మూలవాగుపై 13 చెక్ డ్యాములు నిర్మించారు. మిడ్ మానేరు డ్యాముతో కలిసి మానేరు నీటితో కళకళలాడుతుందని ఊరిమిన పాలకులు కోట్లు కుమ్మరించారు. అప్పటి సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు చొరవతో మరో 12 చెక్ డ్యాముల నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. పనులు పూర్తి చేసినట్లు ప్రకటించి సంబరాలు చేశారు. కానీ చాలా డ్యాములు కొట్టుకుపోయాయి. సిరిసిల్లలో ఒక్క చెక్ డ్యామ్ మినహా మిగిలినవి రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదు.
చెక్ డ్యామ్ కుప్ప కూలి చిన్నారులు ఈత కోసం వెళ్లి ప్రాణాలు కోల్పోయిన విషాదం స్థానికుల్లో ఇప్పటికీ దుఃఖం మిగుల్చింది. గతంలో కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ ప్రభుత్వం నాణ్యత లేని పనులు, కాంట్రాక్టర్ల జేబులు నింపడమే లక్ష్యమని తీవ్రంగా ఆరోపించారు. అఖిలపక్ష ఆందోళనలు కూడా జరిగాయి. కానీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో మౌనం వహించడం రైతుల్లో సందేహాలు రేకెత్తిస్తోంది.
2023లో హాత్ జోడో యాత్రలో భాగంగా సిరిసిల్ల పర్యటనలో చెక్ డ్యాముల సమస్యను కాంగ్రెస్ నాయకులు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కఠిన చర్యలు తీసుకుంటామన్న మాటలు అమలు కాలేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మానేరు పరివాహక ప్రాంత రైతులు చెక్ డ్యాముల విషయంలో ఇప్పటికైనా విచారణ జరపాలని, నిజానిజాలు ప్రజల ముందుంచాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లా పరిరక్షణ సమితి నాయకులు బుస్సా వేణు మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మౌనం వీడి రైతులకు ఉపయోగపడేలా చెక్ డ్యాములను పునరుద్ధరించాలని కోరారు. అన్నదాతల బతుకులు మెరుగుపరచడానికి పాలకులు తక్షణం స్పందించాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.

# పోలీసు స్టేషన్ స్థలాన్ని కాపాడిన హైడ్రా

### కబ్జాలను తొలగించి 6 గుంటల భూమికి హైడ్రా ఫెన్సింగ్




**హైదరాబాద్, జులై 08 (జనంసాక్షి) :** పోలీసు స్టేషన్‌కు కేటాయించిన స్థలాన్ని హైడ్రా కాపాడింది. రంగారెడ్డి జిల్లా, ఉప్పల్ మండలం, కొత్తపేట్ గ్రామంలోని సర్వే నంబర్లు 135, 136లో 6 గుంటల స్థలాన్ని చైతన్యపురి పోలీస్ స్టేషన్‌కు కేటాయించారు. సర్వే నంబర్ 135లో 4 గుంటలు, సర్వే నంబర్ 136లో 2 గుంటలు కలిపి మొత్తం 6 గుంటల భూమిని పోలీసు స్టేషన్ ఏర్పాటుకు నిర్ణయించారు. సర్వే నంబర్ 135లోని 4 గుంటల ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించుకుని షెడ్లు నిర్మించారు. ఆక్రమణలు తొలగించి పోలీసు స్టేషన్‌కు కేటాయించిన భూమిని కాపాడాలని హైడ్రాను పోలీసు శాఖ కోరింది. హైడ్రా అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి కబ్జాలను నిర్ధారించుకుంది. బుధవారం హైడ్రా బృందాలు రంగంలోకి దిగి షెడ్డులను తొలగించింది. ఆక్రమణలు మళ్లీ జరగకుండా సర్వే నంబర్లు 135, 136లోని మొత్తం 6 గుంటల స్థలానికి హైడ్రా ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. పోలీసు స్టేషన్ కోసం కేటాయించిన భూమిగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేసింది.

# ప్రకాశ్‌రాజ్‌పై అప్పట్లోనే బ్యాన్

- బతిమిలాడితే క్షమించి వదిలేసిన చిత్రసీమ
- ఆనాటి విషయాలపై శివకృష్ణ కామెంట్స్ వైరల్

**హైదరాబాద్, జూలై8 (జనంసాక్షి) :** కొద్ది రోజులుగా నటుడు ప్రకాష్ రాజ్ సోషల్ మీడియాలో చేసిన పోస్టులు, వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. ముఖ్యంగా కొన్ని రాజకీయ, సామాజిక అంశాలపై ఆయన వరుసగా స్పందిస్తూ వస్తుండగా.. ఈ నేపథ్యంలో టాలీవుడ్ సీనియర్ నటుడు శివకృష్ణ గతంలో చేసిన వ్యాఖ్యలు మరోసారి వైరల్ అవుతున్నాయి. ఒక యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన పాత ఇంటర్వ్యూలో శివకృష్ణ.. ప్రకాష్ రాజ్ గతంలో చేసిన కొన్ని వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. సనాతన ధర్మం, హిందూ మతంపై ప్రకాష్ రాజ్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ఆయనపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఒక దశలో ఆయన ప్రవర్తన కారణంగా సినీ పరిశ్రమలో చర్యలు తీసుకునే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. శివకృష్ణ చెప్పిన ప్రకారం.. గతంలో ప్రకాష్ రాజ్ ఒక వర్గానికి సంబంధించి చేసిన వ్యాఖ్యలకిగాను తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవడంతో సినీ పరిశ్రమ పెద్దలు కలిసి ఆయనపై బ్యాన్ విధించాలని నిర్ణయించారని తెలిపారు. ఆ సమయంలో దివంగత నటుడు అక్కినేని నాగేశ్వరరావు కూడా అంతా చట్టబద్ధంగానే ఉంది.. ముందుకు వెళ్లండి అంటూ మద్దతు తెలిపారని, నాగార్జున కూడా ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా వ్యవహరించలేదని ఆయన గుర్తుచేశారు. అలాగే ఆ ఘటన తర్వాత ప్రకాష్ రాజ్ స్వయంగా తన వద్దకు వచ్చి సమస్యను పరిష్కరించాలని కోరారని శివకృష్ణ వెల్లడించారు. ప్రస్తుతం కూడా హిందూ మతం, సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపిస్తూ.. అలాంటి వ్యాఖ్యలను సినీ పరిశ్రమ ఉపేక్షించకూడదని అన్నారు. ప్రకాశ్ రాజ్‌పై తగిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే సినిమాల్లో అవకాశాల విషయంలో కూడా కఠిన నిర్ణయాలు తీసుకోవాలని శివకృష్ణ అభిప్రాయ పడ్డారు. బ్యాన్ తర్వాత ప్రకాష్ రాజ్ స్వయంగా ఇంటికి వచ్చి నన్ను వదిలేయండి అని బతిమలాడుకున్నాడని శివకృష్ణ స్పష్టం చేశారు.. నాడు అంతలా దిగివచ్చిన వ్యక్తి.. ఈరోజు హిందూ మతంపై ఇన్ని దారుణమైన వ్యాఖ్యలు చేస్తుంటే ఇండస్ట్రీ ఎందుకు సైలెంట్‌గా ఉందంటూ ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతం ఆయన చేసిన ఈ పాత వ్యాఖ్యల వీడియో మళ్లీ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ చర్చకు దారితీస్తోంది.

# పది రూపాయల నాణేలతో బైక్ కొనుగోలు

### బైక్ కోసం లక్షా పదివేల మొత్తం చెల్లింపు
### నాణేలు చెల్లించడంపై సోషల్ మీడియాలో వైరల్



**నల్లగొండ, జూలై8 (జనంసాక్షి) :** కొంత మంది తాము చేసే పని వినూత్నంగా ఉండాలని భావిస్తారు. అలా చేయడంతో వారి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంటాయి. తాజాగా బైక్ కొనుగోలు చేయడానికి ఎంచుకున్న మార్గంతో ఓ వ్యక్తి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నారు. నల్గొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన కొండే రఘుపతి బైక్ కొనుగోలు చేశారు. అందుకు అవసరమైన రూ.1.10 లక్షల మొత్తాన్ని రూ.10 నాణెళిల రూపంలో చెల్లించారు. ఈ బైక్ కొనడం కోసం చాలా కాలంగా ఆయన రూ.10 నాణెళిలను పొదుపు చేస్తూ వచ్చారు. అలా దాచిన నగదును అంతా కవర్లలో నింపుకుని బైక్ షోరూమ్‌కు వెళ్లారు. ఈ నగదు చెల్లించి తనకు ఇష్టమైన స్ప్లెండర్ ప్లస్ బైక్‌ను ఆయన కొనుగోలు చేశారు. షోరూమ్‌లోని సిబ్బంది అంతా కలిసి ఈ నగదును లెక్కించారు. నగదు లెక్కించడానికి కొన్ని గంటల సమయం పట్టింది. అందుకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. దీనిపై నెటిజన్లు స్పందించారు. కొండే రఘుపతి పొదుపుతోపాటు పట్టుదలను వారు అభినందించారు. నగదు లెక్కించిన షోరూమ్ సిబ్బందికి సెల్యూట్ చేశారు నెటిజన్లు.

# వరుసగా మూడోరోజూ కమిటీ భేటీ

### వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థులు, అధ్యాపకులతో చర్చ

**హైదరాబాద్, జూలై8 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో పాల్గొన్న నిజమైన ఉద్యమకారుల గుర్తింపు, వారి సంక్షేమమే ఆశయంగా ఏర్పడిన ఉన్నత స్థాయి కమిటీ అధికారిక సమావేశాలు 'తెలంగాణ అమర జ్యోతి' ప్రాంగణంలో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ సంప్రదింపుల ప్రక్రియ బుధవారానికి విజయవంతంగా 3వ రోజుకు చేరుకుంది. కమిటీ గౌరవ ఛైర్మన్ డాక్టర్ కె. కేశవరావు అధ్యక్షతన, కమిటీ సభ్యులు సమక్షంలో స్త్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థి ఉద్యమకారులు మరియు అధ్యాపక ప్రతినిధులతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఈనాటి కీలక సమావేశంలో జేఎన్‌టీయూహెచ్ , తెలంగాణ యూనివర్సిటీ, మహాత్మా గాంధీ యూనివర్సిటీ, పాలమూరు యూనివర్సిటీ, శాతవాహన యూనివర్సిటీ , తెలుగు విశ్వవిద్యాలయం, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, మరియు కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయాలకు చెందిన మలిదశ ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమావేశంలో పాల్గొన్న వివిధ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు కమిటీ ముందు తమ ఆకాంక్షలను, విలువైన సలహాలను ఉంచారు. ఉద్యమకారులను కేవలం రాజకీయాల కోణంలో కాకుండా పారదర్శకంగా గుర్తించాలని కోరారు. ముఖ్యంగా, కేవలం ఐడెంటిటీ కార్డుల జారీతో సరిపెట్టకుండా, ఉద్యమ సమయంలో సర్వస్వం కోల్పోయిన కుటుంబాలను ఆదుకోవడానికి విద్యా, వైద్య, ఆర్థిక రంగాల్లో విప్లవాత్మకమైన 'సామాజిక సంస్కరణలు' తీసుకురావాలని, తద్వారా ఆయా కుటుంబాలకు శాశ్వత సామాజిక భద్రత కల్పించాలని గట్టిగా విజ్ఞప్తి చేశారు. 'తెలంగాణ మలిదశ ఉద్యమ రథసారథులు మన విద్యార్థులు మరియు మేధావులు. 3వ రోజు ముమ్మరంగా జరిగిన ఈ సమావేశాలలో వివిధ వర్సిటీల నుండి వచ్చిన ప్రతినిధులు అత్యంత విలువైన ప్రతిపాదనలను, సామాజిక సంస్కరణల విజ్ఞాపనలను కమిటీకి అందించారని ఛైర్మన్ డాక్టర్ కె. కేశవరావు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా, నిఖార్సైన ప్రతి ఒక్క ఉద్యమకారుడిని గుర్తించి, గౌరవించడమే మా ప్రభుత్వ ప్రధాన సంకల్పం. ఈ రోజు సేకరించిన అన్ని నివేదికలను మరియు సామాజిక భద్రతా ప్రతిపాదనలను త్వరలోనే గౌరవ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తాం. ఉద్యమకారుల త్యాగాలకు తగిన న్యాయం జరిగేలా కమిటీ తుది నివేదికను పారదర్శకంగా సిద్ధం చేస్తుందని అన్నారు.

# బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం శోభాయామానంగా జరగాలి

- 20, 21, 22 తేదీల్లో సమన్వయంతో నిర్వహించాలి
- దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఆషాడ బోనాల ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవాన్ని అత్యంత శోభాయమానంగా, కన్నుల పండువగా నిర్వహించాలని దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ఏడు వందల సంవత్సరాల చరిత్ర కలిగిన ఎల్లమ్మ అమ్మవారు బల్కంపేటలో కొలువై వుండటం తెలంగాణ రాష్ట్రానికి మంగళప్రదం అని మంత్రి అన్నారు. ఈ నెల 20, 21, 22 తేదీల్లో నిర్వహించనున్న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి వార్షిక కళ్యాణోత్సవ సమన్వయ సమావేశంలో మంత్రి సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ అమ్మవారి దర్శనం చేసుకుని, పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. వారి ఆధ్వర్యంలో సాగిన ఈ సమావేశంలో ఆషాడ బోనాల ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్ల పై వివిధ శాఖలకు అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డైరక్టర్ హనుమంతరావు, జలమండలి ఎండి అశోక్ రెడ్డి, ఐ అండ్ పిఆర్ ప్రత్యేక కమిషనర్ ముకుంద రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక అల, అడిషనల్ సిపి ఇక్బాల్, సాంస్కృతిక శాఖ డైరక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, ఆర్ అండ్ బి సిఈ నర్సింహా రావు, దేవాదాయ, టిజిఎస్పి డిసిఎల్, జిహెచ్ఎంసి, పోలీస్, ట్రాఫిక్, అగ్నిమాపక, వైద్యారోగ్య శాఖ తదితర శాఖలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. బల్కంపేట దేవస్థానంలో ఈ నెల 20వ తేదీన సాయంత్రం 5 గంటలకు ఎదుర్కోలు ఉత్సవంతో వార్షిక కళ్యాణోత్సవాలు ప్రారంభమవు తాయని, 21న ఉదయం 9 గంటలకు అత్యంత వైభవంగా అమ్మవారి కళ్యాణోత్సవం నిర్వహించనున్నారని, 22వ తేదీన సాయంత్రం 6 గంటలకు రథోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. బోనాల సందర్భంగా లక్షలాది మంది భక్తులు తరలివచ్చే నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. భక్తులు వచ్చిపోయే మార్గలతో పాటు, క్యూలైన్లలో తోపులాట జరగకుండా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని మంత్రి నిర్దేశించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని విఐపి, వివిఐపిలకు కేటాయించిన ఎంట్రెన్స్‌ల దగ్గర భద్రత పెంచడంతో పాటు వారికి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సురేఖ సూచించారు. టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా భక్తుల సందేహాలను తీర్చాలని సూచించారు. దేవాదాయ శాఖ ఆలయ పరిసరాల్లో ప్రత్యేక పుష్ప, విద్యుత్ దీపాలంకరణ, కళ్యాణ మండపం, రథోత్సవ ఏర్పాట్లు, ప్రసాదాల పంపిణీ, వాలంటీర్ల నియామకం, భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని మంత్రి ఆదేశించారు. పోలీసు, ట్రాఫిక్ శాఖలు పటిష్టమైన బందోబస్తుతో పాటు ట్రాఫిక్ మళ్లింపు, ప్రత్యేక పార్కింగ్ స్థలాలు, రద్దీ నియంత్రణ, క్యూ లైన్ నిర్వహణ, మహిళలు, వృద్ధులు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. మహిళలు, వృద్ధులు, శివసత్తులు, చిన్నారులు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు దిశగా శ్రద్ధ పెట్టాలని సూచించారు. జీహెచ్ఎంసీ ఆలయ పరిసరాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, రోడ్ల మరమ్మతులు, చెత్త తొలగింపు, దోమల నివారణ, స్ట్రీట్ లైట్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, మొబైల్ టాయిలెట్లు, శానిటేషన్ ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు. జలమండలి నిరంతర తాగునీటి సరఫరాతో పాటు వాటర్ ట్యాంకర్లు, తాగునీటి పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భక్తులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని జలమండలి ఎండి అశోక్ రెడ్డికి మంత్రి సురేఖ సూచించారు. ఆర్టీసీ భక్తుల రాకపోకలకు ప్రత్యేక బస్సులు నడపాలని, సాంస్కృతిక శాఖ బోనాల వైభవాన్ని ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, సమాచార పౌరసంబంధాల శాఖ ఉత్సవాల తేదీలు, కార్యక్రమాలు, ట్రాఫిక్ మళ్లింపులు, భక్తులకు సూచనలు తదితర సమాచారాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి ఆదేశించారు. సమావేశం లో పాల్గొన్న అధికారులు తమ శాఖల వారీగా చేపడుతున్న ఏర్పాట్లను మంత్రికి వివరించగా, నిర్దేశించిన గడువులో అన్ని పనులు పూర్తి చేసి భక్తి, భద్రత, పరిశుభ్రత, సౌకర్యాల కల్పన అనే నాలుగు అంశాలకు ప్రాధాన్యమిస్తూ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని మంత్రి కొండా సురేఖ పునరుద్ఘాటించారు. సాంస్కృతిక శాఖ తరపున చేపడుతున్న కార్యక్రమాల పై మంత్రి కొండా సురేఖ ఆరా తీశారు. ఎదుర్కోలు, కళ్యాణోత్సవం, రథోత్సవం సందర్భంగా ఆ శాఖ తరఫున చేపడుతున్నట్లు ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి ఆషాడ బోనాల జాతర, ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణోత్సవం పోస్టర్ లను మంత్రి సురేఖ ఆవిష్కరించారు.

# ఇండోనేషియాలో ప్రధాని నోట కుచ్ కుచ్ హోతా హై

- కృతజ్ఞతలు తెలిపిన దర్శకుడు కరణ్ జోహార్



**ముంబై, జూలై 8 (జనంసాక్షి) :** భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇండోనేషియా పర్యటనలో చేసిన కామెంట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. జకార్తాలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ మోదీ.. బాలీవుడ్ సూపర్ హిట్ చిత్రం 'కుచ్ కుచ్ హోతా హై' లోని టైటిల్ సాంగ్‌ను ప్రస్తావిస్తూ భారత్-ఇండోనేషియా సంబంధాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దీనిపై ఆ చిత్ర దర్శకుడు కరణ్ జోహార్ ఆనందం వ్యక్తం చేస్తూ ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. ఇండోనేషియాలో భారతీయ సంస్కృతికి మంచి ఆదరణ ఉందని పేర్కొన్న ప్రధాని మోదీ.. అక్కడ 'కుచ్ కుచ్ హోతా హై' పాట ఎంతో ప్రాచుర్యం పొందిందని చెప్పారు. ఇండోనేషియాలో భారతదేశానికి చెందిన 'కుచ్ కుచ్ హోతా హై' పాట చాలా ప్రాచుర్యం పొందింది. భారత్, ఇండోనేషియా కలిసి ముందుకు సాగినప్పుడు మన ప్రయాణం కేవలం 'కుచ్ కుచ్' దగ్గరే ఆగిపోకుండా 'బహుత్ కుచ్' సాధించే దిశగా సాగాలి' అని వ్యాఖ్యానించారు. మోదీ చేసిన ఈ చమత్కార వ్యాఖ్యలకు సభలో చప్పట్లతో స్వాగతం లభించింది. ప్రధాని మోదీ తన సినిమాను ప్రస్తావించడంపై ప్రముఖ దర్శకుడు, నిర్మాత కరణ్ జోహార్ సోషల్ మీడియా ద్వారా స్పందించారు. జకార్తాలో మన గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'కుచ్ కుచ్ హోతా హై' సినిమా గురించి మాట్లాడటం ఎంతో ఆనందంగా, గర్వంగా అనిపించింది. ప్రేమకు సరిహద్దులు లేవని, అది అందరికీ అర్థమయ్యే భాష అని ఈ సందర్భం మరోసారి నిరూపించింది. మా సినిమాను, ఆ పాటను గుర్తుచేసినందుకు ధన్యవాదాలు అని ఆయన పేర్కొన్నారు.

# ఇప్పుడు అయోధ్య.. గతంలో వారణాసి

- దేవుళ్లకే పంగనామాలు పెట్టిన దగుల్బాజీలు
- హిందువుల విశ్వాసాలను దెబ్బతీసిన దౌర్భాగ్యులు


నిధుల దుర్వినియోగంపై హనుమంతునికి లేఖ సమర్పిస్తున్న నేషనల్ ఈక్వల్ పార్టీ కన్వీనర్ శశి ప్రతాప్ సింగ్

**వారణాసి, జూలై8 (జనంసాక్షి) :** ఆలయంలో దోపిడీ అంటే భక్తుల నమ్మకాన్ని, విశ్వాసాన్ని దోచుకోవడమే. ఇటీవల అయోధ్య రామమందిర విరాళాల చోరీ ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అయోధ్య రామాలయంలో విరాళాల దుర్వినియోగం కేసు నేపథ్యంలో, గతంలో జరిగిన కాశీ విశ్వనాథుడి ఆలయ దోపిడీ ఘటన మళ్లీ చర్చనీయాంశమైంది. నాలుగు దశాబ్దాల క్రితం, కాశీ విశ్వనాథ ఆలయంలో జరిగిన ఒక దొంగతనం కారణంగా దాని నిర్వహణను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవలసి వచ్చింది. 1983 జనవరిలో, కాశీ విశ్వనాథ ఆలయ గర్భగుడిలో శివలింగం చుట్టూ ఉన్న 2.6 కిలోల బంగారు ఆభరణాలు, దాదాపు 9 కిలోల వెండి చోరీకి గురయ్యాయి. ఈ చోరీకి పాల్పడిన 11 మందిని అరెస్ట్ చేశారు. అప్పుడు కూడా ఆలయంలో పని చేసే వారి సహాయంతోనే దోపిడీ జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. ఘటన అనంతరం కాశీ విశ్వనాథ ఆలయ భద్రత, ఆర్థిక నిర్వహణలో లోపాలపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకొచ్చింది. ఆలయ నిర్వహణను ప్రభుత్వం ఏర్పాటు చేసిన ట్రస్ట్ బోర్డు ఆధీనంలోకి తీసుకువచ్చింది. అప్పటి నుంచి భద్రతా వ్యవస్థలు, విరాళాల లెక్కింపు, పరిపాలనలో పలు సంస్కరణలు అమల్లోకి వచ్చాయి. అయోధ్య రామమందిర విషయంలో కూడా ప్రభుత్వం నూతన సంస్కరణలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. కాగా, రామ మందిర ఆలయ ట్రస్టుకు జవాబుదారీగా ఉండే సీఈవో నియామకానికి తాము అంగీకరిస్తామని, అయితే ప్రభుత్వ స్వాధీనాన్ని మాత్రం అనుమతించబోమని వీహెచ్‌పీ తెలిపింది. శ్రీ రామ్ జన్మభూమి ఆలయాన్ని ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకువచ్చే ఏ ప్రయత్నాన్నైనా తాము వ్యతిరేకిస్తామని వీహెచ్‌పీ పేర్కొంది.

# ఎస్సీ బాలికల హాస్టల్‌లో విద్యార్థిని ఆత్మహత్య



**కామారెడ్డి, జూలై 8 (జనంసాక్షి) :** జిల్లాలోని బాన్సువాడ ఎస్సీ బాలికల హాస్టల్‌లో విద్యార్థిని ఆత్మహత్య కలకలం రేపుతుంది. హాస్టల్ గదిలో ఇంటర్ విద్యార్థిని అమృత ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మద్నూర్ మండలం లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన అమృత హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ బైపీసీ ఫస్ట్ ఇయర్ చదువుతుంది. జ్వరం ఉందని కాలేజీకి వెళ్లకుండా ఉదయం హాస్టల్‌లోనే ఉండిపోయింది. మధ్యాహ్నం వచ్చిన తోటి విద్యార్థినిలు అమృత ఆత్మహత్య విషయాన్ని హాస్టల్ సిబ్బందికి సమాచారం అందజేశారు. దీంతో వారు పోలీసులకు, విద్యార్థిని కుటుంబ సభ్యులకు వివరించారు. కుటుంబ సభ్యులు హాస్టల్‌కు చేరుకుని ఆందోళన నిర్వహించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎపిలో హాస్టల్, గురుకులాల మెస్ ఛార్జీల పెంపు

**అమరావతి, జూలై 8 (జనంసాక్షి) :** హాస్టళ్లు, గురుకులాల మెస్ ఛార్జీలను పెంచాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సంక్షేమ శాఖల మంత్రులతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సచివాలయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం ఇస్తున్న ఛార్జీలపై 10 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నామని సీఎం పేర్కొన్నారు.

# గురుకుల విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై అప్రమత్తం

- వర్షాకాల నేపథ్యంలో ప్రత్యేక చర్యలు
- పారదర్శక అడ్మిషన్ల పక్రియ నిర్వహించాలి
- నాణ్యమైన బోధనకు పటిష్ట చర్యలు చేపట్టాలి
- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**హైదరాబాద్, జూలై8 (జనంసాక్షి) :** తెలంగాణ సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, పరిశుభ్రత, నాణ్యమైన విద్యకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో తాగునీరు, వేడి నీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలపై ప్రత్యేక నిఘా పెట్టాలని స్పష్టం చేశారు. రాష్ట్ర సచివాలయంలో విద్యా సంస్థల్లో అడ్మిషన్ల పక్రియ, విద్యా నిర్వహణ, విద్యార్థుల సంక్షేమం, వర్షాకాల ఏర్పాట్లపై మంత్రి సమీక్ష నిర్వహించారు. సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ... గురుకులాల్లో ప్రవేశాల పక్రియ పూర్తిస్థాయి పారదర్శకతతో, నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని ఆదేశించారు. అర్హులైన పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో సీట్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత విద్యాసంవత్సరంతో పోలిస్తే ఈసారి అడ్మిషన్ల సంఖ్య పెరిగిందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు, వసతి, తరగతి గదులు, బోధన సిబ్బంది, వంటశాలల సామర్థ్యాన్ని పెంచాలని మంత్రి సూచించారు. ఎక్కడైనా బోధన సిబ్బంది కొరత ఉంటే సంబంధిత జిల్లా కలెక్టర్ల అనుమతితో నిబంధనల ప్రకారం తాత్కాలిక నియామకాలు చేపట్టి బోధనకు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. వర్షాకాలంలో వైరల్ జ్వరాలు, డెంగీ, మలేరియా, నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల ముప్పు పెరుగుతుందని, ప్రతి గురుకులంలో ముందస్తు ఆరోగ్య ప్రణాళిక అమలు చేయాలని మంత్రి స్పష్టం చేశారు. విద్యార్థులకు అవసరమైన వేడి నీరు అందుబాటులో ఉంచాలని, తాగునీరు పరిశుభ్రంగా ఉండేలా నీటి ట్యాంకుల శుభ్రపరిచే కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. నీటి నాణ్యతను పరీక్షించి, అవసరమైన చోట వాటర్ ప్యూరిఫయైర్లు, క్లోరినేషన్, ఫిల్టరేషన్ సదుపాయాలను సమర్థంగా వినియోగించాలని చెప్పారు. బాలికల గురుకులాలు, హాస్టళ్లలో మరింత అప్రమత్తత అవసరమని మంత్రి పేర్కొన్నారు. టాయిలెట్లు, బాత్‌రూమ్‌లు ప్రతిరోజూ శుభ్రంగా, పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సానిటరీ న్యాప్‌కిన్ల అందుబాటు, డిస్పోజల్ యూనిట్లు, మహిళా ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు, అవసరమైన చోట మహిళా కౌన్సెలర్ల సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ప్రతి గురుకులంలో ప్రాథమిక వైద్య సదుపాయాలు, అత్యవసర మందులు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉండాలని మంత్రి తెలిపారు. సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులతో సమన్వయం చేసుకుని విద్యార్థులకు నిరంతర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జ్వరం, వాంతులు, విరేచనాలు, చర్మవ్యాధులు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైతే చికిత్సకు పంపే విధంగా ఆరోగ్య ప్రోటోకాల్ అమలు చేయాలని సూచించారు. వంటశాలలు, డైనింగ్ హాళ్లు, నిల్వ గదుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు. నాణ్యమైన కూరగాయలు, పాలు, గుడ్లు, ఇతర ఆహార పదార్థాల సరఫరా నిరంతరంగా జరిగేలా పర్యవేక్షించాలని, నిల్వ ఆహార పదార్థాల నాణ్యతను తరచుగా తనిఖీ చేయాలని చెప్పారు. విద్యార్థులకు పౌష్టికాహారం, సురక్షితమైన వసతి, ఆరోగ్యకరమైన విద్యా వాతావరణం కల్పించడం సంస్థల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను దశలవారీగా విస్తరించేందుకు ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల విద్యార్థులకు పోటీ పరీక్షల శిక్షణ, ఉన్నత విద్యా అవకాశాలు మరింత చేరువయ్యేలా సీఓఈల విస్తరణకు కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370